ప్రతిపక్షం

www.prathipaksham.in

మంగళవారం 11.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 231 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu



'సన్ రైజర్స్' నుంచి ఆ ఐదుగురు ఔట్ 12



కారులో ఉంచిన పేలుడు పదార్థాలను రిమోట్ కంట్రోల్ సాయంతో పేల్చి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో దేశరాజధానిలో ఢిల్లీ పోలీసులు హై అలెర్ట్ ప్రకటించారు. ఎర్రకోట సహా కీలక ప్రాంతాలకు అదనపు బలగాలను తరలించారు. నగరంలో భారీ ఎత్తున తనిఖీలు చేపట్టారు. క్లూస్ టీమ్, ఎన్ఐఏ, ఎన్ఎస్జీ బృందాలు రంగంలోకి దిగి విచారణ ప్రారంభించాయి. ఢిల్లీ, హర్యానా, యూపీ సరిహద్దులో నిఘాను పెంచారు. రైల్వే స్టేషన్లు, మెట్రోస్టేషన్లు వంటి సున్నిత ప్రాంతాలలోనే తనిఖీలు ముమ్మరం చేశారు. సింఘు, టిక్రీ, బదర్‌పూర్ సరిహద్దుల వద్ద అదనపు పికెట్‌లను ఏర్పాటు చేశారు.

ఢిల్లీలో భారీ పేలుడు

10 మంది మృతి: 15 మందికి గాయాలు.. ముగ్గురి పరిస్థితి విషమం

- ఆస్పత్రులకు క్షతగాత్రులందరి తరలింపు
- ఒక్కసారిగా వణికిపోయిన మహా నగరం
- భయంతో పరుగులు తీసిన స్థానికులు
- వెంటనే సహాయక చర్యలు చేపట్టిన అధికారులు
- ఎర్రకోట సమీపంలోని ఓ కారులో పేలుడు
- సమీపంలోని వాహనాలకు అంటుకున్న మంటలు
- తీవ్రంగా శ్రమించి మంటలనార్పిన 25 శకటాలు
- సమగ్ర విచారణకు ఆదేశించిన కేంద్ర ప్రభుత్వం
- ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ప్రధాని మోడీ
- హోమ్ మంత్రి అమిత్ షాతో, ఉన్నతాధికారులతో ఆరా
- ఆస్పత్రులలో గాయపడినవారిని పరామర్శించిన షా
- ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్, మాజీ సీఎం కేసీఆర్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, నవంబర్ 10 : దేశ రాజధాని ఢిల్లీ సోమవారం ఉదయం పేలుళ్లతో వణికిపోయింది. ఎర్రకోట సమీపంలో నిలిపి ఉంచిన ఓ స్విఫ్ట్ కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో పది మంది మృతిచెందారు. అనేక మందికి తీవ్రంగా గాయాలయ్యాయి. వారందరినీ సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. ఇందులో ముగ్గురి పరిస్థితి చాలా విషమంగా ఉంది. గేట్ నంబర్ వన్ మెట్రో స్టేషన్ వద్ద జరిగిన ఈ ఘటనలో అనేక వాహనాలు మంటలంటుకుని దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా భారీ శబ్దాలు రావడంతో స్థానికులు చెంబేలెత్తిపోయారు. పేలుడు శబ్దం కొన్ని కిలోమీటర్ల దూరంలోని వరకు వినబడిందని వారు

..:: మిగతా 2లో




'లోక కవి' అందెశ్రీ అస్తమయం

గుండెపోటుతో స్వగృహంలోనే తుది శ్వాస

విషాదంలో మునిగిన కళా, సాహితీ ప్రపంచం

- కన్నీటితోనే ప్రజా వాగ్గేయకారుడికి నివాళి
- మేధో ప్రపంచానికి తీరని లోటన్న ప్రధాని మోడీ
- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- సంతాపం తెలిపిన ఉప ముఖ్యమంత్రి, మంత్రులు
- సన్నిహిత మిత్రుడిని కోల్పోయానన్న కిషన్ రెడ్డి
- తెలంగాణ సమాజానికి తీరని నష్టమన్న కేసీఆర్
- తెలుగు సాహితీలోకం చిన్నబోయింది
- ఏపీ సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కళ్యాణ్
- నేడు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- హాజరు కానున్న సీఎం రేవంత్, మంత్రులు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 10 : ప్రముఖ కవి, రచయిత, ప్రజా వాగ్గేయకారుడు అందెశ్రీ (64) కన్నుమూశారు. హైదరాబాద్ లాలాగూడలోని తన ఇంటిలో ఆదివారం అర్ధరాత్రి తరువాత ఆయన అస్వస్థతకు గురి కాగా, కుటుంబసభ్యులు హుటాహుటిన గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన అక్కడి వైద్యులు అందెశ్రీ అప్పటికే మృతి చెందారని వెల్లడించారు. ఇంటిలోనే సోమవారం ఉదయం 7.20కు తుది శ్వాస విడిచారని చెప్పారు. అందెశ్రీ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,పలువురు సంతాపం వ్యక్తం చేశారు. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరుపాలని, అందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను

..:: మిగతా 2లో





ముగింపు దిశగా అమెరికా షట్‌డౌన్

అమెరికా చరిత్రలోనే అత్యంత సుదీర్ఘంగా 40 రోజులుగా కొనసాగుతున్న ప్రభుత్వ షట్‌డౌన్‌కు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యకలాపాలను పునరుద్ధరించేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు అమెరికా సెనేట్ ఆమోదముద్ర వేసింది.


11



నవంబర్ చివరికి కర్ణాటక సీఎం మార్పు

కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశంపై ఊహాగానాలు కొనసాగుతూనే ఉన్నాయి. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేండ్లు పూర్తికావొస్తున్న నేపథ్యంలో నవంబర్ చివరి నాటికి సీఎం మార్పు ఉంటుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

11



ఇక డిజైనర్ బేబీల సృష్టి

అమెరికా స్టార్టప్ కంపెనీ జీన్ ఎడిటింగ్ టెక్నాలజీకి పెద్దపీట వేసింది. డిజైనర్ బేబీలను సృష్టించేందుకు ఆ కంపెనీ ప్రయోగాలు చేపడుతున్నది. సిలికాన్ వ్యాలీకి చెందిన బిలియనీర్లు ఆ ప్రాజెక్టు కోసం నిధులు ఇస్తున్నట్లు తెలుస్తోంది.

11



ఒకే కుటుంబంలో ఐదుగురు దుర్మరణం

ఇంటి పైకప్పు కూలి ఒకే కుటుంబానికి ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. బిహార్ రాష్ట్రంలోని పాట్నా రెవెన్యూ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది.

11

'జూబ్లీహిల్స్' పోలింగ్ నేడే

- ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి
- 407 పోలింగ్‌కేంద్రాలలో ఓటింగ్
- 226 సమస్యాత్మకమైనవిగా గుర్తింపు
- ఆయా ప్రాంతాలలో 144 సెక్షన్ విధింపు
- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు
- 230 మంది రైడీషీటర్ల బైండోవర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్10: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగనుంది. నియోజకవర్గంలో 4, 1,365 మంది ఓటర్లు ఉన్నారు. 58 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఎన్నికల కోసం 407 పోలింగ్ కేంద్రాలను

..:: మిగతా 2లో



స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్

సుప్రీంకోర్టుకు సమర్పించిన బీఆర్ఎస్


- వెంటనే విచారణ జరపాలని అభ్యర్థన
- గడువు ముగిసినా చర్యలు తీసుకోలేదు
- 'ఫిరాయింపు' ఎమ్మెల్యేలు అలాగే ఉన్నారు
- కావాలనే స్పీకర్ కాలయాపన చేస్తున్నారు
- పిటిషన్ లో వివరించిన బీఆర్ఎస్ పార్టీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, నవంబర్ 10: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు ముగిసినా, ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ పిటిషన్ దాఖలు చేసింది. పిటిషన్‌ను త్వరగా విచారణకు స్వీకరించాలని అభ్యర్థించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై జూలై 31న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేసింది. అక్టోబర్ 31వ తేదీ లోపు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించిందని తెలిపింది. అత్యున్నత స్థానం

..:: మిగతా 2లో





మధ్యాహ్న భోజనం విషపూరితం

- జమ్మికుంటలో 26 మంది విద్యార్థులకు అస్వస్థత
- వాంతులు, తలనొప్పి, విరేచనాలు
- తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఆందోళన

..:: 2లో



టీడీపీ అభిమానుల ఓటు ఎటు?!

- ఆసక్తిగా మారిన 'జూబ్లీ' ఉప ఎన్నిక
- వారు ఎవరికి మద్దతు పలుకుతారనే తీవ్ర చర్చ
- గెలుపోటముల లెక్కలు వేసుకుంటున్న పార్టీలు
- మూడు పార్టీల అభ్యర్థులకు టీడీపీ మూలాలు

..:: 2లో

రైతు కుటుంబం ఆత్మహత్యాయత్నం

- కరీంనగర్ కలెక్టరేట్ వద్ద ఘటన
- వెంటనే అడ్డుకున్న పోలీసులు, సిబ్బంది
- తమ భూమిని లాక్కున్నారని ఆవేదన
- తక్షణమే తమకు న్యాయం చేయాలని వినతి
- పూర్తి స్థాయి విచారణకు అధికారుల ఆదేశం

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్

నవంబర్ 10 : కలెక్టరేట్ వద్ద సోమవారం ప్రజావాణి కార్యక్రమం లో హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. గన్నేరువరం మండలం గోపాల్ పూర్‌కు చెందిన ఒక కుటుంబం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని వారిని అడ్డుకుని ఆసుపత్రికి తరలించారు. లోయర్ మానేరు డ్యామ్ లో తిమ్మాపూర్ మండలం గోపాలపురం మునిగిపోయింది. ఆ సమయంలో

..:: మిగతా 2లో



రాష్ట్రీయం

దేశ విద్యా రంగానికి 'మౌలానా' పునాదులు

- సేవలను స్మరించుకున్న సీఎం రేవంత్ రెడ్డి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 10 : స్వాతంత్ర్య భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా పని చేసి దేశ విద్యా రంగానికి పునాదులు వేసిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్ కే దక్కుతుందని ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విద్యారంగ ప్రగతికి ఆజాద్ చేసిన సేవలను సీఎం స్మరించుకున్నారు. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా, వయోజన అక్షరాస్యత, సార్వత్రిక ప్రాథమిక విద్య, 14 సంవత్సరాల్లోపు బాలబాలికలందరికీ నిర్బంధ ఉచిత విద్య, వృత్తి శిక్షణతో పాటు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఏర్పాటు వంటి విభిన్న విధానాలతో దేశంలో విద్యారంగాభివృద్ధికి ఆజాద్ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఆయన జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. మౌలానా ఆజాద్ స్పూర్తితో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగానే గ్రామీణ, నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు ముఖ్య మంత్రి తెలిపారు.

'జూబ్లీహిల్స్' పోలింగ్ నేడే

మొదటిపేజీ తరువాయి

ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నాలుగు ఈవీఎంలు ఉంటాయి. కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియం నుంచి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలించారు. సోమవారం సాయంత్రం నుంచే పోలింగ్ అధికారులు ఈవీఎంలు తీసుకెళ్లారు. మూడు వేల మంది పోలింగ్ సిబ్బంది, రెండు వేల మంది పోలీసులతో కలిపి ఐదు వేల మంది పోలీసులు ఉప ఎన్నికల విధులలో ఉన్నారు. 407 పోలింగ్ కేంద్రాలలో 226 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. ఆయా ప్రాంతాలలో 144 సెక్షన్ విధించారు. ఈసారి డ్రోన్ల ద్వారా పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ జరుగనుంది. 103 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. సమస్యాత్మక ప్రాంతాలలో కేంద్ర బలగాలతో భద్రత కట్టుదిట్టం చేశారు. 45 ఫ్లైయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 230 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేశారు. నిబంధనలు అతిక్రమించిన 27 మందిపై కేసులు నమోదు చేశారు.

గోపీనాథ్ మరణంతో ఉపఎన్నిక

జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఉపఎన్నిక అనివార్యమైంది. బీఆర్ఎస్ నుంచి మాగంటి గోపీనాథ్ భార్య మాగంటి సునీత బరిలో ఉండగా, కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి పోటీలో ఉన్నారు. మూడు ప్రధాన పార్టీల నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఎలాగైన ఉప ఎన్నికలో గెలవాలని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తీవ్రంగా కృషి చేశాయి. మరి జూబ్లీహిల్స్ ప్రజలు ఎవరికి పట్టం కట్టనున్నారో చూడాలి మరి.



మధ్యాహ్న భోజనం విషపూరితం

- జమ్మికుంటలో 26 మంది విద్యార్థులకు అస్వస్థత
- వాంతులు, తలనొప్పి, విరేచనాలు
- తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఆందోళన

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 10: కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం భోజనం వికటించడంతో 26 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. భోజనం చేసిన కొద్దిసేపటికే పలువురికి వాంతులు, తలనొప్పి, విరేచనాలు కావడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే విద్యార్థులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక పరీక్షల్లో తేలికపాటి ఫుడ్ పాయిజన్ లక్షణాలు ఉన్నాయని, అందరూ ప్రమాదం నుంచి బయటపడ్డారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రికి చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు పాఠశాలకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు.తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఆందోళన చెందారు.

టీడీపీ అభిమానుల ఓటు ఎటు?!

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్10: జూబ్లీహిల్స్ఉప ఎన్నిక ఆసక్తిగా మారింది. ప్రధాన పార్టీలు గెలుపోటముల లెక్కలు వేసుకుంటున్నాయి. ఈ తరుణంలో ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ సానుభూతిపరుల ఓట్లు ఎటువైపు అనేది చర్చనీయాంశంగా మారింది. టీడీపీ, జనసేన, బీజేపీ ఏపీలో కూటమిగా ఉన్నాయి. తెలంగాణ మాత్రం ఇప్పటి వరకు ఆ పరిస్థితి లేదు. జనసేన బీజేపీతో కలిపి నడుస్తోంది. పవన్‌కల్యాణ్ ఎన్నికల ప్రచారానికి వస్తారనుకున్నా అది జరగలేదు. కాంగ్రెస్ నుంచి ఉన్న నవీన్‌యాదవ్ తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ మూలాలు, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత భర్త గోపీనాథ్ ఎదుగుదల టీడీపీ నుంచే ప్రారంభమయ్యాయి. బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డికి కూడా టీడీపీతో అనుబంధ ఉంది. మాగంటి టీడీపీ నుంచి గెలిచి బీఆర్ఎస్‌లో చేరారు. ఎర్రగడ్డ, వెంగళరావునగర్, శ్రీనగర్‌కాలనీ, కృష్ణానగర్ ప్రాంతాలలో టీడీపీ అభిమానులు ఉన్నారు. ఇప్పటివరకు వారంతా గోపీనాథ్ వెంట నిలిచారు. ఇటు సీఎం రేవంత్‌రెడ్డి, అటు కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సైతం వారి మద్దతు తమకే అన్న ధీమాతో ఉన్నారు. ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు మొత్తం 58 మంది పోటీ పడుతున్నారు. ఈ సారి పోలింగ్ 50 శాతం దాటించాలని ఓటర్లకు కలెక్టర్ పిలుపునిచ్చారు.



48వ డివిజన్ సమస్యలు పరిష్కరించండి

- కలెక్టర్ కు కార్పొరేటర్ తోట గోవిందమ్మ రామారావు వినతి

ప్రతిపక్షం ప్రతినిధి, ఖమ్మం, నవంబర్ 10 : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కలెక్టర్ గ్రీవెన్స్ లో 48వ డివిజన్ కార్పొరేటర్ తోట గోవిందమ్మ రామారావు అభివృద్ధి. సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ దురుశెట్టి అనుదీప్ కు వినతి పత్రం సమర్పించారు. తదనంతరం మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని బైపాస్ రోడ్డు విస్తరణ, తారకరామా ఆటోనగర్ ఆధునీకరణ, గోళ్లపాడు ఛానల్ ఆధునీకరణలో భాగంగా జిమ్, పార్క్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, గణేష్ నగర్ రోడ్డు విస్తరణ, డ్రైనేజ్ డివిజన్ పరిధిలోని డ్రైనేజీల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ను కోరామన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను త్వరగా పూర్తి చేసే విధంగా తగు చర్య తీసుకోవాలని కోరామన్నారు. కార్పొరేషన్ కమిషనర్ కు కూడా ఒక వినతి పత్రం ఇచ్చామని చెప్పారు. వారు స్పందించి త్వరగా పనులను పూర్తి చేసే విధంగా ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తోట రామారావు, వంగాల వెంకట్, చేతి కృష్ణ, కిషన్ నాయక్, బాబా, నిరంజన్, రవీందర్, సత్యం, నవీన్, మహేష్, మధు, వీరేందర్, లింగారెడ్డి, రమణ, ప్రభాకర్, గోపాల్ వీరస్వామి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో భారీ పేలుడు

మొదటిపేజీ తరువాయి



చెబుతున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసు వాహనాలు, అగ్నిమాపక దళాలు అక్కడకు చేరుకున్నాయి. దాదాపు 25కు పైగా అగ్నిమాపక శకటాలు తీవ్రంగా శ్రమించి మంటలను ఆర్పేశాయి. ప్రధాని మోడీ వెంటనే హోమ్ మంత్రి అమిత్‌షాతో మాట్లాడి వివరాలను ఆరా తీశారు. అమిత్ షా ఢిల్లీ పోలీస్ కమిషనర్‌తో, ఐబీ డైరెక్టర్‌తో మాట్లాడారు. అనంతరం ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. వారితో మాట్లాడి సంఘటన ఎలా జరిగిందో తెలుసుకున్నారు. అయితే, ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన దాడి లాగానే కనిపిస్తోందని పోలీసులు చెబుతున్నారు.

రిమోట్ కంట్రోల్ సాయంతో

కారులో ఉంచిన పేలుడు పదార్థాలను రిమోట్ కంట్రోల్ సాయంతో పేల్చి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో దేశరాజధానిలో ఢిల్లీ పోలీసులు హై అలెర్ట్ ప్రకటించారు. ఎర్రకోట సహా కీలక ప్రాంతాలకు అదనపు బలగాలను తరలించారు. నగరంలో భారీ ఎత్తున తనిఖీలు చేపట్టారు. క్లూస్ టీమ్, ఎన్ఐఏ, ఎన్ఎస్ జీ బృందాలు రంగంలోకి దిగి విచారణ ప్రారంభించాయి. ఢిల్లీ, హర్యానా, యూపీ సరిహద్దులో నిఘాను పెంచారు. రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు వంటి సున్నిత ప్రాంతాలలోనే తనిఖీలు ముమ్మరం చేశారు. సింఘు, టిక్రీ, బదర్‌పూర్ సరిహద్దుల వద్ద అదనపు పికెట్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి సోమవారం ఢిల్లీలోని పర్యాటక ప్రదేశాలు, మార్కెట్లకు సెలవు కావడంతో ప్రమాదం తీవ్రత, ప్రాణ నష్టం తగ్గిందని అధికారులు చెబుతున్నారు.

హైదరాబాద్‌లో హైఅలర్ట్

ఢిల్లీ పేలుడు దేశవ్యాప్తంగా కలకలం సృష్టించింది. దీంతో కేంద్రం హైదరాబాద్‌సహా పలు కీలక నగరాలలో హైఅలర్ట్ ప్రకటించింది. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో, ముంబై సహా ఇతర నగరాలలో హై అలెర్ట్ ప్రకటించారు. హైదరాబాద్ పోలీసులు అప్రమత్తమై పాతబస్తీలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఉత్తరప్రదేశ్ అన్ని మతపర ప్రదేశాలు, సరిహద్దు ప్రాంతాలలోనూ భద్రత పెంచాలని ఆదేశాలు జారీ చేశామని డీజీపీ తెలిపారు. సున్నిత ప్రాంతాలలో గస్తీలు, తనిఖీలు విరివిగా సాగుతున్నాయి. హర్యానాలోని ఫరీదాబాద్‌లో మూడు వేల కిలోల పేలుడు తయారీ పదార్థాలను జమ్మూకశ్మీర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో పాకిస్తాన్‌తో సంప్రదింపులు జరుపుతున్న ముగ్గురు డాక్టర్లను ఇప్పటికే అరెస్టు చేశారు. గుజరాత్‌లో ముగ్గురు ఐసిస్ సానుభూతిపరులు అరెస్టు అయిన సమయంలోనే దేశ రాజధాని ఢిల్లీలో ఉగ్రవాదదాడి జరగడం పలు సందేహాలకు తావిస్తోంది.

ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి హోమ్ మంత్రి

కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. బాధితుల పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఘటనా స్థలిని పరిశీలించారు. ఘటనపై అన్ని కోణాలలో సమగ్ర విచారణ నిర్వహిస్తామని చెప్పారు. ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం నిఘావర్గాలు, ఎన్ఐఏ అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఘటనా స్థలికి వెళ్లాలని ఎన్ఐఏ, ఎన్ఎస్జీ, ఫోరెన్సిక్ సైన్సెస్ చీఫ్‌ను ఆదేశించారు. పేలుడు కారణంగా ఎర్రకోట సమీపంలోని చాందినీ చౌక్ మార్కెట్‌ను మంగళవారం మూసివేయాలని నిర్ణయించారు. చాందినీ చౌక్‌కు వెళ్లే అన్ని దారులనూ మూసివేశారు. ఎర్రకోట, చాందినీ చౌక్ సమీపంలోని జనాన్ని పోలీసులు వేరే చోటికి తరలించారు.

ప్రధాని నరేంద్ర మోడీ ఆరా

పేలుడు ఘటన గురించి ప్రధాని నరేంద్ర మోడీ ఆరా తీశారు. హోమ్ మంత్రి అమిత్ షా సహా ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈ ఘటన అత్యంత హృదయ విదారకమని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. ఈ ఘటన తనను తీవ్ర ఆందోళనకు గురి చేసిందన్నారు. ఈ ఘటనలో చాలా మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారన్న వార్తలు తీవ్ర బాధాకరమన్నారు. ఈ దుఃఖ సమయంలో మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ ఘటనపై సమగ్రంగా, వేగంగా దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పవన్ ఖేడా డిమాండ్ చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి

ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ అమానుష ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థించారు. ఎర్రకోట సమీపంలో జరిగిన ఘోర పేలుడు సంఘటన పట్ల టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దారుణ ఘటనలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచారకరమని అన్నారు. బాధిత కుటుంబాలకు ఇది తీరని లోటని పేర్కొన్నారు. ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్

మొదటిపేజీ తరువాయి

ఇచ్చిన గడువు ముగిసినప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పేర్కొంది. ఇంకా ఫిరాయింపు నేతలు ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నారని చెప్పింది. అందుకే మరోసారి అత్యున్నత స్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందని వివరించింది. ఈ విషయంలో ప్రొసీడింగ్స్ ఆలస్యం చేస్తే, వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవచ్చని సుప్రీంకోర్టు గతంలోనే చెప్పిందని బీఆర్ఎస్ పేర్కొంది. ఇంకా ప్రొసీడింగ్స్ ఎవిడెన్స్ స్టేజీలోనే ఉన్నాయని బీఆర్ఎస్ పార్టీ తరపు న్యాయవాదులు తెలిపారు. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి రిటైర్ అయ్యేంతవరకు ఈ ప్రక్రియను సాగదీయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ వాదనలు విన్న సీజేఐ నవంబర్ 24తో సుప్రీంకోర్టు ముగిసినట్లు కాదని స్పష్టం చేశారు. వచ్చే సోమవారం ఈ కేసు విచారణ జరుపుతామని తెలిపారు.



రైతు కుటుంబం ఆత్మహత్యాయత్నం

మొదటిపేజీ తరువాయి

సదరు రైతు కుటుంబం ఇల్లు, ఎనిమిదెకరాల వ్యవసాయ భూమి కోల్పోయారు. అందుకు నష్ట పరిహారం కింద మరో చోట వ్యవసాయం చేసుకునేందుకు ప్రభుత్వం భూమిని ఇచ్చింది. డాక్యు మెంట్లు కూడా అందజేశారు. దాదాపు 70 యేండ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూమిని కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి అక్రమంగా తమ పేర్ల మీదకు మార్చుకున్నారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. తమ భూమి కోసం అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా న్యాయం జరగలేదని, ఎవరూ తమ విన్నపాలు పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 'మా దగ్గర ఉన్న భూమి పత్రాలు, పన్నులు అన్నీ చెల్లించి ఉన్నా, కొందరు మమ్మల్ని మోసం చేశారు. అధికారుల వద్దకు మళ్లీ మళ్లీ వెళ్లినా వినిపించుకోలేదు. ఇక బ్రతికే అర్థం లేదు అని ఆత్మహత్యకు ప్రయత్నించాం' అని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటనతో కలెక్టరేట్ వద్ద కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. ప్రజావాణి వద్దకు చేరుకున్న అధికారులు బాధితులను సముదాయించే ప్రయత్నం చేశారు. భూవివాదంపై పూర్తి స్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

'లోక కవి' అందెశ్రీ అస్తమయం

మొదటిపేజీ తరువాయి

ఆదేశించారు. మంగళవారం నాడు ఘట్కేసర్ పరిధిలోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో అందెశ్రీ అంత్యక్రియలు జరుగుతాయి. సందర్శకుల కోసం లాలాపేట మున్సిపల్ స్టేడియంలో అందెశ్రీ పార్థీవదేహాన్ని ఉంచారు. అభిమానులు, పార్టీల నేతలు ఆయనను చివరి సారిగా దర్శించుకుని నివాళులు అర్పించారు.

మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటు

అందెశ్రీ మృతి పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సంతాపం తెలిపారు. 'ఎక్స్'లో స్పందిస్తూ అందెశ్రీ మృతి మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటన్నారు. ప్రజా పోరాటాలకు, ఆకాంక్షలకు అందెశ్రీ గొంతుకగా నిలిచారని అన్నారు. అందెశ్రీ కుటుంబసభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. 'ఆయన ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయి. ఒక గొప్ప కవి, మేధావి అయిన ఆయన, ప్రజల పోరాటాలకు , ఆకాంక్షలకు , అకుంఠిత స్ఫూర్తికి గొంతుకగా నిలిచారు. ఆయన పదాలకు హృదయాలను కదిలించే శక్తి, అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను ఏకం చేసే శక్తి, ప్రజల సాంఘిక హృదయస్పందనకు రూపం ఇచ్చే శక్తి ఉన్నాయి. ఆయన సామాజిక స్పృహను, సాహితీ సౌందర్యంతో మిళితం చేసిన విధానం అద్వితీయం. వారి కుటుంబసభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. ఓం శాంతి' అంటూ ప్రధాన మోడీ తెలుగులో ట్వీట్ చేశారు.

సీఎం రేవంత్ తీవ్ర దిగ్భ్రాంతి

అందెశ్రీ ఆకస్మిక మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణను రాసిన అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర సాధనలో జయ జయహే తెలంగాణ గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందని గుర్తు చేశారు. అందె శ్రీతో తనకున్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర గీతం కొత్త స్వరాలతో రూపకల్పన చేసుకున్నామని, అందెశ్రీతో కలిసి పంచుకున్న ఆలోచనలు, ఆయనతో తనకున్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలిందంటూ సంతాపాన్ని వ్యక్తం చేశారు. స్వరాష్ట్ర సాధనలో, జాతిని జాగృతం చేయడంలో ఆయన చేసిన కృషి చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. మంగళవారం అందెశ్రీ అంత్యక్రియలకు సీఎం రేవంత్ రెడ్డి హాజరు కానున్నారు.

అందెశ్రీ పాటలు లక్షలాది మందికి స్ఫూర్తి

అందెశ్రీ మరణం సాహితీ లోకానికి తీరని లోటని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అందెశ్రీతో పాల్గొనే అవకాశం తనకు వచ్చిందన్నారు. తనతో పాటు పోరుయాత్రలో చాలా సభలలో ఆయన పాల్గొనేవారని చెప్పారు. అందెశ్రీ తనకు సలహాలు కూడా ఇచ్చేవారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అందెశ్రీ నివాసానికి వెళ్లి ఆయన పార్థీవదేహానికి నివాళులు అర్పించారు. అందెశ్రీ ఆకస్మిక మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలుగు సాహితీ లోకానికి అందెశ్రీ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అందెశ్రీ ఆకస్మిక మృతిపై తెలంగాణ మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో సీతక్క, తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.





అందెశ్రీ ప్రస్థానం

1961 జూలై 18న సిద్దిపేట జిల్లా రేబర్తిలో జన్మించారు.అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. అందెశ్రీకి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతం రచించారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఇటీవల రూ. కోటి పురస్కారం తెలంగాణ ప్రభుత్వం అందించింది. కాకతీయ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. అశు కవిత్వం చెప్పడంలో అందెశ్రీ దిట్ట.2006లో గంగ సినిమాకు నంది పురస్కారం పొందారు. 2014లో అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్ సాధించారు.2015లో దాశరథి సాహితీ పురస్కారం అందుకున్నారు. 2015లో రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం తీసుకున్నారు .2022లో జానకమ్మ జాతీయ పురస్కారం సాధించారు. 2024లో దాశరధీ కృష్ణమాచార్య సాహితీ పురస్కారం పొందారు. లోక్ నాయక్ పురస్కారం అందుకున్నారు.



హెడ్ కోచ్‌గా తనకు జట్టు ప్రదర్శనే ముఖ్యం. క్రికెట్ వ్యక్తిగత ప్రదర్శనకు సంబంధించింది కాదని నమ్ముతాను. మేము వన్డే సిరీస్ ఓడిపోయాం. కోచ్‌గా ఇండివిడ్యువల్ గేమ్‌ను మెచ్చుకోవచ్చు. ఒక దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తిగా సిరీస్ ఓటమిని సెలబ్రేట్ చేసుకోలేను. టీ20 సిరీస్ వేరే.. అందులో గెలిచాం. దానిలో చాలా పాజిటివ్స్ ఉన్నాయి. కానీ వరల్డ్‌కప్‌కి ముందు మేమనుకున్న చోట లేము.

- గంభీర్,
టీమిండియా హెడ్ కోచ్





తెలంగాణ గర్వించదగిన వాగ్గేయకారుడు

- అందెశ్రీ మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటు
- నివాళులు అర్పించిన ప్రముఖులు, నేతలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో,హైదరాబాద్, నవంబర్ 10 : ప్రముఖ కవి, 'జయ జయహే తెలంగాణ' ఉద్యమ గీత రచయిత డాక్టర్ అందెశ్రీ మరణం పట్ల తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం పట్ల విచారం వ్యక్తం చేస్తూ తన సంతాపాన్ని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలో కవిగా తన పాటలతో, సాహిత్యంతో కీలక పాత్ర పోషించిన అందెశ్రీ మరణం తెలంగాణకు తీరని లోటన్నారు. ఉద్యమ కాలంలో అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. అందెశ్రీ మరణంతో శోకతప్తులైన వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. దివంగత అందెశ్రీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

నివాళులర్పించిన మంత్రి అడ్లూరి

ప్రముఖ కవి అందెశ్రీ అకాల మరణం యావత్ తెలంగాణకు తీరని లోటని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. అందెశ్రీ పార్థీవ దేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అందెశ్రీ సతీమణిని, కుమారుని ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ప్రభుత్వం తరఫున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి తెలిపారు. అనంతరం ప్రజల సందర్శనార్థం ఏర్పాటు చేసిన టెంటు, ఇతర ఏర్పాట్లను మంత్రి స్వయంగా దగ్గరుండి పరిశీలించారు. సీఎంఓ సెక్రెటరీ శ్రీనివాస రాజు, జాయింట్ కలెక్టర్ ముకుంద రెడ్డి, డీసీపీ బాల స్వామి, జీహెచ్ ఎంసీ అధికారులతో, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతారెడ్డి తో కలిసి ఏర్పాట్ల విషయంపై చర్చించారు.

సంతాపం తెలిపిన కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డా. అందెశ్రీ పార్థివ దేహానికి సోమవారం నివాళులర్పించారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర నేతలు కూడా హాజరయ్యారు. డా. అందెశ్రీ సేవలను స్మరించుకున్నారు. అందెశ్రీ సేవలు,





రచనలు, పాటలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆయన మరణించారని పద్మారావు గౌడ్ చెప్పగానే, వెంటనే నా అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకుని వచ్చానన్నారు. అందెశ్రీ మరణం తెలంగాణ సమాజానికి, సాహిత్యానికి తీరని లోటని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి కోరుకుంటున్నానన్నారు.

సాహితీ రంగానికి తీరని లోటు

అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ రంగానికి తీరని లోటని రచయిత, జర్నలిస్టు డా. పొన్నం రవిచంద్ర అన్నారు. అందెశ్రీ ఆకస్మిక మరణం సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' సృష్టికర్త, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో తన ఈ గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందని అన్నారు. అందెశ్రీని తాను నంది అవార్డుల జ్యూరీ సభ్యుడిగా ఉన్న సమయంలో ఉత్తమ గేయ రచయితగా ఎంపిక చేశామని అన్నారు. అవార్డు అందుకుంటున్న సమయంలో తొలిసారిగా ఆయనతో పరిచయం జరిగిందని, ఆ తర్వాత ఎక్కడ కలిసినా తనను పెద్దన్న అని పిలిచేవారని తెలిపారు. ఇటీవల రవీంద్రభారతిలో జరిగిన ఓ కార్యక్రమంలో అందెశ్రీని సన్మానించే అవకాశం లభించిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబసభ్యులకు నా సానుభూతి తెలియజేస్తున్నానని రవిచంద్ర అన్నారు.

అందెశ్రీ సేవలు అజరామరం

తెలంగాణ అస్తిత్వ కవి అందెశ్రీ మరణం తెలంగాణ కవితా సామ్రాజ్యానికి తీరని లోటని ప్రఖ్యాత చిత్రకారులు రుస్తుం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతంగా మలచి నిలిచిన ప్రజా కవి అందరిగుండెలలో అజరామరంగా నిలిచిపోయారని తెలిపారు. అందెశ్రీ ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులకు, ఆర్ఏఎఫ్ అధ్యక్షురాలు జులేఖ రుస్తుం, చిత్రకారులు రుస్తుం, ప్రముఖ కవి మైమూద్ పాషా, నహీం రుస్తుం ప్రగాఢ సానుభూతి తెలిపారు

అందెశ్రీ మృతి బాధాకరం

ప్రముఖ కవి, రచయిత, డా. అందెశ్రీ అకాల మరణం పట్ల మాజీమంత్రి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ గీత రచయిత అందెశ్రీ మృతి చాలా బాధాకరమని అన్నారు. రాష్ట్ర సాహితీ లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు చిన్నారెడ్డి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు.

తెలంగాణ సమాజానికి లోటు

అందెశ్రీ పార్థీవ దేహానికి లాలాగూడ మున్సిపల్ స్టేడియంలో మాజీ మంత్రి హరీశ్ రావు నివాళులు అర్పించారు. భౌతిక కాయంపై పూలమాల వేసి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అందెశ్రీ అకాల మరణం బాధాకరమన్నారు. తెలంగాణ సాహితీ లోకానికి, రాష్ట్రానికి తీరని లోటన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. అందెశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.



రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్ల విక్రయం

- 163 ప్లాట్లకు 17,18 తేదీలలో వేలం
- రిజిస్ట్రేషన్ కు ఆఖరు తేదీ ఈ నెల 15

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 10 : స్వగృహ కార్పొరేషన్ ద్వారా అభివృద్ధి చేసిన లే ఔట్లలో నివాస భవనాల నిర్మాణానికి అనువైన ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా అమ్ముతున్నారు. నగరానికి సమీపంలో ఉన్న తొర్రూర్, బహదూర్ పల్లి, కుర్మల్ గూడ ప్రాంతాల 163 ఓపెన్ ప్లాట్లను నవంబర్ 17,18 తేదీలలో బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వీపీ గౌతం తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ కు అతి చేరువలోని తొర్రూర్ ప్రాంతంలో 200- నుంచి 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న125 ప్లాట్లు, కుర్మల్ గూడ లో 200, 300 చదరపు గజాల విస్తీర్ణంలోని 25 ప్లాట్లు, బహదూర్ పల్లిలో 200, 1000 గజాలలోని 13 ప్లాట్లను విక్రయానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎటువంటి వివాదాలు లేని, ఈ ప్లాట్లలో తమ అభిరుచులకు అనుగుణంగా ఇండ్లను నిర్మించుకోవచ్చని, ఈ లే ఔట్లలో ఇప్పటికే మౌలిక వసతుల కల్పన కూడా పూర్తి అయ్యిందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 15 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పెద్ద అంబర్ పేట్ అవికా కన్వెన్షన్ లో నవంబరు 17,18 తేదీలలో తొర్రూర్ ప్రాంతంలోని 125 ప్లాట్లకు, 18 వ తేదీ మధ్యాహ్నం నుంచి బహదూర్ పల్లి, కుర్మల్ గూడల్లోని ప్లాట్లకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎండీ చెప్పారు.



మంత్రి బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 10 మైనారిటీ వెల్ఫేర్, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ మంత్రిగా మహ్మద్ అజారుద్దీన్ సోమవారం నాడు సచివాలయంలోని తన చాంబర్ లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్ , వాకిటి శ్రీహరి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 15వ లోకసభలో అజార్ తమ సహచర ఎంపీగా ఉన్నారన్నారు. భారత క్రికెట్ జట్టుకి నాయకత్వం వహించారని గుర్తు చేశారు. రాష్ట్రప్రభుత్వం లో కేబినెట్ మంత్రి గా ప్రమాణ స్వీకారం చేయడం సంతోషకరమని చెప్పారు. ఆయన రాక ద్వారా తెలంగాణలో మైనార్టీలకు సంబంధించిన అన్ని అంశాలు ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో పని చేస్తాయన్నారు. అన్ని రకాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ , ఎస్టీ , బీసీ,మైనార్టీ భవిష్యత్ కి సంబంధించి ప్రభుత్వ, రాజకీయ కార్యక్రమాలు అందరం కలిసి పని చేస్తామని అన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి క్రీడా పోటీలు

- పాల్గొననున్న 12,570 బీసీ విద్యార్థులు
- బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 10 : తరగతి గదిలో పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు ఆట విడుపుగా అనేక క్రీడలలో పోటీలు నిర్వహిస్తున్నామని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి పది జిల్లాలలో ఈనెల 11 నుంచి 13 వరకు నిర్వహించే జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ లో 294 గురుకులాల నుంచి 12,570 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. 19 యేండ్ల లోపు విభాగంలో ప్రతి స్కూల్ నుంచి 20 మంది, 14 యేండ్ల లోపు విభాగంలో ప్రతి స్కూల్ నుంచి 25 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. 19 సంవత్సరాల లోపు విభాగంలో 5,220మంది విద్యార్థులు, 14 సంవత్సరాల లోపు విభాగంలో 7,350 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. మూడు రోజులపాటు రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షార్ట్ పుట్, డిస్కస్ త్రో, కబడ్డీ, కోకో, వాలీబాల్, టెన్నికాయిట్, చెస్ తదితర పోటీలను నిర్వహిస్తామన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తామని తెలిపారు. వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీలలో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ నెల ఆరు నుంచి ఎనిమిది వరకు 17 యేండ్ల లోపు విభాగంలో నిర్వహించిన పోటీలలో 294 బీసీ గురుకుల పాఠశాల నుంచి 10,290 విద్యార్థులు పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు. 15 వ తేదీ నుంచి 25 వ తేదీ వరకు జిల్లా స్థాయిలో సాంస్కృతిక , సాహిత్య, వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనంలో పోటీలను నిర్వహిస్తామన్నారు. అన్ని రంగాలలో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన మేరకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.





ఈ నెల పంటల సేకరణకు కీలకం

- అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి
- కొనుగోలుపై మంత్రులు తుమ్మల, ఉత్తమ్‌సమీక్ష

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో,హైదరాబాద్, నవంబర్ 10 : ధాన్యం కొనుగోళ్లలో రైతులకు కలుగుతున్న సమస్యలపై కలెక్టర్లతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు సీఎస్ రామక్రిష్ణారావు సోమవారం సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. పత్తి, మొక్కజొన్న, సోయాచిక్కుడు కొనుగోళ్లపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. మొక్కజొన్న కొనుగోలులో ఎకరాకు 18.5 క్వింటాళ్ల నుంచి 25 క్వింటాళ్ల వరకు పరిమితి పెంచడంతో రైతులు సంతోషంగా ఉన్నారని కలెక్టర్లు తెలిపారు. పత్తి కొనుగోలులో ఎల్ 1 ఎల్ 2 నిబంధనలు వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేయాలని సీసీఐ నిబంధన ఎత్తివేసి 12 క్వింటాలు కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం మీద రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తామని తెలిపారు. వర్షాలతో రంగుమారిన సోయాచిక్కుడు కొనుగోలు చేయాలని కేంద్రానికి ప్రతిపాదన పంపినట్లు తెలిపారు. పంటల సేకరణకు ఈ నెల కీలకమని కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు.

'టెక్నో–కల్చరల్ ఫెస్టివల్'కు గ్రీన్ సిగ్నల్

- 55 లక్షల రూ. నిధులు మంజూరు
- హైదరాబాద్ లో కళా సినిమా ఉత్సవం
- సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 10 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ-నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్, టెక్నో కల్చరల్ ఫెస్టివల్ కల్చరల్ సావరినిటీ త్రూ సినిమా' అనే విభిన్న సాంస్కృతిక-సినిమాటోగ్రఫీ ఉత్సవం నిర్వహణకు రూ. 55 లక్షల నిధులను మంజూరు చేసిందనీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. జీఓ ఆర్.టి.నెం.1551 ప్రకారం, ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో ఈ నెలలో హైదరాబాద్‌లోని ప్రసాద్ మల్టీప్లెక్స్, హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి నాయకత్వం వహిస్తున్నారు. ఆయన సారథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర సినీ-సాంస్కృతిక రంగాన్ని దేశవ్యాప్తంగా విస్తరించాలనే దిశగా ముందడుగు వేస్తోంది. మంత్రి మాట్లాడుతూ 'తెలంగాణను దేశంలోని కళ, సంస్కృతి, సినిమాటోగ్రఫీ రంగాల కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ ఫెస్టివల్ ద్వారా ఈశాన్య రాష్ట్రాలతో సాంస్కృతిక, సృజనాత్మక బంధాలు మరింత బలపడతాయన్నారు. ఈ ఫెస్టివల్‌లో జాతీయ అవార్డు గెలుచుకున్న చిత్రాల ప్రదర్శనలు, ప్యానెల్ చర్చలు, సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి. తెలంగాణ రాష్ట్రం కల్చరల్ ఎక్స్చేంజ్‌కి కేంద్ర బిందువుగా ఎదుగుతున్నదని తెలిపారు.



పార్కుల నామరూపాలు మార్చేస్తున్నారు

- ఫెన్సింగ్ వేసి కాపాడాలంటూ విన్నపాలు
- హైడ్రా ప్రజావాణికి 47 ఫిర్యాదులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 10 : 'పార్కుల నామరూపాలు లేకుండా చేస్తున్నారు. పార్కులలో ఆలయాలు నిర్మించి, పక్కనే మళ్గీలు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేసుకుంటున్నారు. లే ఔట్‌లలో పార్కుల కోసం కేటాయించిన స్థలాలన్నిటికీ ఫెన్సింగ్ వేసి కాపాడాలంటూ' పలువురు సోమవారం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలాలను కూడా కాపాడాలని కోరారు. అమీన్‌పూర్ పెద్దచెరువు, రావిర్యాల చెరువుల విస్తీర్ణం యేటా పెరుగుతూ, ఎగువ భాగంలో ఉన్న నివాసాలను ముంచెత్తుతున్నాయని ఆయా ప్రాంతాల వారు ఫిర్యాదు చేశారు. మూసేసిన తూములు తెరిపించడంతో పాటు అలుగు ఎత్తును కూడా తగ్గించాలని పలువురు కోరుతున్నారు. గతంలో వ్యవసాయ వినియోగం వల్ల నీటి నిలువలు తగ్గేవని, ఇప్పుడు మురుగు నీటితో నిండి ఎగువన ఉన్న ప్రాంతాలు మునుగుతున్నాయని వాపోయారు. ఓల్డ్ అల్వాల్ సర్వే నంబరు 576లో క్వారీ కోసం తవ్విన గుంతలలో మురుగు నీరు చేరి పరిసరాలన్నీ దుర్గంధభరితంగా మారాయని గంగ అవెన్యూ రెసిడెంట్స్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ గుంతలను మట్టితో పూడ్చి పార్కులుగా అభివృద్ధి చేయాలని కోరారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి 47 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్రా అదనపు కమిషనర్ ఎన్ అశోక్ కుమార్ పరిశీలించి పరిష్కార బాధ్యతలను అధికారులకు అప్పగించారు.

డిసెంబర్ 13, 14న ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్

- బ్రోచర్ ను ఆవిష్కరించిన 8వ డాన్ బ్లాక్ బెల్ట్ హన్షీ భారత్ శర్మ



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 10 : కరాటే ఇండియా ఆర్గనైజేషన్ (కేఐఓ) న్యూఢిల్లీ ప్రధాన కార్యాలయంలో సోమవారం హైదరాబాద్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ 2025 బ్రోచర్ ను కేఐఓ అండ్ సీకేఎఫ్ అధ్యక్షులు, ఏకేఎఫ్ ఈసీ సభ్యులు, 8వ డాన్ బ్లాక్ బెల్ట్ హన్షీ భారత్ శర్మ ఆవిష్కరించారు. డిసెంబర్ 13, 14 తేదీలలో హైదరాబాద్, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా హన్షీ భారత్ శర్మ మాట్లాడుతూ ఈ ఛాంపియన్షిప్ ను సీకోకై కరాటే తెలంగాణ సంస్థ, తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ తో కలిసి నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం కరాటే ఇండియా ఆర్గనైజేషన్ అనుమతితో జరుగుతోందన్నారు. 'ఇది వర్ల్డ్ కరాటే ఫెడరేషన్ (డబ్ల్యూకేఎఫ్) కు అనుబంధంగా ఉంది. హైదరాబాదు ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ యువ కరాటే క్రీడాకారులకు తమ నైపుణ్యాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ప్రదర్శించే అద్భుత వేదికగా నిలుస్తుంది. దేశవ్యాప్తంగా కరాటే కళ స్ఫూర్తిని మరింత పెంచడమే తమ లక్ష్యం' అని తెలిపారు. మాస్టర్ టి. కనక రాజు (డబ్ల్యూకేఎఫ్ అండ్ ఏకేఎఫ్ జడ్జ్, సీకో అధికారిక ఇన్‌స్ట్రక్టర్, తెలంగాణ), మాస్టర్ జె. ప్రవీణ్ కుమార్ (ఏకేఎఫ్ జడ్జ అండ్ డబ్ల్యూకేఎఫ్ కోచ్) తో పాటు ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ, కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షులు బి. మహేశ్ కుమార్ గౌడ్, కేఐఓ జాయింట్ సెక్రటరీ కీర్తన్ కొండ్రు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు.



తొలిసారిగా 'అపెక్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ యోగా అండ్ నేచురోపతి' రాష్ట్రంలో ఏర్పాటు కానుంది. రూ.750 కోట్లతో కేంద్రం నెలకొల్పే దీనిలో బ్యాచ్‌లర్ ఆఫ్ నేచురోపతి యోగా సర్జరీలో 100 సీట్లు, పీజీలో 20 సీట్లు తొలి ఏడాదిలో ఉంటాయి. దీనికోసం 40 ఎకరాలు కావాలని కేంద్రం లేఖ రాసింది. 450 పడకల నేచురోపతి ఆసుపత్రి అందుబాటులోకి వస్తుంది.
- ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్

ఓపెన్ వాయిస్

'సుప్రీం' దృష్టికి రోడ్డు ప్రమాదాలు

ఇటీవల ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగిన విషయం తెలిసిందే. దాదాపు 38 మంది ప్రాణాలు కోల్పోయారు. రాజస్థాన్ రోడ్డు ప్రమాదంలోనూ 15 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మూడు ఘటనలను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. జస్టిస్ జేకే మహేశ్వరి, విజయ్ విష్ణోయ్‌తో కూడిన ధర్మాసనం జాతీయ రహదారుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసింది. రాజస్థాన్‌లోని జాతీయ రహదారులపై ఉన్న ధాబాలు, ఇతర సంస్థల సంఖ్యను వివరిస్తూ రెండువారాలలోగా వివరణాత్మక స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేయాలని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ని ఆదేశించింది. రహదారి పరిస్థితులపై నివేదిక కూడా ఇవ్వాలని సూచించింది. ఈ కేసులో సీనియర్ న్యాయవాది ఏఎస్ నాదకర్ణిని అమికస్ క్యూరీగా నియమించిన ధర్మాసనం స్టేటస్ నివేదికను దాఖలు చేయడానికి రాజస్థాన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని పార్టీగా చేర్చాలని ఆదేశించింది. రాజస్థాన్ ప్రభుత్వం తరపున హాజరైన అదనపు అడ్వకేట్ జనరల్ శివ్ మంగళ్ శర్మ ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కోర్టుకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. కర్నూలు రోడ్డు ప్రమాదాన్ని సైతం కోర్టు పరిగణనలోకి తీసుకుంది. జాతీయ రహదారి భద్రత, రోడ్డు పక్కన ఉన్న నిర్మాణాల నియంత్రణ కోసం సమన్వయ విధానం అవలంబించడానికి ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని పార్టీగా చేయాలని ఆదేశించింది. మన దేశంలో రోడ్డు ప్రమాదాలు ఆందోళన రేకెత్తిస్తున్నాయి. నిత్యం వందల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతుండగా, ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారాయి. ఈ క్రమంలో సుప్రీం ప్రమాదాలపై దృష్టి సారించింది. నేషనల్ హైవేలపై ప్రమాదాలు కేవలం డ్రైవింగ్ లోపాలు మాత్రమే కాకుండా, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల జరుగుతున్నట్లుగా కోర్టు పేర్కొంది. ఈ వ్యవహారం మీద ద్విసభ్య ధర్మాసనం స్పందించింది. రోడ్ల పక్కన అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ధాబాలు, టీ దుకాణాలు, లారీ పార్కింగ్ కేంద్రాలు ప్రమాదాలకు కారణమని పేర్కొంది. అదే సమయంలో రహదారుల నిర్వహణలో కాంట్రాక్టర్లు, స్థానిక అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లుగా పేర్కొంది. రోడ్లపై గుంతలు, లైటింగ్ లేకపోవడం, రోడ్డు పక్కన సరైన రక్షిత గోడలు లేకపోవడం వల్లే ప్రమాదాల తీవ్రత మరింత పెంచుతున్నట్లుగా అభిప్రాయపడింది. ఈ క్రమంలోనే ఏపీ, రాజస్థాన్ ప్రమాదాలపై సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా రహదారుల పరిస్థితిపై, భద్రతా చర్యలు, ప్రమాదాలకు కారణాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. రోడ్ల పక్కన అనుమతి లేకుండా ఉన్న ధాబాలు, హోటళ్లు, వర్క్‌షాప్‌లు ఎన్ని ఉన్నాయో సమగ్రంగా సర్వే చేయాలని ఆదేశించింది. రహదారుల నిర్మాణం, నిర్వహణ విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా? అన్న అంశంపై సైతం దృష్టి సారించింది. ప్రమాణాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. రోడ్ల నిర్వహణ అనేది నిర్మాణ మాత్రమే కాదని, ప్రజల భద్రతకు సంబంధించిందని ధర్మాసనం స్పష్టం చేసింది. కనీసం ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి, ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వాహనాల యజమానులకు, డ్రైవర్లకు ఎప్పటికప్పుడు అవగాహన తరగతులు నిర్వహించాలి. ఎప్పటికప్పుడు శిక్షణ ఇవ్వాలి. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగాలి. నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులకు కఠిన శిక్షలు ఉండాలి. అప్పుడు పరిస్థితులలో ఏమైనా మార్పులు వచ్చే అవకాశాలు ఉంటాయి.

ప్రతిపక్షం
హైదరాబాద్
మంగళవారం
11.11.2025

న్యూయార్క్‌లో సోషలిజం : మమ్దానీ గెలుపు

ఇప్పుడు న్యూయార్క్ లో అతి సంపన్నులు భయపడుతున్నారు. ఎందుకంటే, మమ్దానీ 'అద్దెలను నియంత్రించటం' ఎలక్షన్ రక్షణలను ప్రమోట్ చేస్తాడు. బారీ స్టెర్న్‌లిక్ట్ న్యూయార్క్ ముంబై అవుతుందని చెప్పాడు, ఇది రేసిస్ట్ టోన్‌తో కూడిన విమర్శ. అలబామా సెనేటర్ టామీ ట్యూబర్విల్ న్యూయార్క్ నగరం త్వరలో అధిక ముస్లిల నగరంగా మారుతుందని చెప్పడం ఇస్లామోఫోబియాను ఎక్స్‌పోజ్ చేస్తుంది. గ్లోబల్ లెవల్‌లో, గార్డియన్ రీడర్లు 'కలెక్టివ్ ఎక్స్‌హేల్' అని చెప్పారు, యూనైటెడ్ కింగ్‌డమ్ మేయర్ సదీఖ్ ఖాన్ 'హోప్ విన్స్' అని సపోర్ట్ చేశాడు. ఉగాండాలో, అతని జన్మస్థలం. జోసెఫ్ బెయాంగా 'బ్యూటిఫుల్ మూమెంట్' అని చెప్పాడు. బీబీసీ మమ్దానీని 'యంగెస్ట్ మేయర్'గా హైలైట్ చేసింది.



డా. కోలాహలం రామ్ కిశోర్
9849328496

న్యూయార్క్ నగర మేయర్ గా జోరాన్ మమ్దానీ అద్భుత విజయం ప్రపంచవ్యాప్తంగా ఒక రాజకీయ తుఫానును రేకెత్తించింది. మమ్దానీ తన విజయ ప్రసంగాన్ని న్యూయార్క్ నగరంతో పాటు అమెరికాకు, ప్రపంచ ప్రజలకూ ఒక నూతన శుభ సందేశాన్ని అందించారు, ఇది ఒక శక్తివంతమైన, ప్రేరణాత్మక, విమర్శాత్మక సందేశంగా మారింది. ఈ వీడియోలో అతను న్యూయార్క్‌లోని పేదలు, కార్మికులు ఇతర మైనారిటీల ఆకాంక్షలను ప్రతిబింబించేలా మాట్లాడారు. నమ్మకం గెలుస్తుంది (హోప్ విన్స్) అనే ఆయన మాటలు, భయానికి వ్యతిరేకంగా ఆశను ఎదుర్కొనేలా పిలుపునిచ్చాయి. ఈ ప్రసంగం కేవలం ఒక విజయ ప్రకటన కాదు. అది అమెరికా రాజకీయాలలో ప్రజాస్వామిక సామ్యవాదం పునరుజ్జీవనానికి సంకేతం. అయితే, ఈ గెలుపు విమర్శలకు దూరం కాదు. అది వ్యాపార సంపన్న వర్గాల, ఇజ్రాయిల్ సపోర్టర్లు,(మాగా) (ఎంఏజీఏ) గ్రూపుల నుండి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంది.

భారతీయ మూలాలు కలిగిన ముస్లిం నేత

మమ్దానీ, 34 యేండ్ల యువకుడు, ఉగాండాలో జన్మించి, భారతీయ మూలాలు కలిగిన ముస్లిం నేత, డెమొక్రటిక్ సోషలిస్ట్ పార్టీ (డీఎస్ఏ) నుండి పోటీ చేశారు. వీడియోలో అతను తన ప్రసంగాన్ని బ్రూక్లిన్ పారామౌంట్ థియేటర్‌లో అందించాడు. ఇక్కడ అతని సపోర్టర్లు ఉత్సాహంగా కేకలు పెట్టారు. ప్రసంగం ప్రారంభంలోనే జవహర్‌లాల్ నెహ్రూ మాటలను ఉదహరించారు. 'ది స్టార్స్ ఇన్ దేర్ కోర్స్...' ఇది అమెరికా కలను ప్రతిబింబిస్తుందని చెప్పాడు. ఈ రెఫరెన్స్ విమర్శకుడిగా చూస్తే, నెహ్రూ సోషలిజం, సెక్యులరిజం గురించి మాట్లాడుతూ, మమ్దానీ తన భారతీయ మూలాలను హైలైట్ చేశాడు. కానీ, ఇది మాగా సపోర్టర్లకు 'కమ్యూనిస్ట్' ట్యాగ్‌ను ఇచ్చింది. ఎందుకంటే, నెహ్రూ భారతదేశంలో సోషలిస్ట్ పాలసీలకు ప్రసిద్ధి. వీడియోలో మమ్దానీ కోస్ట్ ఆఫ్ లివింగ్ సమస్యలపై దృష్టి సారించాడు. ప్రపంచ బాలల రక్షణ (యూనివర్సల్ చైల్డ్ కేర్) ఉచిత బస్సులు, అద్దెల స్థిరీకరణ, అలాగే, అత్యధిక సంపన్నుల మీద ట్యాక్సులు. 'న్యూయార్క్ నగరం ఒక సిటీ ఆఫ్ హోప్, ఇంకా భయపడే అవసరంలేదని అతను ప్రకటించాడు. ఈ మెసేజ్ యువతను, లాటిన్ అమెరికా, ఆఫ్రికన్ అమెరికన్లు, యువ జ్యూస్ ఓటర్లను ఆకర్షించింది. అసెంబ్లీ మెంబర్‌గా అతని అనుభవం, హిప్‌హాప్ ఆర్టిస్ట్‌గా అతని బ్యాక్‌గ్రౌండ్ ఇవన్నీ అతన్ని ఒక "విశ్వసనీయ నేత" గా మార్చాయి.

మమ్దానీ ప్రసంగం రెండు స్థాయిలలో

మొదట, స్థానిక ప్రజలలో : న్యూయార్క్‌లో 116 బిలియన్ డాలర్ బడ్జెట్‌తో, అతను సోషల్ ప్రోగ్రామ్స్‌ను విస్తరించాలని చెప్పాడు. 'డిఫండ్ ది పోలీస్' అనే అతని మాటలు, 2020లో అతను చేసిన "డిఫండ్ ది పోలీస్" స్టేట్‌మెంట్‌ను రివర్స్ చేశాయి. ఇది ప్రాగ్మటిక్ మార్పుగా కనిపిస్తుంది, కానీ, విమర్శకుడిగా చూస్తే, ఇది వోటర్లను మోసం చేయడమా? పోలీస్ రాజీనామా (250 మంది అధికారులలో) ఇప్పటికే ఆందోళన కలిగిస్తున్నాయి. రెండవది, నేషనల్ లెవల్‌లో: అతను ట్రంప్‌పై వార్ డిక్లేర్ చేశాడు, 'ట్రంప్ క్యాపిటలిజం న్యూయార్క్‌ను నాశనం చేస్తుంది' అని. ఇది ప్రజాస్వామిక పార్టీలో వామపక్ష విభాగాన్ని బలోపేతం చేస్తుంది, కానీ, మిడ్‌టర్మ్స్‌లో డెమొక్రట్స్ ఓటమికి దారి తీస్తుందా? బైడెన్ 'పార్టీ ఇజ్ బ్యాక్' అని చెప్పాడు. కానీ, ఇది ఒక ఊహాజనితం మాత్రమే. ప్రపంచ మీడియా స్పందనలు ఈ గెలుపును ఒక గ్లోబల్ ఫినామినన్‌గా మార్చాయి. అమెరికాలో ఎన్పీఆర్ వాల్ స్ట్రీట్ బిలియనెర్లు 40 మిలియన్ డాలర్లు ఖర్చు చేసి మమ్దానీని ఓడించడానికి చాలా పెద్ద ప్రయత్నం చేశారని రిపోర్ట్ చేసింది. అయినా, వారికి భంగపాటు తప్పలేదు. ఫాక్స్ బిజినెస్ బిల్ అక్మాన్, డేవ్ పోర్ట్నాయ్ వంటి బిజినెస్ లీడర్ల వ్యాఖ్యలను హైలైట్ చేసింది: 'సోషలిస్ట్ మేయర్ సిటీని డెస్ట్రాయ్ చేస్తాడు'

అతి సంపన్నులు భయం

ఇక్కడ విమర్శ: ప్రతిస్పందనలు క్లాస్ వార్‌ను రేపుతాయి -ఇప్పుడు న్యూయార్క్ లో అతి సంపన్నులు భయపడుతున్నారు. ఎందుకంటే మమ్దానీ 'అద్దెలను నియంత్రించటం' ఎలక్షన్ రక్షణలను ప్రమోట్ చేస్తాడు. బారీ స్టెర్న్‌లిక్ట్ న్యూయార్క్ ముంబై అవుతుందని చెప్పాడు, ఇది రేసిస్ట్ టోన్‌తో కూడిన విమర్శ. అలబామా సెనేటర్ టామీ ట్యూబర్విల్ న్యూయార్క్ నగరం త్వరలో అధిక ముస్లిల నగరంగా మారుతుందని చెప్పడం ఇస్లామోఫోబియాను ఎక్స్‌పోజ్ చేస్తుంది. గ్లోబల్ లెవల్‌లో, గార్డియన్ రీడర్లు 'కలెక్టివ్ ఎక్స్‌హేల్' అని చెప్పారు, యూనైటెడ్ కింగ్‌డమ్ మేయర్ సదీఖ్ ఖాన్ 'హోప్ విన్స్' అని సపోర్ట్ చేశాడు. ఉగాండాలో, అతని జన్మస్థలం. జోసెఫ్ బెయాంగా 'బ్యూటిఫుల్ మూమెంట్' అని చెప్పాడు. బీబీసీ మమ్దానీని 'యంగెస్ట్ మేయర్'గా హైలైట్ చేసింది. కానీ, ట్రంప్ పరిపాలనతో చాలెంజెస్‌ను పేర్కొంది. టైమ్స్ ఆఫ్ ఇండియా 'ఆన్ యువర్ మార్క్స్' అనే హెడ్‌లైన్‌తో కవర్ చేసింది, మమ్దానీ భారత మూలాలను సెలబ్రేట్ చేస్తూ, కానీ హిందూ రైట్ వింగ్ నుండి "హిందుయిజం వైప్ అవుట్" వంటి విమర్శలు వచ్చాయి. విమర్శాత్మకంగా, ఈ సపోర్ట్ గ్లోబల్ లెఫ్ట్‌ను



యూనైట్ చేస్తుంది, కానీ ఇది మాగా మెల్ట్‌డౌన్‌ను ట్రిగ్గర్ చేసింది: "డిపోర్ట్ హిమ్ టు ఇండియా" వంటి ట్వీట్లు.

ఇజ్రాయిల్ స్పందనలు

ఇజ్రాయిల్ స్పందనలు మరింత తీవ్రమైనవి. న్యూయార్క్ టైమ్స్ ప్రకారం, మమ్దానీ ప్రోపాలస్తీన్ స్టాండ్ కారణంగా ఇజ్రాయిల్ టీవీలో అతని స్పీచ్ లైవ్ ట్రాన్స్‌మిట్ అయింది. అమిచై చిక్లి, ఇజ్రాయెల్ మినిస్టర్, 'న్యూయార్క్ హమాస్ సపోర్టర్‌కు కీలు ఇచ్చింది' అని చెప్పి, జ్యూస్‌లను ఇజ్రాయిల్‌కు వలసగా చేయమని పిలుపునిచ్చాడు. వాషింగ్టన్ పోస్ట్ ఇజ్రాయిల్ మినిస్టర్, 'న్యూయార్క్ జ్యూస్‌లు ఇజ్రాయిల్‌కు వెళ్లాలి' అని రిపోర్ట్ చేసింది.

(వ్యాస రచయిత సామాజిక విశ్లేషకులు)

కవిత్వంతో ఉద్యమాన్ని రగిలించిన లోక కవి

'మాయమై పోతున్నాడమ్మో మనిషన్నవాడు' పాటను 'ఎర్ర సముద్రం' సినిమా కోసం రాశారు. ఈ పాట ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాల తెలుగు సిలబస్‌లో కూడా చేర్చబడింది. 'పల్లె నీకు వందనములమ్మో' వంటి పాటలు తెలంగాణ పల్లెటూరి స్వచ్ఛతను, సహజత్వాన్ని కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శిస్తాయి. 'గంగ' 'బతుకమ్మ' 'బొమ్మల కొలువు' వంటి అనేక సినిమాలకు పాటలు, సందర్భోచిత సంభాషణలు అందించి, తన సాహిత్య ప్రతిభను వెండితెరపై కూడా అద్భుతంగా చాటుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 2006లో 'గంగ' చిత్రానికి ఉత్తమ గేయ రచయితగా ప్రతిష్ఠాత్మక నంది పురస్కారం లభించింది.




కొండేటి ప్రకాశ్
7981781086

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ఆ గొంతుక, ఆ కలం నుంచి వెలువడిన పాటలు జీవనాడిలా, ఊపిరిలా నిలిచాయి. 'మాయమై పోతున్నాడమ్మో మనిషన్న వాడు' అనే పాట ఆధునిక సమాజంలో మానవీయ విలువలు, నైతిక ప్రమాణాలు ఎలా పతనమవుతున్నాయో, మనిషి కేవలం స్వార్థంతో ఎలా జీవిస్తున్నాడో లోతుగా విశ్లేషిస్తూ యావత్ ప్రజానీకాన్ని ఆత్మవిమర్శ చేసుకునేలా ఆలోచింపజేసింది. ఆ పాటలోని ఆర్తి, సందేశం ఆయన రచన ఎంత గొప్పదో చాటుతుంది. అనుక్షణం ప్రజల మధ్యనే జీవిస్తూ, తాను నడియాడిన నేలను విడిచి బ్రతకలేనంటూ తన తుది శ్వాస వరకు ఒక సామాన్య మానవుడిగానే జీవించి, తన సాహిత్యంతో కోట్ల ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నాడు ఆ అద్వితీయ వాగ్గేయకారుడు. ఆయన రచనలు చరిత్రపుటలలో శాశ్వతంగా నిలబడతాయి. అందుకు నిలువెత్తు నిదర్శనం 'జయ జయహే తెలంగాణ' గీతం. ఈ గీతం తెలంగాణ రాష్ట్ర ప్రజల ఉద్యమ స్ఫూర్తికి, చరిత్రకు, సంస్కృతికి, గొప్పదనానికి సజీవ రూపంగా అద్దం పడుతుంది. దీని ప్రాధాన్యతను గుర్తించి, ఇది తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించబడింది.

బాల్యం,- కవిత్వ నేపథ్యం

ఆ అసాధారణ వ్యక్తి మరెవరో కాదు. అందెశ్రీ. 1961 జూలై 18న వరంగల్ జిల్లా (ప్రస్తుతం సిద్దిపేట జిల్లా), మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో జన్మించారు. బాల్యం కష్టాల కడలిలో అనాథగా గడిచింది. ఆయనకు ఏ విధమైన సంప్రదాయ, అధికారిక విద్య లభించలేదు. ఆయన నిరక్షరాస్యుడైనప్పటికీ, తెలంగాణ పల్లె వాతావరణంలో, జానపద కళారూపాలతో మమేకమై అపార అనుభవాన్ని, లోకజ్ఞానాన్ని సంపాదించారు. బాల్యంలో గొర్రెలు కాసే వృత్తిలో, ప్రకృతి ఒడిలో స్వతస్సిద్ధంగా పాటలు ఆశువుగా అల్లేవారు. తెలంగాణ పల్లె జీవితం, శ్రమ, కష్టాలు, పండుగల సంస్కృతి ఆయన కవిత్వా



నికి తొలి గురువులుగా నిలిచాయి. పల్లెటూరి జీవన విధానం, తన జానపద సాహిత్యం, పాటలు ఆయన కవిత్వానికి మూల స్తంభాలుగా మారాయి. ఎలాంటి సాహిత్య నేపథ్యం లేకపోయినా, తనలోని సహజసిద్ధ ప్రతిభతో, స్వయంకృషితో అగ్రశ్రేణి కవులలో ఒకరిగా తను ఎదిగారు. శృంగేరి మఠానికి చెందిన శంకర్ మహారాజ్ ఆయన పాటలు విని ప్రత్యేకంగా ప్రోత్సహించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కవిగా, సాంస్కృతిక సారథిగా అందెశ్రీ నిరుపమానమైన, మహోన్నతమైన పాత్ర పోషించారు. ఆయన పాటలు, కవిత్వం తెలంగాణ ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని, అంతర్గత చైతన్యాన్ని నింపాయి. తెలంగాణ ధూంధాం కార్యక్రమాలకు రూపకల్పన చేసి, రూపశిల్పిగా ఉండి ప్రజల్లో రాజకీయ అవగాహన కల్పించారు. ఆయన రచనలు తెలంగాణ ప్రజల సామ్యవాద ఆకాంక్షలకు ప్రతిబింబాలుగా నిలిచాయి.

తెలుగు సినిమా రంగంలో

'మాయమై పోతున్నాడమ్మో మనిషన్నవాడు' పాటను 'ఎర్ర సముద్రం' సినిమా కోసం రాశారు. ఈ పాట ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాల తెలుగు సిలబస్‌లో కూడా చేర్చబడింది. 'పల్లె నీకు వందనములమ్మో' వంటి పాటలు తెలంగాణ పల్లెటూరి స్వచ్ఛతను, సహజత్వాన్ని కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శిస్తాయి. 'గంగ' 'బతుకమ్మ' 'బొమ్మల కొలువు' వంటి అనేక సినిమాలకు పాటలు, సందర్భోచిత సంభాషణలు అందించి, తన సాహిత్య ప్రతిభను వెండితెరపై కూడా అద్భుతంగా చాటుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 2006లో 'గంగ' చిత్రానికి ఉత్తమ గేయ రచయితగా ప్రతిష్ఠాత్మక నంది పురస్కారం లభించింది. దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, 'లోకకవి' బిరుదుతోపాటు అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ వారి గౌరవ డాక్టరేట్ వంటి అనేక జాతీయ, సాహితీ పురస్కారాలు అందుకున్నారు. అందెశ్రీ జీవితం, కవిత్వం సాహిత్యానికి పాఠశాల విద్య అడ్డంకి కాదని, కేవలం అనుభవం, నిబద్ధత, ప్రజలపై నిస్వార్థ ప్రేమ ఉంటే సరికొత్త చరిత్ర సృష్టించవచ్చని నిరూపించారు. ఆయన పాటలు తరతరాలకు తెలంగాణ సంస్కృతి, ఉద్యమ స్ఫూర్తిని అందిస్తూనే ఉంటాయి. ఆయన కేవలం కవి కాదు, తెలంగాణ ఆత్మగౌరవానికి శాశ్వత ప్రతీకగా నిలిచిన ప్రజాకవి, యుగపురుషుడు.

(ప్రముఖ కవి, రచయిత, వాగ్గేయకారుడు
డా. అందెశ్రీ మరణానికి నివాళిగా)


(వ్యాస రచయిత కవి, విమర్శకుడు)

నశీర్ అహమ్మద్‌కు 'జీవిత సాఫల్య పురస్కారం'



జేజేసీపీ- బాబూరావు
94933 19690

భారత తొలి విద్యా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న 'జాతీయ విద్యా దినోత్సవం' సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ-2025 సంవత్సరానికి ప్రదానం చేయనున్న ప్రతిష్ఠాత్మక 'జీవిత సాఫల్య పురస్కారా'నికి ప్రముఖ చరిత్రకారులు, బహుగ్రంథ రచయిత, జర్నలిస్ట్, న్యాయవాది, నిత్యనూతన చారిత్రక పరిశోధకుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ ఎంపిక కావడం హర్షణీయం. ఆయన అవిశ్రాంతంగా సాగిస్తున్న చరిత్ర రచనా కృషికి గుర్తింపునకు గాను ఆయనను ఈ పురస్కారం వరించడం శుభపరిణామం. నవంబరు 11 నాడు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తదితర ప్రముఖుల సమక్షంలో ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించనున్నారు. ఈ పురస్కారం క్రింద ఇరవై ఐదు వేల రూపాయలు నగదు, జ్ఞాపికను అందజేసి ఆయనను సత్కరించనున్నారు.



అందరికీ సుపరిచితులు

నశీర్ అహమ్మద్ దేశవ్యాప్తంగా అందరికి సుపరిచితులు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ముఖ్యంగా ఆయన చరిత్ర రచనలో సుప్రసిద్ధులు. ఆయన తెలుగు నేలకి మాత్రమే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా విశిష్ట మేటి చరిత్రకారుడుగా నిలిచి గొప్ప పేరుని సముపార్జించుకున్నారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం జన సముదాయాలు నిర్వహించిన పాత్రలను ఆయన అనేక వేదికల ద్వారా వ్యక్తీకరిస్తూనే ఉన్నారు. మూడు దశాబ్దాలుగా విశేష కృషి చేస్తున్న చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ ఇప్పటి వరకు 25 పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను రచించి వెలువరించి ప్రపంచవ్యాప్తంగా అశేష పాఠకుల ఆదరణను విరివిగా చూరగొన్నారు. తన గ్రంథాలను ఆయన ఉర్దూ భాషతో పాటుగా తెలుగు, హిందీ, తమిళం, కన్నడం, గుజరాతీ భాషలలో వెలువరించారు. ఆయనే పుస్తక రచనతో పాటుగానే నిరంతరంగా ఆయా పత్రికలలో అనేకంగా వ్యాసాలు రాస్తూనే ఉన్నారు.

పూర్తికాలం చారిత్రక పరిశోధనకు

సయ్యద్ నశీర్ అహమ్మద్ 2004 నుంచి జర్నలిస్ట్ వృత్తికి స్వస్తి పలికి పూర్తికాలం చారిత్రక పరిశోధనకు అంకితమై కాలగర్భంలో కలగలిసిన నిజాలను వెలుగులోకి తెచ్చి తీసుకువచ్చి నవ చరిత్రను సృష్టిస్తూనే ఉన్నారు. సయ్యద్ నశీర్ అహమ్మద్ కేవలం చరిత్ర గ్రంథ రచన, ప్రచురణతో సరిపెట్టుకోలేదు. అంతేకాకుండా స్వాతంత్ర్య సమర యోధుల త్యాగమయ, సాహసోపేత పోరాటాలను, స్వాతంత్ర్య సాధనలో వారి పాత్రను ప్రజలకు, ముఖ్యంగా యువత, విద్యార్థులకు ఉపన్యాసాల ద్వారా, అనేక ఫోటో ఎగ్జిబిషన్ల ద్వారా తెలియజేస్తున్నారు. పలు రకాలుగా ప్రచార కార్యక్రమాలను అవిశ్రాంతంగా నిర్వహిస్తూ ప్రజానీకాన్ని చైతన్యవంతులను చేస్తున్నారు. చరిత్ర గ్రంథాల రచన, ప్రచురణను వ్యాపార దృష్టితో కాకుండా సేవా దృష్టితో నిర్వహిస్తున్న సయ్యద్ నశీర్ అహమ్మద్ తన కుటుంబం, తన సన్నిహితుల ఆర్థిక సహాయ సహకారాలతో ప్రచురించిన గ్రంథాలను ఎంపిక చేసిన వందలాది గ్రంథాలయాలకు, చరిత్రకారులకు, జర్నలిస్టులకు తమ వదాన్యుల చిరుగానుకగా నేటికిని అందిస్తూనే ఉన్నారు. పాఠకుల సౌకర్యార్థం తన గ్రంథాలన్నిటినీ అంతర్జాల మాధ్యమాల ద్వారా అందుబాటులో లభ్యమయేటట్లుగా ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అలాగే ఈ గ్రంథాల పీడీఎఫ్ ఫైల్లను సైతం ఆయన ప్రత్యేకంగా తయారు చేయించి కోరిన వారికి అంతర్జాలం ద్వారా వేలాది పాఠకులకు నేటికిని అందిస్తూనే ఉన్నారు. తానే ఒక సైన్యంగా నిరంతరం శ్రమించి మరుగున పడిన చరిత్రని వెలికితీసి శోధించి డాక్టరేట్లను అధిగమించి విశిష్ట పరిశోధనలు చేసిన సయ్యద్ నశీర్ అహమ్మద్ కృషిని నేటి వరకు ఏ ఒక్క విశ్వవిద్యాలయం కూడా గుర్తించకపోవడం కడు విచారకరం. అనేక మంది విద్యావేత్తలు, మేధావులు, ప్రగతిశీలురు ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయాల్సిన అవశ్యకతను అడపాదడపా వెల్లడిస్తూనే ఉన్నారు. ఇకనైననూ విశ్వవిద్యాలయాలు సయ్యద్ నశీర్ అహమ్మద్ కృషిని గుర్తించి ఆయనకు 'గౌరవ డాక్టరేట్ పురస్కారా'న్ని ప్రదానం చేయాల్సిన అవసరం తప్పకుండా ఉంది. అంతిమంగా 'సయ్యద్ నశీర్ అహమ్మద్ అంటే చరిత్ర'...'చరిత్ర అంటే సయ్యద్ నశీర్ అహమ్మద్' అని అన్నట్లుగా ఆయన జీవన ప్రస్థానం నిత్యనూతనంగా కొనసాగుతూనే ఉంది.

(నేడు సయ్యద్ నశీర్ అహమ్మద్ 'జీవిత సాఫల్య పురస్కారం' స్వీకరిస్తున్న సందర్భంగా)

(వ్యాస రచయిత రీసెర్చ్ స్కాలర్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

ప్రాంతీయం





'జూబ్లీహిల్స్'లో బీఆర్ఎస్ దే విజయం

- కాంగ్రెస్ మద్యం, డబ్బు పంపిణీ చేస్తోంది
- ఓటర్లకు చీరలు, మిక్సీలు ఎరగా వేస్తోంది
- సీఈఓకు ఆధారాలతో ఫిర్యాదు చేశాం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 10 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని నాటకాలు ఆడినా జూబ్లీహిల్స్ ఓటర్లు ఎవరికి ఓటు వేయాలో ముందే నిర్ణయించుకున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్యం, డబ్బును విచ్చలవిడిగా పంపిణీ చేస్తోందని ఆరోపించారు. లక్షకు పైగా చీరలు, మిక్సీలను ఓటర్లకు ఎరగా వేస్తోందని అన్నారు. ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అన్ని వీడియో, ఫొటోల ఆధారాలను ఎన్నికల సంఘానికి అందజేసినట్లు తెలిపారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈసీని కోరినట్లు చెప్పారు. సీవిజిల్ యాప్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఫిర్యాదు చేసినప్పటికీ కొందరు పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఓటర్లు అధికార పార్టీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో కేంద్ర బలగాలను మోహరించాలని కోరుతూ వివరాలను సమర్పించామని చెప్పారు. ముఖ్యంగా మహిళా పోలీసు అధికారులు, ఆశా, అంగన్వాడీ వర్కర్లను ఆయా చోట్ల నియమించాలని కోరామని అన్నారు. మహిళా ఓటర్ల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. నకిలీ ఓటరు కార్డులు తయారు చేశారని, ఇందుకు సంబంధించిన వీడియోలను ఎన్నికల అధికారికి ఇచ్చినట్లు తెలిపారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం నుంచి హామీ వచ్చినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో ఓటమి భయంతో రేవంత్ కాళ్లరిగేలా తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు.



ప్రముఖ కవి అందెశ్రీకి హరీష్ రావు నివాళులు

ప్రతిపక్షం, సిటీ బ్యూరో, నవంబర్ 10: ప్రముఖ తెలంగాణ కవి, రచయిత అందెశ్రీ మృతికి మాజీ మంత్రి హరీష్ రావు సంతాపం తెలిపారు. లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ సార్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పార్థివ దేహం వద్ద హరీష్ రావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన అందెశ్రీ భౌతిక కాయానికి పూలమాల వేసి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలంగాణ ఆత్మను కవిత్వం ద్వారా ప్రజల్లో నింపిన వ్యక్తి అందెశ్రీ అని ఆయన గుర్తుచేశారు.



అందెశ్రీ పార్థివ దేహానికి నివాళులర్పించిన కవిత

ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 10: ప్రముఖ కవి, గేయ రచయిత అందెశ్రీ పార్థివ దేహానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నివాళులర్పించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత అందెశ్రీ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. తెలంగాణ సాంస్కృతిక ఉద్యమంలో ఆయన చేసిన కృషి, తెలంగాణ భాషా సౌందర్యాన్ని వెలికితీసిన సాహిత్య సంపద ఎప్పటికీ చిరస్మరణీయమని కవిత పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మను ప్రతిబింబించిన ఆయన రచనలు తరతరాలకూ ప్రేరణగా నిలుస్తాయని ఆమె అన్నారు.



అందెశ్రీ మరణం పట్ల

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంతాపం

ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 10 : ప్రజా కవి, వాగ్గేయకారుడు అందెశ్రీ మరణం తెలంగాణకు తీరని లోటు అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. "జయ జయహే తెలంగాణ" వంటి గేయాలతో తెలంగాణ ఆత్మకు స్వరమిచ్చిన ఆయన పదాలు అమరత్వం పొందాయి. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నాను" అని మంత్రి పేర్కొన్నారు.



ట్యాంక్ బండ్ పై అందెశ్రీ విగ్రహం పెట్టాలి

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 10: తెలంగాణ రాష్ట్ర గీతం "జయ జయహే తెలంగాణ" సృష్టికర్త, కవి, రచయిత డాక్టర్ అందెశ్రీ అకాల మరణం యావత్ తెలంగాణ సమాజానికి తీరని లోటని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేకూరి గణేష్ అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం జరిగిన ఉద్యమంలో ఆయన పాటలు తెలంగాణ ప్రజల్లో చైతన్యాన్ని, పోరాట పటిమను నింపాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఏదైనా యూనివర్సిటీకి అందెశ్రీ పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఆయన విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

సికింద్రాబాద్ స్టేషన్ 'మెట్రో'తో అనుసంధానం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 10 : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ను మెట్రో మార్గంతో అనుసంధానం చేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు ఉంటాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికరణ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. నడుస్తున్న రైళ్లు, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా పనులు చేయాల్సి వస్తోందని అన్నారు. రూ. 715 కోట్లతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కు నిత్యం 1.97 లక్షల ప్రయాణికులు వస్తుంటారని తెలియజేశారు. శంషాబాద్ విమానాశ్రయం వలే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ను తీర్చిదిద్దాలనేది తన ఆంకాంక్ష అని, రైల్వే స్టేషన్ కోసమే ప్రత్యేకంగా రెండు సబ్ స్టేషన్ల నిర్మాణం జరుగుతోందని, ఐదు మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంటు కూడా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ను 1.65 లక్షల చ.మీ. మేర కొత్తగా నిర్మిస్తున్నామని, వచ్చే ఏడాది డిసెంబర్ లోపు ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.



సేవారత్న జాతీయ అవార్డుకు పట్లోళ్ల హన్మంత్ రెడ్డి ఎంపిక

ప్రతిపక్షం, చేవెళ్ల, నవంబర్ 10: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని కమ్మెట గ్రామానికి సర్పంచ్ గా గ్రామంలో అనేక సేవా అభివృద్ధి కార్యక్రమాలు, చేసినందుకు అవార్డుకు ఎంపిక చేసినట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధా క్రిష్ణ తెలిపారు. సోమవారం హైదరాబాద్ నగరంలోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయం లో అవార్డు ఎంపిక పత్రాన్ని అందుకున్నారు. డి సెంబర్ లో తిరుపతి లో జరిగే ఆల్ ఇండియా బహుజన రైటర్స్ 18 వ నేషనల్ కాన్ఫరెన్స్ లో సేవా రత్న జాతీయ అవార్డు అందుకుంటారు. అలాగే ప్రస్తుత తాజా మాజీ కమ్మెట సర్పంచ్ తలారి తులసీ రాజు ఉత్తమ సర్పంచ్ అవార్డుకు ఎంపికయ్యారు. గ్రామ అభివృద్ధికి చేసిన సేవకు ఉత్తమ సర్పంచ్ అవార్డు దక్కింది. ఈ మేరకు నల్లా రాధా కృష్ణ ఎంపిక పత్రాన్ని అందజేశారు. తనకు దక్కిన అవార్డును గ్రామానికి అంకితం చేస్తున్నట్లు అవార్డు గ్రహీత పెట్లోళ్ల హన్మంత్ రెడ్డి తెలిపారు. గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్మెట మాజీ సర్పంచ్ అందిపురం పెంటయ్య, బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు గోనె. కరుణాకర్ రెడ్డి, ఏ.సురేందర్ గౌడ్ ఏ. బాలకృష్ణ, వెంకటపురం ఆంజనేయులు గౌడ్ అచ్చిని రాంచెంద్రయ్య, రావులపల్లి వెంకటేష్, సి. హెచ్. సంపత్ కుమార్ బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర అవార్డుల కమిటీ సభ్యులు ఆనంద్ పాల్గొన్నారు.



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం, చేవెళ్ల, నవంబర్10: చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో సోమవారం సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డితో కలిసి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం క్వింటాల్ కి రూ.2400 కనీస మద్దతు ధర కల్పిస్తుందన్నారు. రైతులు దళారులకి విక్రయించ వద్దని ప్రభుత్వం కొనుగోలు కేంద్రానికి నేరుగా ధాన్యాన్ని అమ్ముకోవచ్చు అని తెలిపారు. ప్రభుత్వం రైతు అకౌంట్ లోనే జమ చేస్తుందనిచెప్పారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డు మెంబర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సొసైటీ చైర్మన్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిళా కాంగ్రెస్ పార్టీ నాయకురాలు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు సొసైటీ డైరెక్టర్లు మాజీ ఉప సర్పంచులు నాయకులు రైతులు సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా తమ్మిడికుంట పునరుద్ధరణ

- ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్న హైడ్రా
- పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్



ప్రతిపక్షం , సిటి బ్యూరో, నవంబర్ 10: ఐటీ కారిడార్.. మాధాపూర్‌లో మరో ఆకర్షణ ప్రజలకు అందుబాటులోకి రానుంది. మురుగు నీటిని.. దుర్గంధాన్ని వదిలించుకుని సహజ సరస్సుగా తమ్మిడికుంట రూపొందుతోంది. ముళ్లపొదలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, మీటర్ల మేర పేరుకుపోయిన పూడికను తొలగించి చెరువుకు సహజత్వాన్ని హైడ్రా అందించింది. చెరువులో ఆక్రమణలతో పాటు.. పూడికను తొలగించి విస్తీర్ణం పెంచడంతో ఇప్పుడా పరిసరాలు ఎంతో విశాలంగా మారాయి. శిల్పారామం వైపు ప్రధాన ప్రవేశ మార్గంతో నయనమనోహరంగా మారుతోంది. ఈ అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చెరువు చుట్టూ పటిష్టమైన బండ్ నిర్మాణంతో పాటు.. ఇన్‌లెట్లు, ఔట్‌లెట్ల నిర్మాణ పనులు జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. ఐటీ కారిడార్లో ఉన్న ఈ చెరువును ఓ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలను హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. శిల్పారామం వద్ద వరద నీరు నిలవకుండా ఇన్లెట్లను అభివృద్ధి చేయాలని సూచించారు. 14 ఎకరాల చెరువును 29 ఎకరాలకు విస్తరించడం జరిగిందని.. అదే విస్తీర్ణంలో నీరు నిలిచేలా చెరువు అభివృద్ధి చేయాలని సూచించారు.

సందర్శకులు సేదదీరేలా

దేశం నలుమూలల నుంచి వచ్చిన ఐటీ నిపుణులు నడియాడే ప్రాంతం ఇది. అత్యధిక జనసాంద్రత ఉన్న ప్రాంతం కూడా ఇదే.. ఇలాంటి చోట ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని హైడ్రా కమిషనర్ సూచించారు. తమ్మిడికుంటలో స్వచ్ఛమైన నీరు ఎంత ముఖ్యమో.. ఆ పరిసరాలు కూడా అంతే పరిశుభ్రమైన వాతావరణంలో ఉండడానికి చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు చుట్టూ దాదాపు 2 కిలోమీటర్ల మేర ఉన్న బండ్‌పై ప్రాణ (ఆక్సిజన్) వాయువు అందించడంతో పాటు.. చల్లటి నీడనిచ్చే చెట్లు పెంచాలన్నారు. చెరువు ప్రధాన ప్రవేశ మార్గంలో పార్కులను అభివృద్ధి చేయాలని సూచించారు. అన్ని వయసుల వారూ తమ్మిడికుంట పరిసరాలకు వచ్చి సేద దీరేవిధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పిల్లలకు ఆట విడిపుగా క్రీడా స్థలాలను తీర్చిదిద్దాలన్నారు. వృద్ధులు కూర్చునేందుకు వీలుగా చుట్టూ సిమ్మెంట్, రాతి కుర్చీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఓపెన్ జిమ్‌లు, కొద్దిమంది కూర్చొని ప్రశాంతంగా మాట్లాడుకోడానికి వీలుగా గుమ్మటాలు ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కమిషనర్ ఎన్ అశోక్ కుమార్ , హైడ్రా ఏసీపీ శ్రీకాంత్ తో పాటు పలువురు అధికారులు హైడ్రా కమిషనర్ వెంట ఈ సందర్శనలో ఉన్నారు.



ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే చర్యలు

- తహసీల్దార్ గౌతమ్ కుమార్

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 10 : ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే చర్యలు తప్పవని మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్ కుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 30లో సుమారు 0.25 గుంటల భూమిని పక్కన భూమి ఉన్న వ్యక్తి కబ్జాచేసి తన భూమిలో కలిపి పైపులైన్ వేయడం జరిగిందని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ గౌతమ్ కుమార్ రెవెన్యూ సిబ్బందితో కలిసి కబ్జా జరుగుతున్న స్థలాన్ని పరిశీలించి పనులను నిలిపివేశారు. అనంతరం అట్టి భూమిలో సూచిక బోర్డును ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ భూమిని కబ్జాచేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్ స్పెక్టర్ రాజేష్, సర్వేయర్ జలజ, జీపీవో రాజేశ్వర్ , రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

తోల్ కట్ట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చోరీ

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 10: తోల్కట్ట ఎస్ఎంఎస్ఎం జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో ఆదివారం రాత్రి కంప్యూటర్లు చోరీకి గురైనట్లు ప్రధానోపాధ్యాయుడు కె.రాములు తెలిపారు. ఈ నెల 7వ తేదిన శుక్రవారం పాఠశాలకు 7:30 గంటల సమయంలో తాళం వేసి వెళ్లడం జరిగింది. అయితే 9వ తేదిన సాయంత్రం 7 గంటల సమయంలో పనిచేసే క్లీనర్స్ లక్ష్మీ, భర్త కిష్టయ్య పాఠశాలకు వచ్చి చూడగా కంప్యూటర్ ల్యాబ్ తలుపులు పగులగొట్టి ఉన్నాయని సమాచారం అందించింది. అందులో ఐదు కంప్యూటర్లు, ప్రొజెక్టర్ , సీపీయూ, మౌస్, కీబోర్డులు, విలువైన వైర్లు దొంగిలించినట్లు గుర్తించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



జగన్ పులివెందుల ఎమ్మెల్యే మాత్రమే. అసెంబ్లీలో సాధారణ ఎమ్మెల్యేకి ఇచ్చే సమయమే జగన్‌కు ఇస్తాం. ఆయన మీడియా ముందు కాకుండా అసెంబ్లీకొచ్చి మాట్లాడాలి. నా ముందు అధ్యక్షా అనడం ఇష్టంలేకే అసెంబ్లీకి రావడం లేదు. వైసీపీ ఎమ్మెల్యేలు జీతాలు తీసుకుంటున్నారు. కానీ, అసెంబ్లీకి మాత్రం రావట్లేదు.
- ఏపీఅసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు



ప్రాంతీయం

అందెశ్రీ పాటకి మరణం లేదు

- తూర్పు జగ్గారెడ్డి



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 10 : ప్రజాకవి, రచయిత అందెశ్రీ హఠాన్మరణం బాధాకరమని, 2004 సంగారెడ్డి ధూంధాంతో ఆయన పాటతో తనకు పరిచయమైందని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అందెశ్రీ పాటలు ప్రజలను చైతన్య పరిచాయన్నారు. తెలంగాణ గడ్డపై ప్రజాకవి అందశ్రీ పేరు ఎప్పటికీ నిలిచి ఉంటుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాటలది ప్రధాన పాత్ర అని, ఆయన మరణం తెలంగాణ ప్రజలకి తీరనిలోటన్నారు. ఆయన మరణించినా అందెశ్రీ పాట కి మరణం లేదని, తనని పాట ఎప్పటికీ సజీవం గానే ఉంచుతుందన్నారు. సమాజం గురించి మనిషి గురించి మనుషులు ఎలా వుండాలనే దానిపై అందెశ్రీ పాటలు మనలో చైతన్యం కలిగిస్తాయన్నారు.ఆయన ఆత్మకుశాంతి కలగాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అందెశ్రీ కి నివాళులు అర్పించిన మంత్రి దామోదర



ప్రతిపక్షం, సిటీబ్యూరో ,నవంబర్ 10: ప్రముఖ కవి, రచయిత అందెశ్రీకి మంత్రి దామోదర్ రాజనర్సింహ నివాళులు అర్పించారు. అందెశ్రీ భౌతికకాయం వద్ద పుష్పగుచ్చం ఉంచి మంత్రి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదరరాజనర్సింహ మీడియాతో మాట్లాడుతూ అందెశ్రీ మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటన్నారు. తన మాట, పాటతో పేదల జీవితాలను కండ్లకు కట్టినట్టు చూపిన గొప్ప కవి అందెశ్రీ. బడుగుల జీవితాల మీద, మానవత్వం మీద... మాయమైపోతున్నాడమ్మ మనిషన్నవాడు వంటి అద్భుతమైన గీతాలు రాసిన గొప్ప మానవతావాది అని కొనియాడారు. తన కవితలతో, ఉద్యమ పాటలతో తెలంగాణ జాతిని జాగృతం చేసిన విప్లవకారుడు. స్వరాష్ట్ర సాధనలో ముక్కోటి గొంతులను ఒక్కటి చేసిన ఉద్యమ నేత. అలాంటి ఒక గొప్ప కవి, రచయిత, మానవతావాది ఈరోజు మన మధ్యలో లేకపోవడం తీవ్ర బాధాకరమైన విషయమన్నారు. అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా గుర్తించడం జరిగింది. ఆయన భౌతికంగా ఈరోజు మన మధ్య లేనప్పటికీ, జయజయ హే తెలంగాణ గీతం రూపంలో, అనేక పాటల రూపంలో చిరస్థాయిగా నిలిచి ఉంటారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానన్నారు.

కార్మికులు జీతాలు అడిగితే డ్యూటీ కి రానివ్వరా?

- ఐఐటి కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు ఇవ్వాలి
- కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్న కాంట్రాక్ట్ ను వెంటనే రద్దు చేయాలి
- కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు అతిమేల మాణిక్ డిమాండ్



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 10 : ఐఐటి లో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ కార్మికులు జీతాలు అడిగితే విధులకు రాకుండా అడ్డుకోవడం దారుణమని, ప్రతి నెల ఒకటో తేదీని కార్మికులకు జీతాలు ఇవ్వాలని కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సంగారెడ్డి జిల్లా కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు అతిమేల మాణిక్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నడుస్తున్న ఆధునిక విద్య సంస్థ ఐఐటి లో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ కార్మికులు ఆలస్యంగా జీతాలు ఇస్తున్నారు అని అడిగినందుకు కాంట్రాక్టర్ ఈరోజు డ్యూటీలోకి రానివ్వకుండా ఐఐటి గేటు వద్ద కార్మికులను ఆపివేయడం దారుణమని అన్నారు. కార్మికులకు నెలనెలా రెగ్యులర్గా జీతాలు ఇవ్వకుండా వేధింపులకు పాల్పడుతున్న కాంట్రాక్టర్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని సిఐటియు డిమాండ్ చేస్తుందని అన్నారు. కార్మికులు జీతాలు అడిగితే బెదిరింపులు వేధింపులు కాంట్రాక్టర్ కార్మికులపై దౌర్జన్యం చేయడమేంటని అన్నారు. జీతాలు అడుగుతే డ్యూటీ రానివ్వకుండా అడ్డుకుంటారా..? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నడుస్తున్న విద్యాసంస్థలోని కార్మికుల పరిస్థితి ఈ రకంగా ఉంటే బయట కార్మికుల పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు. ఐఐటీ కేంద్ర ప్రభుత్వం విద్యాసంస్థ కనుక కార్మికులకు ప్రతినెల ఒకటో తేదీన జీతాలు చెల్లించే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి అరులైన కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులకు న్యాయం జరిగే వరకు సిఐటియు అండగా ఉంటుందని అన్నారు.



స్కూల్ బస్సును ఢీకొని లారీ బోల్తా

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 10: నల్గొండ జిల్లా నార్కెట్ పల్లి మండలం ఏపీ లింగోటం శివారులో జాతీయ రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. శ్రీ విద్యా పీఠ్ స్కూల్ బస్సు యూటర్న్ తీసుకుంటుండగా లారీ వెనక నుండి ఢ కొట్టింది. ఈ ఘటనలో విద్యార్థులకు స్వల్ప గాయాలు కాగా, హైదరాబాద్ నుండి విజయవాడ వైపు ఉల్లిగడ్డల లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడింది. రహదారిపై వెళుతున్న జనాలు ఉల్లిగడ్డలను బస్తాలకు బస్తాలు దొరికిన కాడికి ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



శంభునికుంటను కబ్జాదారుల నుండి
కాపాడాలని కలెక్టర్‌కు సీపీఎం వినతి

- కుంటలో నిర్మించిన అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలి
- కుంటను సుందరీకరించాలి, చెత్తను,పిచ్చి చెట్లను తొలగించాలి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 10 : అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ లో ఉన్న శంభునికుంటను కబ్జాదారుల నుండి కాపాడి ప్రజలకు ఉపయోగపడేలా సుందరీకరించాలని సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేసిన సంతకాల సేకరణతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ గారికి ఇరిగేషన్ ఎస్ఇ జగన్నాథం కి అందజేసిన సిపిఎం నాయకులు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు నర్సింహారెడ్డి మాట్లాడుతూ,బీరంగూడ లోని 765 సర్వే నెంబర్ లో ఉన్న 22 ఎకరాల 11 గుంటల శిఖం భూమిలో అనేక అక్రమ నిర్మాణాలు జరిగాయని, వీటిని తొలగించి కుంటను ప్రజలందరికీ ఉపయోగపడేలా సుందరీకరణ చేయాలని సిపిఎం, ప్రజాసంఘాలు చేసిన విజ్ఞప్తికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని 1200 సంతకాలు చేశారని తెలిపారు. చుట్టుపక్కల ఉన్న కాలనీవాసులు, ప్రజలు శంభునికుంటను సుందరీ కరణ చేయాలని,అందంగా తీర్చిదిద్దాలని పెద్ద ఎత్తున కోరుకుంటున్నారని అనడానికి ఇది నిదర్శనం అని తెలిపారు. కుంటలో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి,కోట్ల విలువ చేసే భూమిని కాపాడాలని, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా చూడాలని అన్నారు. కుంటలో ఉన్న చెత్తను,పిచ్చి మొక్కలను వెంటనే తొలగించి,దుర్వాసన, విష జ్వరాల నుండి దోమల భారీ నుండి ప్రజలను కాపాడాలని,కుంట చుట్టు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు నాయన లలిత, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సునీత, సిఐటియు నాయకులు పాండురంగారెడ్డి,శ్రీనివాస్,రామ్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 10 : ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కార్తీక మాసం పురస్కరించుకొని సోమవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జెపి కాలనీ శ్రీ ఉమామహేశ్వర దేవాలయంలో ఏర్పాటు చేసిన లక్ష బిల్వార్చన కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు. శివయ్య కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు సూర్య ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



కష్టపడి పండించిన పంటను దళారులకు అప్పగించొద్దు

- టీజీ ఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 10 : కంది, సంగారెడ్డి మండలాలలో వనకాలం వడ్ల కొనుగోలు కేంద్రాలను టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ప్రారంభించారు,ప్రతి రైతు వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు,కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అప్పగించొద్దని,తెలంగాణ ప్రభుత్వం వడ్లకు మద్దతు ధర ఇస్తుందని,ఏ గ్రేడ్ 2389, సాధారణ రకం గ్రేడ్ 2369, సన్నవడ్లకు 2389 బోనస్ 500, మొత్తం 2889 గా ఇస్తుంది,కావున ప్రతి ఒక్క రైతు వడ్ల కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలని వారు అన్నారు,బోనస్ కు కావలసిన పత్రాలు, కొత్త పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్ బుక్, ఆధార్ కార్డ్ ఉండాలని సూచించారు, ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు గౌడ్,ప్రభాకర్ రెడ్డి,తాళ్లపల్లి మాజీ సర్పంచ్ ప్రవీణ్ కుమార్,మాజీ ఉపసర్పంచ్ హషం,లక్ష్మారెడ్డి, ప్రభుత్వ అధికారులతో పాటు, రైతులు మరియు తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న రోడ్ పనులు వేగవంతంగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య
- ఎన్నికల విధులు నిర్లక్ష్యం చేయొద్దు
- జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 10 : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్ పనులు నువెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరంజిల్లాలో వివిధ శాఖల అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు ... ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలో దెబ్బతిన్న ఆర్ అండ్ బి పరిధిలోని రోడ్లు, పంచాయతీ రాజ్ రోడ్లు పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. టెండర్లు పూర్తయిన పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల విధుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించోదన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల విధులు నిర్వహించాలని సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. పటాన్చెరువు నియోజకవర్గ పరిధిలో సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు బిఎల్ఓ లను బిఎల్ఓ సూపర్వైజర్లను సరిగా మానిటర్ చేయకపోవడం వల్ల అనుకున్న లక్ష్యాలను సకాలంలో చేరుకోవడం లేదని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం ఇస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇంకా కొంతమంది బిఎల్వోలు తమ ఆన్లైన్ ఆప్ లో ఇప్పటికీ లాగిన్ కాలేదని అలాంటి సమస్యలు ఇకముందు పునరావృతం కావద్దని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని మున్సిపాలిటీలలో టి ఎస్ బి పాస్ కింద వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తాసిల్దార్ల నుండి మున్సిపల్ కమిషనర్ల నుండి కలెక్టరేట్కు వచ్చే ఫైళ్ళలో పూర్తి సమాచారంతో పంపాలనిఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి ,డిఆర్ఓ పద్మజ రాణి, సంబంధిత జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి 'కోటి' పరిహారం ఇవ్వాలి

- కామినేని ఆసుపత్రికి బిగ్ షాక్
- జిల్లా వినియోగదారుల ఫోరం సంచలన తీర్పు

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 10: ఓ మహిళకు నిర్లక్ష్యంగా వైద్యం చేసి, ప్రాణాన్ని బలిగొన్న కేసులో నల్గొండ జిల్లా వినియోగదారుల ఫోరం సోమవారం సంచలన తీర్పు ప్రకటించింది. నార్కట్ పల్లి కామినేని హాస్పిటల్ యాజమాన్యం బాధిత కుటుంబానికి "కోటి" రూ.ల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. నెల రోజుల్లో డబ్బు చెల్లించకపోతే తొమ్మిది శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశించింది. చిట్యాల మండలం ఆరెగూడెంకు చెందిన అస్నాల స్వాతిని కుటుంబ సభ్యులు డెలివరీ కోసం జూలై 9, 2018న నార్కట్పల్లి కామినేని ఆసుపత్రిలో చేర్పించగా, జూలై 13న రాత్రి వైద్యులు ఆపరేషన్ చేశారు. రెండుసార్లు మత్తుమందు ఇవ్వడంతో వైద్యం వికటించి 14న మృతి చెందింది.

సస్పెండ్ చేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- కార్మిక చట్టాలు మారకముందే యాజమాన్యాల బరితెగింపు
- రాజ్యాంగబద్ధ హక్కులను కాలరాస్తూ కార్మికుల తొలగింపు
- బిస్లరీలో యూనియన్ పెట్టకున్నారని ఉదోగ్యం తీసివేశారు.
- మైక్రోబాక్స్ కంపెనీలో 13 మంది తొలగింపు
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 10 : యూనియన్ పెట్టుకున్నారనే కక్షతో కార్మికులను విధుల్లో నుంచి బిస్లరీ కంపెనీ యాజమాన్యం తొలగించిందని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. బిస్లరీ, మైక్రో బాక్స్ కంపెనీలలో కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం యూనియన్ పెట్టకుంటే కార్మికులను ఉద్యోగం నుంచి తొలగించడానికి నిరసిస్తూ సోమవారం సీఐటీయూ ఆద్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ పరిశ్రమల్లో కార్మికులు చట్టబద్ధంగా యూనియన్ పెట్టుకుంటే రాజ్యాంగ బద్ధమైన హక్కును సహించకుండా పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలోని బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో యూనియన్ పెట్టుకున్నారనే సాకుతో ఐదు మంది యూనియన్ నాయకులను ఉద్యోగం నుంచి తొలగించారు. అదే విధంగా కొండాపూర్ మండలంలో మైక్రోబాక్స్ అనే కంపెనీలో సీఐటీయూ యూనియన్ పెట్టుకున్నారని 13 మంది కార్మికులను ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. దీనిపై లేబర్ అధికారులకు, కలెక్టర్ కు ఫిర్యాదు చేశామన్నారు. చట్టాలు అమలు చేయకపోతే చట్టాన్ని రక్షించాల్సిన యంత్రాంగం ఎందుకు మౌనంగా ఉంటుందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అనేక కంపెనీలలో వేతనాలు ఇవ్వడం లేదన్నారు. అదే విధంగా యూబీ నైజాం బీరు కంపెనీ ఉత్పత్తి ఆపివేశారు..ఎవరి అనుమతి తీసుకుని ఉత్పత్తి ఆపివేశారని ప్రశ్నించారు.

మీకు కార్మిక చట్టాలు వర్తించవా

ఉత్పత్తి ఆపివేయడం వల్ల 200మంది కాంట్రాక్టు కార్మికుల ఉపాధి కోల్పోయారని తెలిపారు. బీరు ఇండస్ట్రీలో కోట్ల రూపాయల లాభాలు సంపాదించే మీరు కాంట్రాక్టు కార్మికులు మీకు భారమయ్యారా అంటూ ప్రశ్నించారు. ఇవాలా కాంట్రాక్టు కార్మికులు లేకుండానే ఉత్పత్తి చేశారా అన్నారు. ఆర్చ్ ఫార్మాలో అనే కంపెనీలో దాదాపు 11 నెలల నుంచి వేతనాలు యాజమాన్యం ఇవ్వడం లేదని, ఒకనెల పనిచేస్తే మరుసటి నెల వేతనం ఇవ్వాలి కదా అన్నారు. వేతనాలు ఇవ్వాలని చట్టాలు చెబుతున్నా ఇంత దారుణంగా నగ్నంగా కార్మిక చట్టాల ఉల్లంఘన ఈ సంగారెడ్డి జిల్లాలో జరిగితే ఇక్కడ ఉండే లేబర్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వేతనాలు ఇవ్వకుంటే రాష్ట్రంలో ఉన్న కమీషనర్, జేసీఎల్, డీసీఎల్ , కార్మికశాఖ మంత్రి ఏం చేస్తున్నారని మండిపడ్డారు. తొలగించిన కార్మికులను వెంటనే బిస్లరీ యాజమాన్యం, మైక్రోబాక్స్ యాజమాన్యం వెంటనే పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్చ్ ఫార్మా కంపెనీ వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని అన్నారు. అనంతరం కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లిఖార్జున్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీరం మల్లేశం, జి.సాయిలు, జిల్లా కోశాధికారి కే. రాజయ్య జిల్లా ఉపాధ్యక్షులు అతిమేల మానిక్, ప్రవీణ్ పాండురంగారెడ్డి, బాగారెడ్డి, నాగేశ్వర్ రావు, మైపాల్ యాదగిరి, పీఎన్ఎం జిల్లా కార్యదర్శి ఎ.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



తిరుమల కల్తీ నెయ్యి కేసులో సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన 'సిట్' నిజాన్ని బట్టబయలు చేసింది. కల్తీ నెయ్యి కేసులో దోషులకు కఠిన శిక్షలు తప్పవు. ఇది కల్తీ కాదు.. హిందువుల నమ్మకం, భారత దేశ ఆత్మవిశ్వాసంపై ఉద్దేశపూర్వకంగా చేసిన దాడి. తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వాళ్లు తప్పక మూల్యం చెల్లించుకోవాల్సిందే.

- ట్విట్టర్లో
ఏపీ మంత్రి లోకేశ్



సాహితీ సమ్మేళనంలో చిట్యాల విద్యార్థుల ప్రతిభ

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 10: తెలంగాణ సాహితీ ఉమ్మడి నల్గొండ జిల్లా వారి ఆధ్వర్యంలో నల్గొండలో ఆదివారం నిర్వహించిన సాహితీ సమ్మేళనంలో చిట్యాలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. పద్యాల పోటీల్లో స్థానిక లయోలా స్కూల్‌కు చెందిన మోక్ష ద్వితీయ బహుమతిని, భావన, నేహా కన్సోలేషన్ బహుమతులను పొందారు. కవితల పోటీలో తరుణి ప్రశంసా పత్రాన్ని పొందారు. పాఠశాల ఉపాధ్యాయులు వీరిని సోమవారం అభినందించారు.

టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించిన కేంద్ర మంత్రి సంజయ్

- కలెక్టర్ కు చెక్కు అందజేసిన బీజేపీ నేతలు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 10: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సోమవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ పరీక్ష ఫీజు చెల్లించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 12 వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు పదో తరగతి చదువుకుంటున్నారు. సిద్దిపేట జిల్లాలో 1013 మంది విద్యార్థులున్నారు. వీరందరి పక్షాన పరీక్ష ఫీజు మొత్తాన్ని బండి సంజయ్ చెల్లించారు. సిద్దిపేట జిల్లా విద్యార్థుల పక్షాన బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు మోహన్ రెడ్డి కలెక్టర్ ను కలసి పరీక్ష ఫీజు మొత్తాన్ని చెక్ రూపంలో అందజేయడం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారే కావడం, వారిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్ష ఫీజు కూడా చెల్లించలేకపోతున్నారని, ఈ మేరకు తన వేతనం నుండి ఆ మొత్తాన్ని చెల్లిస్తానని ఇటీవల కేంద్ర మంత్రి కలెక్టర్ కు లేఖ రాశారు. అనుకున్నట్లుగా ఆ మొత్తాన్ని చెక్ రూపంలో అందజేశారు.



అతి త్వరలోనే ''మోదీ గిఫ్ట్'' పేరుతో సర్కారీ స్కూళ్లలో 9వ తరగతి చదువుకునే విద్యార్థులకు సైతం సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి హుస్నాబాద్ మండల అధ్యక్షుడు సంపత్ నాయక్ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దినేష్, సత్యం, సాయికిరణ్ అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

- 15 మందికి రూ.1.51 లక్షల జరిమానా



ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 10: సిద్దిపేట ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 15 మందిని పట్టుకున్నారు. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, సిబ్బందితో కలిసి ఇటీవల పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, ఇతర చౌరస్తాలు, రాజీవ్ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రీత్ ఎనలైజర్ పరీక్షల్లో 15 మంది మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు తేలింది. వీరిని న్యాయస్థానంలో హాజరుపరచగా, సిద్దిపేట ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కుమారి వి. తరణి విచారణ జరిపి మొత్తం రూ.1,51,500/ జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ కె. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టవిరుద్ధం. ప్రజలు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

కల్తీ కల్లు సేవించి కంపెనీ కార్మికుడు మృతి

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 10: బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చిన కంపెనీ కార్మికుడు కల్తీకల్లు సేవించి కల్లు దుకాణంలోనే మరణించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. మనోహర్ మండలం ముప్పిరెడ్డిపల్లి లోని కల్లు దుకాణంలో కల్లు సేవించిన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రామ్ చరణ్(30)దుకాణంలోనే మరణించాడు. ఈ విషయమై స్థానికులు మనోహరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుభాష్ గౌడ్ కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.





నాచగిరిలో విశేష గంగా హారతి, కళా ప్రదర్శనలు

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 10: కార్తీక మాసం సోమవారం పురస్కరించుకొని వర్గల్ మండలం, నాచగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఉపాళయమైన శివాలయంలో అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించుకొని శ్రీ లక్ష్మి నరసింహ స్వామిని భక్తితో దర్శించుకున్నారు. నిత్య కళ్యాణం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతములు, అభిషేకములు, కార్యక్రమాలు ఆచరించినారు. అనంతరం సాయంత్రం ఆకాశ దీపారాధన మరియు నదీ హారతి కార్యక్రమాలు వైభవంగా జరిగినది. దేవస్థానం తరపున సుహాసినులకు తాంబూలం (పసుపు, కుంకుమ, గాజులు, బొట్టు, పండు, కనుమలు) ఆలయ చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్తా, కార్యనిర్వాణాధికారి వి. విజయరామారావు ధర్మకర్తలు ఉషాశ్రీ రాజశేఖర్ శర్మ, కొత్తపల్లి శ్రీనివాస్ అందజేశారు. వెంకటేశ్వర కళ అకాడమీ బృందంచే బాలికలతో నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమానికి గజ్వేల్ సంతోషిమాత దేవాలయం వేద పండితులు రాజశేఖర్ శర్మతో వచ్చిన మహిళా భక్తులు గంగా హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ కార్యనిర్వాణాధికారి మరియు ధర్మకర్తలు ఆలయ సుధాకర్ తగు ఏర్పాటు చేశారు.



నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్

- బీఆర్ఎస్ నాయకులు పంజా స్వామి

ప్రతిపక్షం, దౌల్తాబాద్, నవంబర్ 10: నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరంగా మారిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పంజా స్వామి అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట గ్రామానికి చెందిన గడ్డమీది మహిమ జీవన్ రాజ్ కు రూ.49 వేల 500 సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్ గౌడ్, సంపత్, కనక రెడ్డి, గాడి రాజు, కనకయ్య, కుమార్, బాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మగ వరి విత్తనాల సాగుతో నష్టపోయిన రైతులు

- 100 ఎకరాల్లో నష్టం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 10: ప్రైవేట్ కంపెనీ యాజమాన్యం అందజేసిన మగ వరి విత్తనాల సాగుతో తీవ్రంగా నష్టపోయామని మెదక్ జిల్లా చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామ రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ గ్రామానికి చెందిన సుమారు 40 మంది రైతులు 100 ఎకరాల్లో మగ రకం వరి సాగు చేస్తున్నట్లు తెలిపారు. సీడ్ కంపెనీ యాజమాన్యం మగ వరి రకం 45 , 47 రకం అందజేశారని తెలిపారు. సమయానికి పిలకలు క్రాప్ రాకపోవడం వరి కంకులు తాళి గింజలు ఏర్పడంతో పూర్తిగా నష్టపోయామన్నారు. పంట నష్టపోయిన రైతులందరూ చేగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ గ్రామ రైతులు మేకల పరమేశ్వర్ రామచంద్రం గణేష్ శ్రీనివాస్ మోహన్ తదితరులు వాపోయారు. ఎకరాకు 20 నుండి 25 వేలు ఖర్చు చేశామని క్రిమిసంహారక మందులు పిచికారి చేసిన ప్రయోజనం లేకపోయిందన్నారు. వ్యవసాయ అధికారులను సైతం సాంప్రదించామన్నారు. ఈ విషయమై సీడ్స్ అందజేసిన సూపర్వైజర్లకు ఫోన్ కాల్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదని గత్యంతరం లేక పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని అధికారులకు మొరపెట్టుకున్నారు.



గొడుగుపల్లి అడవిలో చిరుత పులి

- చుట్ట పక్కల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- దుబ్బాక రేంజ్ అధికారి సందీప్ కుమార్

ప్రతిపక్షం, దౌల్తాబాద్, నవంబర్ 10: గొడుగుపల్లి అడవిలోని ఓ పొదల్లో చిరుత పులి నక్కిన సంఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గొడుగుపల్లికి చెందిన చందా బిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం... బిక్షపతి రోజు మాదిరిగానే తన వ్యవసాయ పొలం వద్ద పశువులను మేపటానికి వెళుతున్న క్రమంలో ఓ చిరుత పులి పశువుల పైకి దాడి చేసే ప్రయత్నం చేసిందని, భయంతో నేను కేకలు వేయడంతో ఆ చిరుత పులి వెనక్కి వెళ్లిందన్నారు. సమాచారం తెలుసుకున్న దుబ్బాక రేంజ్ అధికారి సందీప్ కుమార్, సెక్షన్ ఆఫీసర్ హైమద్, బీట్ ఆఫీసర్ వేణు గొడుగుపల్లి అటవీ ప్రాంతానికి వెళ్లారు. పొదల్లో నక్కిన చిరుత పులిని పరిశీలించి గుర్తించారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి సందీప్ కుమార్ మాట్లాడుతూ గొడుగుపల్లి పక్కన జత్రం తండా మధ్యలో గొడుగుపల్లి అడవిలోని ఓ పొదల్లో దాగి ఉన్న చిరుత పులిని గుర్తించామన్నారు. రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతుందని, చిరుత సమాచారాన్ని హైదరాబాద్ స్పెషల్ టీంకు సమాచారం అందించామన్నారు. స్పెషల్ టీం సమాచారం ప్రకారం చిరుత పులి అక్కడ ఎందుకు దాగి ఉందని దానికి ఏమైందని స్పెషల్ టీం తెలిపిన వివరాలను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెటర్నరీ వైద్యాధికారులకు సమాచారం ఇచ్చామని చిరుత హెల్దీగా ఉందా లేదా అనే విషయాన్ని వెటర్నరీ వైద్యులు పరిశీలించి గుర్తిస్తారని తెలిపారు. రైతులు ఎవరు ఆ చుట్టుపక్కల పొలాల వద్దకు వెళ్లవద్దని సమాచారం ఇచ్చారు.



అందెశ్రీ మరణం

సాహితీ సమాజానికి తీరని లోటు

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 10:- తెలంగాణ అస్తిత్వ ఉద్యమానికి, సాహితి సమాజానికి తీరని లోటని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. సోమవారం మెదక్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వాగ్గేయకారుడు, కవి, రచయిత అందెశ్రీ మరణించడం చాలా బాధాకరమని, ఆయన రచనలతో తెలంగాణ పోరాటానికి, సమాజానికి మేలు జరిగిందని, ఆయన రచించిన పాటనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర పాటగా చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు.



ఆర్మీకి ఆర్థికంగా సహకరిద్దాం

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 10: ఆర్మీకి సహాయ సహకారాలు, ఆర్థికంగా సహకరిద్దామని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం భారత స్కౌట్ అండ్ గైడ్స్ వారి వారోత్సవాల్లో భాగంగా భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ స్టిక్కర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ఆవిష్కరించిన స్టిక్కర్స్ ను పాఠశాల స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు విక్రయించగా వచ్చే డబ్బులను ఆర్మీ సహాయ సహకారాలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ లో శిక్షణ పొందిన వారు పాఠశాల,ప్రభుత్వ ,ప్రైవేట్ సంస్థలో విక్రయిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో డీఈఓ రాధకిషన్, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ఇప్ప రాజేందర్, నాగరాజు, జ్యోష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధి, ఉపాధికి ప్రభుత్వం చర్యలు

- కొంటూరు చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- మత్స్యకారులకు ఉపాధి కోసం చేప పిల్లల పంపిణీ
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు




ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 10:- మత్స్యకారుల సంక్షేమంలో భాగంగా వారికి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టినటువంటి 100% రాయితీతో చేపపిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం మెదక్ మండలం కోంటూర్ పెద్ద చెరువులో 1,84,500 చేప పిల్లలు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సంబంధిత మత్స్య శాఖ అధికారులు మత్స్య సహకార సంఘ సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కోంటూర్లో ఏర్పాటు చేసిన సమావేశములో ఎమ్మెల్యే మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గ పరిధిలోని 98 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలలో గల 6,762 సభ్యులకు జీవనోపాధి కల్పించడం వలన ఎంతో సంతోషిస్తున్నామన్నారు. ప్రజల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యంమని తెలిపారు. మెదక్ నియోజకవర్గ పరిధిలోని 546 చెరువులు, కుంటలలో 211.39 లక్షల చేప పిల్లలు సరఫరా చేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా 39 పెరినియల్ చెరువులలో 63.28 లక్షల 80-100ఎంఎం సైజు గల చేపపిల్లలు, 507 సిసనల్ చెరువులలో 148.10 లక్షల 35-40ఎంఎం సైజు గల చేపపిల్లలు విడుదల చేస్తామన్నారు. అదే విధంగా జిల్లాలోని 1,728 చెరువులు, కుంటలు పోచారం, హల్దీవాగు ప్రాజెక్టులలో రూ.488.75 లక్షల విలువగల 550.88 లక్షల చేపపిల్లలు విడుదల చేయనున్నట్లు తెలిపారు. అనంతరం రాజ్ పల్లి, మల్కాపూర్ తండా, కొంటూర్లలో పర్యటించారు. అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ 35వేల కోట్లు రుణమాఫీ చేసి రైతులను ఆదుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు ఎం. రామకృష్ణ, అధ్యక్షులు ఎల్ల బోయిన ప్రశాంత్, డైరెక్టర్ జి దేవేందర్, జి అంజయ్య, సంబంధిత ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మైనార్టీల మనోభావాలను దెబ్బతీసిన రేవంత్ రెడ్డి

- మైనార్టీ ఓట్ల కోసం మంత్రి పదవులు
- బీఆర్ఎస్ మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకుడు జుబేర్ పాషా

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 10: "మైనారిటీలు అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ లేనిదే ముస్లింలు లేరని" ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు మైనారిటీల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకుడు జుబేర్ పాషా విమర్శించారు. సోమవారం నాడు గజ్వేల్ క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని ముస్లింలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో మైనారిటీల పాత్ర కీలకమైందని గుర్తుచేస్తూ, బీఆర్ఎస్ ప్రభుత్వం వారి అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేసిందని జుబేరు పాషా తెలిపారు. గత పాలనలో మైనార్టీలకు హోంమంత్రి, ఉప ముఖ్యమంత్రి పదవులు ఇవ్వడం ద్వారా బీఆర్ఎస్ మైనారిటీలకు ప్రాధాన్యతనిచ్చిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్‌లో అనుభవజ్ఞులైన నేతలు ఉన్నా, ఎలాంటి అనుభవం లేని అజారుద్దీన్‌ను కేవలం జూబ్లీహిల్స్ బైపోల్ కోసం మంత్రిగా చేసిన తీరు వారి మైనారిటీలపై ఉన్న కపట ప్రేమను చూపిస్తోంది అని జుబేరు పాషా అన్నారు. జూబ్లీహిల్స్ బైపోల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు ఖాజా విరాసత్ అలీ, సయ్యద్ యూసఫ్ ఉద్దీన్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఇక్బాల్, పర్వేజ్ ఉమర్, గులామ్, మాజీ ఎంపిటిసి రియాజ్, అహ్మద్, వాజిద్, జమీల్, అల్తాఫ్, బాబా, షేర్ అలీ, పాషా, అక్రమ్,జహంగీర్, నవాజ్, సర్వర్, యూసఫ్, బాబా పాల్గొన్నారు.



వన్డే వరల్డ్ కప్ విజయోత్సవాల్లో ఉన్న మహిళా క్రికెటర్లు అవార్డులు, రివార్డులు అందకుంటే నిరుత్సాహపడకండి. విజేతల ద్వారా ఫ్రీ పబ్లిసిటీ పొందాలని కొందరు ప్రయత్నిస్తారు. ఈ సిగ్గులేని వాళ్లు తమను తాము ప్రమోట్ చేసుకునేందుకు మిమ్మల్ని వాడుకుంటున్నారు. దీనికి బాధపడొద్దు. గతంలో 1983 మెన్స్ టీమ్‌కూ ఇలాంటి హామీలు వచ్చాయి.

- సునీల్ గవాస్కర్, మాజీ క్రికెటర్

ప్రతిపక్షం
Prathipaksham.in

8 | హైదరాబాద్ | మంగళవారం 11.11.2025

@prathipaksham
prathipakshamtvtelugu

ప్రాంతీయం



అందేశ్రీకి టీయూడబ్ల్యూజే అధ్యక్షుడి నివాళి

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్10: లాలాపేటలోని జయశంకర్ స్టేడియంలో తెలంగాణ ప్రజా రచయిత, సుప్రసిద్ధ గాయకులు అందేశ్రీ మృత దేహానికి సోమవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ నివాళులర్పించారు. ఆయనతోపాటు పలువురు జర్నలిస్టులు అందేశ్రీ కి నివాళులర్పించారు.



ప్రజా గాయకుడు అందెశ్రీకి అశ్రునివాళి

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 10 : గజ్వేల్‌లో దళిత సంఘాల ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు అందెశ్రీకి అంబేడ్కర్ విగ్రహం వద్ద అశ్రునివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పొన్నాల కుమార్ మాట్లాడుతూ అందెశ్రీ పాట, మాటలు ధిక్కార స్వరంగా నిలుస్తాయని అన్నారు. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి మాట్లాడుతూ ఆయన పేరు తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత ఐకాస నాయకుడు చిప్పల యాదగిరి, మాలమహనాడు యువజన కార్యదర్శి నిరుడు స్వామి, డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు తదితరులు పాల్గొన్నారు.



42%బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చాలి

- **బీఎల్పీ జిల్లా అధ్యక్షులు తలారి ప్రవీణ్**

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 10: 42% బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్ లో చేర్చాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేయడం జరిగిందని బీఎల్పీ జిల్లా అధ్యక్షులు తలారి ప్రవీణ్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 42% రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర అసెంబ్లీలో బిల్లులను ఆమోదించి, బిల్లును కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర గవర్నర్లకు పంపిఏడు నెలల అవుతున్నా కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్లోనే ఉందని విమర్శించారు. ఈ నేపథ్యంలో రాబోయే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లులను 9వ షెడ్యూల్లో చేర్చందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్పీ నాయకులు కడవెరుగు శ్రీహరి, జి నరసింహులు, దబ్బేట ఆనంద్, శివరాత్రి శ్రీనివాస్, బిట్ల భాను ప్రకాష్, ర్యాకం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అందెశ్రీ మరణం సాహితీ లోకానికి తీరని లోటు

- **తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల నర్సింహులు**



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 10: తెలంగాణ ప్రముఖ కవి, గేయ రచయిత అందెశ్రీ మరణం సాహితీ లోకానికే కాక, తెలంగాణ ఉద్యమ చరిత్రకూ తీరని లోటు అని తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల నర్సింహులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అందెశ్రీ రాసిన గేయాలు ప్రజల్లో జ్వాల నింపాయని ఆయన గుర్తుచేశారు. "జయ జయహే తెలంగాణ" గేయం తెలంగాణ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని, ఆ గీతం తెలంగాణ స్వరాజ్య స్ఫూర్తిని ప్రతిబింబించిందని నర్సింలు అన్నారు. అందెశ్రీ రచనలు కేవలం పాటలు, కవితలు మాత్రమే కాదు, తెలంగాణ ఆత్మను ఆవిష్కరించిన అక్షర సత్యమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, మట్టి, భాష, ఆత్మగౌరవం ప్రతి పద్యంలో ప్రతిధ్వనించినాయని అన్నారు. తెలంగాణ ఉద్యమం సాగిన రోజులలో ప్రజలకు ధైర్యం ఇచ్చిన గళం అందెశ్రీది. ఆయన రచనలు ప్రతి గ్రామంలో మార్మోగాయి. ప్రజల్లో జాగృతి రేపిన ఆ స్ఫూర్తిదాయక గళం ఇక వినిపించకపోవడం బాధాకరం అని నర్సింలు అన్నారు. అందెశ్రీ మరణం యావత్ కళాకారులు, కవులు, రచయితలు, సాహిత్యాభిమానులందరికీ తీరని లోటని ఆయన వ్యాఖ్యానించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని రగిలించిన గొప్ప కవి, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే సాహిత్య స్రష్ట అని మద్దెల నర్సింహులు కొనియాడారు.



రామంచ పాఠశాలలో క్విజ్ పోటీ

- **సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బహుమతుల పంపిణీ**

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 10: భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా రామంచ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను మూడు గ్రూపులుగా విభజించి మహాభారతం, రామాయణం, భాగవతం తో పాటు అన్ని మతాలకు సంబంధించిన ముఖ్య విషయాలపై ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆసక్తిగా, పోటాపోటీగా సమాధానాలు చెప్పి అందరిని ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై వి సురేష్ కుమార్ మాట్లాడుతూ... ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు అన్నింటి పై అవగాహన కల్పించేలా సత్యసాయి సేవాసమితి వారు ప్రత్యేక కార్యక్రమం రూపొందించడం బాగుందన్నారు. క్విజ్ పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన గ్రూపుకు సత్యసాయి వాళ్ళు సమకూర్చిన బహుమతులతో పాటు పోటీలో పాల్గొన్న వారికి పాఠశాల ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సేవ సమితి సభ్యురాలు నిర్మల, ఉపాధ్యాయులు గంగ భవాని, అబేదా బేగం, సునీత ,నాగమణి, వరప్రసాద్, యాదయ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్ష ఫీజు చెల్లించిన కేంద్ర మంత్రి సంజయ్

- **జీతం నుండి రూ.5,45, 375 ల మొత్తం చెల్లింపు**
- **చెక్కును జిల్లా కలెక్టర్ కు అందజేత**



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 10: ''మోదీ గిఫ్ట్'' పేరుతో ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ఎగ్జామ్ ఫీజును చెల్లిస్తానని ప్రకటించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ సోమవారం రోజున కరీంనగర్ జిల్లా టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజు రూ.5,45, 375 మొత్తాన్ని చెల్లించారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, నాయకులు గుజ్జు శ్రీనివాస్ లు జిల్లా కలెక్టర్ ను కలిసి పరీక్షా ఫీజు మొత్తానికి సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికి ఈ ఏడాది టెన్త్ ఎగ్జామ్ ఫీజును పూర్తిగా చెల్లించేందుకు ఇటీవల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిర్ణయం తీసుకొని, ఆమేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖ రాశారని తెలిపారు. అధికార వర్గాలు తెలియజేసిన ప్రకారం కరీంనగర్ జిల్లాలో 4,847, మంది 10వ తరగతి విద్యార్థులున్నారనీ, వీరందరికీ పరీక్ష ఫీజు కోసం కరీంనగర్ ఎంపీ, కేంద్రమంత్రి బండి సంజయ్ తన వేతన డబ్బులు నుండి రూ.5,45, 375 ల మొత్తాన్ని చెల్లించడం జరిగిందన్నారు. బండి సంజయ్ కుమార్ అందజేసిన మొత్తాన్ని చెక్ రూపంలో జిల్లా కలెక్టర్ కు అందజేసినట్లు తెలిపారు.

కలెక్టర్ కు సంజయ్ ఫోన్

కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేల సత్పతి కి కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఢిల్లీ నుండి ఫోన్ చేశారు. ఫుడ్ పాయిజన్ తో ఆసుపత్రిలో చేరిన జమ్మికుంట ప్రైమరీ స్కూల్ విద్యార్థుల పరిస్థితిపై ఆరా తీశారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని కలెక్టర్ వెల్లడించారు. అవసరమైతే మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించాలని బండి సంజయ సూచనలు చేశారు.



గజ్వేల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

- **ముగ్గురు జైలుకు, 9 మందికి 90 వేలు జరిమాన**

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 10: గత కొన్ని రోజుల క్రితం గజ్వేల్ పట్టణ పరిసర ప్రాంతాల్లో వాహనాలను గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి, సిబ్బందితో 12 మంది వాహనదారులను "బ్రీత్ ఎనలైజర్" తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని నిర్ధారణ అయిందన్నారు. వారిని సోమవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా విచారణ చేసి 9 మందికి 90 వేల రూపాయల జరిమానా, మరియు ఒక్కరికి 4 రోజుల జైలు శిక్ష, ఇద్దరికీ 3 రోజుల జైలు శిక్ష,3 వేల రూపాయల జరిమాన విధించినట్లు ఇన్స్పెక్టర మురళి తెలిపారు.



తెలంగాణా ఉద్యమ పిడికిలి అందెశ్రీ

- **మెతుకు సీమతో విడదీయరాని అనుబంధం**

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 10 : తెలంగాణ అస్తిత్వ ఉద్యమానికి బిగిసిన పిడికిలి కవి, రచయిత, అందెశ్రీ అని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బి.కొండల్ రెడ్డి, తెలంగాణ ఎన్ జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దొంతి నరేందర్, సీనియర్ కాంగ్రెస్ నేత మధుసూదన్ రావు కొనియాడారు. సోమవారం మెదక్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కార్యక్రమం నిర్వహించారు. అందెశ్రీ చిత్రపటానికి పూల మాల వేసి ప్రజా సంఘాలు నివాళులర్పించారు. అందెశ్రీకి మెతుకు సీమతో విడదీయరాని అనుబంధం ఉందని వక్తలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు బొందుగుల నాగరాజు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు శంకర్, మానవ హక్కుల వేదిక నేత షేక్ అహ్మద్, కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డి, డీబీఎఫ్ నేతలు, దయాసాగర్, రామస్వామి, టీఎన్జీవో నాయకులు ఇక్బాల్ పాషా, మనోహర్, సీఐటీయూ జిల్లా నాయకులు సంతోష్, లక్ష్మణ్ భాస్కర్ రెడ్డి, మనోహర్, మహేందర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, మురళి, తదితరులు పాల్గొన్నారు.



17న మల్లుపల్లిలో అమరుల స్మారక స్థూప నిర్మాణ కార్యక్రమం

- **అమరవీరుల స్మారక కమిటీ జిల్లా కన్వీనర్ శివరాజు, కో కన్వీనర్ మేకల రాములు**

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 10: ఉమ్మడి మెదక్ జిల్లా అమరుల స్మారక కమిటీ ఆధ్వర్యంలో నవంబర్ 17న మిడిదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించబడుతున్న అమరుల స్మారక స్థూపం నిర్మాణ కార్యక్రమం ఘనంగా జరగనుంది. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థి సంఘాలు, ఉద్యమకారులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని జిల్లా స్మారక కమిటీ పిలుపునిచ్చింది. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో జిల్లా కన్వీనర్ శివరాజు, కో కన్వీనర్ మేకల రాములు మాట్లాడుతూ... నాలుగు దశాబ్దాలుగా ప్రజా సమస్యలపై పోరాడి ప్రాణాలు అర్పించిన కామ్రేడ్ సంజీవ్, జాన్సన్, అప్సర్, కనకయ్య లాంటి అమరుల త్యాగాలను నేటి తరం ఎలిగెత్తి చాటాలి. బీడీ కార్మికులు, రైతులు, విద్యార్థులు, మహిళలు, సారా వ్యతిరేక ఉద్యమాలు, సబ్బండ వర్గాల హక్కుల కోసం వీరు చేసిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయి. ఈ అమరుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి సామాజిక బాధ్యత" అని తెలిపారు. ప్రస్తుత కాలంలో ప్రజల కష్టాలు, పేదరికం, దోపిడీ, అణచివేత పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజా ఉద్యమాలకు ప్రేరణగా నిలిచిన వీరి త్యాగాలను స్మరించుకుంటూ స్మారక స్థూప నిర్మాణ ప్రారంభోత్సవంలో పాల్గొని నివాళులు అర్పించాలని కమిటీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ తిరుపతి రెడ్డి, షాదుల్లా, శారద, పృథ్వీరాజ్, అజయ్ కుమార్, ఎల్లం, సాయికుమార్, యాదగిరి తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



15న కామారెడ్డిలో 'బీసీ ఆక్రోష సభ' కరపత్ర ఆవిష్కరణ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 10: 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీల ఆధ్వర్యంలో ఈ నెల 15న కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే బీసీ ఆక్రోశ సభ కరపత్ర ఆవిష్కరణ స్థానిక ప్రెస్ క్లబ్ లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘ నాయకులు మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించి భారత రాజ్యాంగంలో తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చే ప్రక్రియలో నిజాయితీ లేకుండా తప్పుడు జీవో ల ద్వారా బీసీ ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా, బీసీ రిజర్వేషన్ల బిల్లును భారత రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో పెట్టం అని నిర్లక్ష్యంగా ప్రకటించిన కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఖరికి నిరసనగ ఈ రెండు పార్టీల మాయా క్రీడలను చూస్తూ మౌనంగా ఉండి బీసీలను నిర్లక్ష్యం చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నవంబర్ 15న కామారెడ్డి జిల్లా కేంద్రంలో రెండున్నర కోట్ల మంది బీసీ ప్రజల ఆక్రోష సభని నిర్వహించడం జరుగుతున్నదనీ తెలిపారు. ఈ ఆక్రోశ సభ కి జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ కుల సంఘాల నాయకులు, మేధావులు, విద్యావంతులు అధిక సంఖ్యలో తరలి వచ్చి సభని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బోయిని సదన్ మహారాజ్, భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర నాయకులు చక్రధర్ గౌడ్, బీసీ నాయకులు శివ గౌడ్, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు రవిబాబు, డి బి రాజు, ప్రసన్న, చందు, డి ఎస్ యు జిల్లా కన్వీనర్ యాదగిరి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అందెశ్రీ మరణం తీరని లోటు..

- **అందెశ్రీకి నివాళులు అర్పించిన నాయకులు**



ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 10: తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత డాక్టర్ అందెశ్రీ మరణం తీరని లోటని దళిత నాయకులు ఎనగందుల యాదగిరి, అలిబిలి నర్సింగరావు, ఆరెపల్లి రాజయ్య, శ్రీరాముల వెంకటేశ్, కొంకటి తిరుపతి, దేవులపల్లి నర్సింగరావు, దేవులపల్లి రాజమౌళి, గణపురం ఎల్లం, కోదూరు శ్రీనివాస్, దేవులపల్లి యాదగిరి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన డాక్టర్ అందెశ్రీ ప్రశ్నించే గోతులకు స్ఫూర్తి నింపారని చెప్పారు. మండల కేంద్రమైన నంగునూరులో సోమవారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సర్కిల్ వద్ద అందెశ్రీ చిత్రపటానికి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

సాహితీ లోకానికి తీరని లోటు..


తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేషంగా ప్రాచుర్యం పొందిన గొప్ప పాట జయ జయహే తెలంగాణ గేయ రచయిత అందెశ్రీ మరణం తెలంగాణ సాహిత్యానికి తీరని లోటు అని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి. తిరుపతిరెడ్డి అన్నారు. వారి మృతికి సంతాపాన్ని ప్రకటిస్తు, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను అన్నారు. 1998 లో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నంగునూరు మండల శాఖ విద్యా సదస్సు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాలమాకులలో నిర్వహించిన సందర్భంలో "కొమ్మ చెక్కితే బొమ్మరా కొలిచి మొక్కితే అమ్మరా" అనే పాటను అందెశ్రీ మొట్టమొదట గానం చేశారన్నారు.

ప్రజా రచయిత అందెశ్రీ..

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

ప్రతిపక్షం, మిడిదొడ్డి: ప్రజా కవి, గాయకులు అందే శ్రీ మరణం తీరని లోటని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అణగారిన వర్గాల నుండి ఎదిగి వచ్చి, భవన నిర్మాణ కార్మికుడిగా జివితాన్ని ప్రారంభించి, శ్రమజీవుల చుక్కాని గా నిలిచాడాన్నారు. ట్యాంక్ బండ్ పై అందెశ్రీ విగ్రహం పెట్టాలని, ఒక విశ్వవిద్యాలయానికి అందెశ్రీ పేరు పెట్టాలన్నారు.

"



నిశ్చితార్థ వేడుకలో తాను నెక్లెస్ ధరిస్తేనే ఇలా అయిపోతే.. పెళ్లికి వడ్డానం పెట్టుకుంటే ఏమైపోతారో. మన తెలుగు మీమర్లు చాలా ఫన్నీ. మన మహారాజులు, మొగలులు చోకర్లు(నెక్లెస్) ధరించేవారు. చోకర్లు మహిళలకే అనేది పాతకాలం. ఇది 2025.. మనం అలాంటి పరిమిత నమ్మకాల నుంచి బయటకు రావాలి.

- టాలీవుడ్ యంగ్ హీరో అల్లు శిరీశ్

పంటల కొనుగోళ్లను వేగవంతం చేయండి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి



ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 10: కొనుగోలు కేంద్రాల ద్వారా పంట ఉత్పత్తుల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. బోధన్ మండలం బండార్ పల్లి లో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని, కల్దుర్కిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సోమవారం సందర్శించారు. సోయాబీన్ సేకరణ కేంద్రంలో రైతుల నుండి సేకరించిన సోయాబీన్ నిల్వల నాణ్యతను పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత పరిమాణంలో సోయాబీన్ కొనుగోలు చేశారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రాంతాలలో సోయాబీన్, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి కేంద్రంలో సరిపడా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని, రవాణా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలని సూచించారు. అనంతరం కల్దుర్కి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపు వివరాలతో కూడిన రికార్డులను పరిశీలించారు. ధాన్యం సేకరణ ప్రక్రియ తుది దశకు చేరినందున కొనుగోళ్లను వేగవంతం చేయాలని అన్నారు. పూర్తి స్థాయిలో ధాన్యం సేకరణ జరిగిన మీదట కొనుగోలు కేంద్రాలను మూసివేసే ముందు ట్రక్ షీట్ లు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. 17శాతానికి లోబడి తేమ ఉన్న ధాన్యాన్ని రైతులు కేంద్రాలకు తెచ్చిన వెంటనే తూకం జరిపెంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అనవసర కాలయాపన కాకుండా, రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని అన్నారు. కలెక్టర్ వెంట ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, మార్క్ ఫెడ్ డీ.ఎం మహేష్, బోధన్ తహసిల్దార్ విఠల్, కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.



ఢిల్లీ పేలుడు నేపథ్యంలో
కరీంనగర్‌లో విస్తృత తనిఖీలు

- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 10: ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట సమీపంలో కారులో పేలుడు సంభవించిన ఘటన నేపథ్యంలో కరీంనగర్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా, కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండ్, కార్గో పార్సెల్ కేంద్రం, వాహన తనిఖీలు, ఇతర రద్దీ ప్రదేశాలలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో బాంబు స్క్వాడ్ మరియు పోలీస్ జాగిలాల బృందాలు పాల్గొంటున్నాయని కరీంనగర్ పోలీస్ కమిషనర్ తెలిపారు. పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు ఎవరైనా కనిపించినట్లయితే, తక్షణమే డయల్ 100కు లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712670744 కు సమాచారం ఇవ్వాలని సీపీ ప్రజలను కోరారు. ప్రజలు భద్రతా చర్యలకు సహకరించాలని, అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 10 : నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు వివిధ కారణాలతో అనారోగ్యంతో బాధపడి చికిత్స చేసుకున్న బాధితులకు సీఎం సహాయ నిధి ద్వారా 100 మందికి రూ. 26,49,000 ల విలువ గల చెక్కులు అందించడం జరిగిందని తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి, అత్యవసర ఆరోగ్య అవసరాలకు సీఎం సహాయ నిధి పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భరోసా లభిస్తుందని అన్నారు. తన నియోజకవర్గంలో ఎవరైనా ఆర్థికంగా ఇబ్బంది పడుతూ వైద్యం పొందలేని పరిస్థితిలో ఉంటే, వారికి ఈ పథకం ద్వారా ఆదుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నాట్లు తెలిపారు. ఇప్పటి వరకు అనేకమందికి సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేయించామని, అర్హులైన ప్రతిఒక్కరికీ సహాయం అందేలా ప్రయత్నిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగల్లో లక్ష్మి నారాయణ, మాజి కార్పొరేటర్లు న్యాలం రాజు, పంచ రెడ్డి శ్రీధర్, మాస్టర్ శంకర్, నిచ్చక్ కృష్ణ, బట్టు రాఘవేంద్ర, ఈపకాయల కిషోర్, ముత్యాలు, మఠం. పవన్, బట్టికిరి ఆనంద్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అందె శ్రీ అకాల మరణానికి సంతాపం

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 10 : ప్రజాకవి, ప్రకృతి కవి, ఆశుకవి, తెలంగాణ మాతృగీతం రచయిత, సుప్రసిద్ధులైన డా. అందె శ్రీ ఆకస్మిక మరణం పట్ల నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ యాస, సాహిత్యానికి ఎనలేని సేవ చేశారని, తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణను రాసిన అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని కొనియాడారు. తెలంగాణ పోరాటంలో ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని, తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర సాధనలో జయ జయహే తెలంగాణ గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందని గతాన్ని గుర్తుచేసుకున్నారు. అందె శ్రీ బాల్యం నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలో గడవటం జిల్లా చెసుకున్న సౌభాగ్యం అని తెలిపారు. ఆయన మరణం తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



అందెశ్రీకి ఘన నివాళులు

- తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిషన్ నాయక్, మీసాల మల్లిక్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 10: తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం పక్షాన కలెక్టరేట్ ఆవరణలో ప్రజా కవి అందెశ్రీ కి ఘన తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిషన్ నాయక్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందెశ్రీ మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో కవితలతో మూడున్నర కోట్ల తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. తెలంగాణ కావాలనే ఆకాంక్షను రగిలిస్తూ తెలంగాణ యొక్క గొప్పదనాన్ని జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం అనే గేయాన్ని రచించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. మహాకవి అకాల మరణంతో తెలంగాణ ప్రజలందరూ దుఃఖ సముద్రంలో మునిగిపోయినారన్నారు. అతని మరణ వార్త తెలంగాణ ప్రజలకు తీరని లోటు అని అన్నారు తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ శాఖ రాష్ట్ర అధ్యక్షులు అన్నారు. ఈ సందర్భంగా అతనికి తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘ సభ్యులందరూ ఘన నివాళులు అర్పించారు.



మైసమ్మ గుళ్లను కూల్చివేసిన అధికారులపై ఫిర్యాదు

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 10: రామగుండం కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని, ఎన్టీపీసీలో గుడుల విధ్వంసాన్ని చట్ట విరుద్ధంగా నిర్వహించిన మున్సిపల్ కమిషనర్, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, సంబంధిత అధికారులు అందరిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని సోమవారం హిందూ ఐక్యవేదిక నాయకులు కొండపర్తి సంజీవ్ కుమార్ పేరుపై గోదావరి ఖని వన్ టౌన్, ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా హిందూ ఐక్యవేదిక నాయకులు కందుల సంధ్యారాణి, సుల్వ లక్ష్మీ నరసయ్య, అంబటి నరేష్ లు మాట్లాడుతూ సుప్రీంకోర్టు డైరెక్షన్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2010 లో ఇచ్చిన 262 జీవో లో ఉన్న నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ అధికారులు గుడులను కూల్చారని, కాబట్టి పోలీస్ శాఖ నిష్పక్షపాతంగా విచారణ చేసి విధ్వంసంలో పాల్గొన్న అధికారులపై కేసు నమోదు చేసి ప్రాసిక్యూషన్ చేయాలని డిమాండ్ చేశారు. హిందూ ఐక్య వేదిక నాయకులు కొండపర్తి సంజీవ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హిందూ నాయకులు మెరుగు హనుమంత్ గౌడ్, కోమల్ల మహేష్, కందుల సంధ్యారాణి, ముసుకుల భాస్కర్ రెడ్డి, అంబటి నరేష్, యాదగిరి సత్తన్న, సులువ లక్ష్మీ నరసయ్య, కటుకు ప్రవీణ్, అయితే పవన్, గుండెబోయిన భూమయ్య, అపర్ణ, మిట్టపల్లి సతీష్, గాండ్ల ధర్మపురి, మచ్చ విశ్వాస్, రాకేష్, ఆకాష్ గౌడ్, రాజ్ కుమార్, శ్యామ్ పటేల్, పంగ రవి, బుంగ మహేష్, సాయి పవన్, వెంకటేష్, కాశిపేట సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి రేటినో స్కోపి పరీక్షలు

- నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 10: మధుమేహం వ్యాధిగ్రస్తులకు రేటినో స్కోపి అత్యాధునిక సాంకేతిక పరికరం (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సహాయంతో ముందుగానే రెటినోపతి వ్యాధిని గుర్తించి నివారణ చర్యలకు వంద రోజులు ప్రణాళికలు సిద్ధం చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ వైద్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ తన ఛాంబర్ లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, ప్రోగ్రాం ఆఫీసర్లతో రెటినోపతి వైద్య పరీక్షల కార్యాచరణ పై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. వైద్య పరీక్షలు నవంబర్ 14 నుండి ప్రారంభించి వంద రోజుల్లో జిల్లాలోని ప్రతి మధుమేహం వ్యక్తికి రెటినోపతి వైద్య పరీక్ష నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెటినోపతి వ్యాధి మధుమేహం వ్యాధిగ్రస్తులకు సోకి క్రమంగా అందత్వం వచ్చే ప్రమాదం ఉంటుందని అందువల్ల ఈ వ్యాధిని ముందుగానే గుర్తించి తగిన వైద్యం చేయించేచడమే వైద్య పరీక్షల ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ వ్యాధిని ముందస్తుగా గుర్తించేందుకు ఉపయోగించే రెటినోస్కోపీ అనే అత్యాధునిక సాంకేతిక పరికరాన్ని సమకూర్చుకోవడం జరిగిందని, అవసరమైన మేరకు ఆప్తాల మాలజీలను నియమించుకుని తగిన శిక్షణ ఇచ్చిన గ్రామస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించేందుకు సమాయత్తం చేయాలని సూచించారు.



12న గోదావరికి మహా హారతి

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 10: ఈ నెల 12న బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు గోదావరిఖని సమ్మక్క సారలమ్మ గద్దెల సమీపంలో గోదావరి నదికి మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి క్యాతం వెంకటరమణ అన్నారు. సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెంకటరమణ మాట్లాడుతూ జీవకోటి మనుగడ కు ప్రధాన ఆధారమైన నీటికి పూజలు చేయాలనే సంకల్పంతో గత 14 సంవత్సరాలుగా గోదావరి హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నట్లు తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలో నాలుగు దేవాలయాలకు మాత్రమే పరిమితమైన అధికారిక హారతి కార్యక్రమాన్ని అన్ని దేవాలయాల కు ప్రతి గ్రామానికి విస్తరించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. రాముని పాదాలు ఉన్న గోదావరి నది పరివాహక ప్రాంతంలో జన్మించడం పూర్వజన్మ సుకృతం అని ఉత్సవ సమితి పట్టణ అధ్యక్షులు ఉజ్జల వెంకటేశ్వర శర్మ అన్నారు. విశిష్టమైన గోదావరికి హారతి ఇచ్చే కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగా మాత కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో ఉత్సవ సమితి సభ్యులు తాటిపల్లి వెంకన్న, అంశాల వీరేశం, గుండా మంజుల, తనకు మంజుల, గండె శ్రీ భవాని, ఆవునూరి శైలజ, పల్లెర్ల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సహదారుడు పీ సుదర్శన్ రెడ్డి ను బాపూజీ వచనాలయం చైర్మన్ భక్తవత్సలం సోమవారం సన్మానించారు. ప్రభుత్వ ముఖ్య సహదారుడు గా నియమితులైన సందర్భంగా హైదరాబాద్ సెక్రటేరియట్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.
ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్




పారిశుధ్య సిబ్బంది సమర్ధంగా సేవలందించాలి

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 10: నగరంలో పారిశుధ్యం మెరుగు పడేందుకు సిబ్బంది మరింత సమర్థవంతంగా సేవలందించాలని అదనపు కలెక్టర్ (స్థానికసంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె.అరుణ శ్రీ అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయం లో సోమవారం పారిశుధ్యవిభాగం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో దృష్టికి వచ్చిన సమస్యలు సాధ్యమైనంత వరకు అదే రోజు పరిష్కరించాలని ఆదేశించారు. నగరంలో సేకరించిన తడి చెత్త ను రీ సైకిలింగ్ కొరకు కంపోస్ట్ యార్డ్ కు తరలించాలని అన్నారు. ప్రతి స్వచ్ఛ ఆటో కనీసం రెండు సార్లు పూర్తి సామర్థ్యంతో డంపింగ్ యార్డ్ కు తప్పనిసరిగా వెళ్ళేలా చూడాలని అన్నారు. ప్రతి ప్రభుత్వ విద్యా సంస్థ, వసతి గృహాలలో నగర పాలక సంస్థ సిబ్బంది పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని అన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో పారిశుధ్య తనిఖీలు చేపట్టడంతో పాటు నగర పాలక సంస్థ ద్వారా సానిటరీ సర్టిఫికేట్ పొందేలా అవగాహన కల్పించాలని అన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగించినా, అపరిశుభ్ర వాతావరణంలో అనారోగ్యకరంగా పదార్థాలు తయారు చేసి విక్రయించినా, చెత్త బయట పడవేసినా బాధ్యులకు జరిమానా విధించాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, సెక్రెటరీ ఉమా మహేశ్వర్ రావు, సానిటరీ ఇన్స్పెక్టర్ నాగ భూషణం, సానిటరీ జవాన్లు, మెప్మా టిఎంసి మౌనిక, సిఓ లు తదితరులు పాల్గొన్నారు.

నేలరాలిన మహా కళాకుసుమం

- హుస్నాబాద్ కళాకారుల సంతాపం



ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 10: డాక్టర్ అందెశ్రీ మరణం పట్ల హుస్నాబాద్ కళాకారులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. సిద్దిపేట జిల్లా మద్దూర్ మండలం రేబర్తి గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన అందె ఎల్లయ్య అలియాస్ డాక్టర్ అందేశ్రీ పశుల కాపరిగా యజమాని దగ్గర జీతముండి పశువులను కాస్తూ ఇసుక మీది దుబ్బలల్ల సాహితీ సామాజిక అక్షరాలు నేర్చుకొని, సామాజిక జానపద ప్రజాసమస్యల పరిష్కారానికి నాంది పలికే వేలాది పాటలు కయిగట్టి, వరంగల్ కాకతీయ యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్ అవార్డు అందుకున్న గొప్ప కవి అందెశ్రీ అని జానపద గాయకులు గడిపె మల్లేశ్ అన్నారు. అందెశ్రీ మరణం పట్ల సినియర్ కళాకారులు వరుకోలు కళాచందర్, పిట్టల తిరుపతి, గజ్జెల కనకయ్య, నన్నే అజయ్ కుమార్, తిప్పర్తి శ్రీనివాసులు, డాక్టర్ తైదల అంజయ్య, సిని గేయ రచయిత బోయిని సంపత్, జాల ఆగయ్య, దేవర కనకయ్య, శ్రీదాస్యం లక్ష్మయ్య, పార్నంది రవిందర్, డాక్టర్ పోన్నాల బాలయ్య, నాధమునుల రామారావు, కస్పోజు సంజీవచారి, నారోజు చంద్రమౌళి, వలువొజు జగదీశ్వరాచారీ, బత్తుల చంద్రమౌళి, మోరే కనుకచంద్ర, ఎర్రమ రాజు దేవరాజు, ఖాత ఎలీషా, బస్వపత్రి లక్ష్మయ్య, కల్లెం లక్ష్మణ్, తాండూరి సురేష్, చిట్టి దేవేందర్ రెడ్డి, తూర్పాటి మహేందర్, కత్తి ద్రాక్షయిని, సత్రం సరిత, పోతారాజు లావణ్య, జక్కి మంజుల, దుడ్డేల సమ్మయ్య, గొల్లపల్లి వినోద్, బొనగిరి శ్రీకాంత్, గద్ద సంపత్, మంద రవిందర్, తదితరులు అందెశ్రీ కుటుంబానికి ప్రగాఢ సంతాపం సానుభూతి తెలిపారు. సామాజికంగా, సాహిత్యాత్మకంగా, కళాత్మకంగా డాక్టర్ అందెశ్రీ తో తమకున్న వ్యక్తిగత సామాజిక సంబంధాలను ఒక్కొక్కరు నెవ్వరు వేసుకుంటున్నారని కళాకారులు తమతమ అనుబంధాలను గుర్తు చేసుకున్నారు.



ఈ రాష్ట్రానికి నీతీశ్ కుమార్ ఒక అవసరం అని నేను ఒక పొలిటికల్ సైన్స్ విద్యార్థిగా చెబుతాను. ఎందుకంటే ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితం ఒక కేస్ స్టడీ. ఎన్ని ఒడుదొడుకులు వచ్చినప్పటికీ, అనేక సవాళ్లు ఉన్నప్పటికీ ఆయన గత రెండు దశాబ్దాలుగా ఎలా అధికారంలో ఉన్నారో నేను అర్థం చేసుకోగలిగితే, అది నా భవిష్యత్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. -
- చిరాగ్ పాసవాన్, లోక్ జన్‌శక్తి పార్టీ చీఫ్

ప్రతిపక్షం
Prathipaksham.in
10
హైదరాబాద్
మంగళవారం
11.11.2025
@prathipaksham
prathipakshamtvtelugu



ప్రాంతీయం



హనుమకొండలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

- జేఎన్ఎస్ స్టేడియంలో జెండా ఊపిన కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 10: డీడీజీ (స్టేట్స్), జోనల్ రిక్రూటింగ్ ఆఫీస్, చెన్నై మరియు డైరెక్టర్ రిక్రూటింగ్, ఏఆర్ఓ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ సోమవారం ఉదయం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో (జేఎన్ఎస్) ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సుమారు ఉదయం 2:30 గంటలకు సైన్యాధికారుల సమక్షంలో ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమం అనంతరం ఆదిలాబాద్ మరియు వనపర్తి జిల్లాల అభ్యర్థులకు రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ రెండు జిల్లాల నుండి 794 మంది వ్రాత పరీక్షలో అర్హత సాధించగా, 624 మంది హాజరై హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో ఫిజికల్ ఫిట్నెస్ మరియు ఇతర పరీక్షల్లో పాల్గొన్నారు. సైన్యాధికారుల ప్రకారం, తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల అభ్యర్థులు ఇప్పటికే వ్రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, నవంబర్ 10 నుండి 22 వరకు ఫిజికల్, ఫిట్నెస్ మరియు మెడికల్ పరీక్షలను హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో ఎదుర్కోనున్నారు. ఈ కార్యక్రమానికి సైన్యాధికారులు, జిల్లా యువజన మరియు క్రీడా అధికారి అశోక్ కుమార్ గుగులోతు మరియు ఇతర గణ్యులు హాజరయ్యారు.



ఆర్మీ అగ్ని వీరుల నోటిఫికేషన్ విడుదల

- వారియర్స్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ అంజనేయులు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 10: 2025 కి సంబంధించిన ఆర్మీ అగ్ని వీరుల ఉచిత శిక్షణ పూర్తి కావడంతో 2026 కి సంబంధించి జనవరి నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభమవుతుందని 2025 జనవరిలో ఆర్మీ అగ్ని వీరుల నోటిఫికేషన్ రావడంతో నారాయణపేట జిల్లాలో వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత తరగతులు ప్రారంభించారు. ఆంజనేయులు సోమవారంవిలేకరల సమావేశంలో మాట్లాడుతూ ఈ తరగతలకు లైన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట వారు బిల్డింగ్ ఇచ్చి విద్యార్థులకు చదువుకోవడానికి సహకరించారు అదేవిధంగా హనుమంతు కర్ణాలి విద్యార్థులకు మెటీరియల్స్ ని అందించారు. ఈ క్లాసులు దాదాపుగా నాలుగు నెలల పాటు కొనసాగాయి ఈ క్రమంలో విద్యార్థులకు సంబంధిత డాక్టర్లచే మరియు ఆర్మీ వాళ్ళ చే ఫుల్ బాడీ చెకప్ లు చేయించారు అకాడమీలో చదువుకొని ఆర్మీ అగ్నివీర్ ఎగ్జామ్ లో 40 మంది విద్యార్థులు పాస్ కావడం జరిగింది అనంతరం వీరికి మళ్లీ దాదాపుగా మూడు నెలలపాటు ఉచిత ఫిజికల్ శిక్షణ కొనసాగించారు 10 /11/25 హన్మకొండలో ర్యాలీ ప్రారంభం కావడంతో అందుకు విద్యార్థులు సిద్ధమయ్యారని తెలిపారు ఉచిత భోజన వసతి అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు అకాడమీ చైర్మన్ లయన్ రవికుమార్ గౌడ్ మరియు లయన్ పి డి జి హరి నారాయణ బట్టడ్ 40 మంది విద్యార్థులకు దాదాపుగా 45 రోజులపాటు హాస్టల్ వసతి మరియు భోజన వసతి కల్పించారు.



8 నెలలు గడుస్తున్న రైతులకు జమ కానీ బోనస్

- పూర్తిస్థాయిలో అన్నిగ్రామాల్లో ఏర్పాటు కానీ కొనుగోలు కేంద్రాలు

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 10: గత యాసంగి సీజన్ లో అమ్మిన వరి ధాన్యానికి దాదాపు 8 నెలలు గడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చెప్పినటువంటి రూ.500 బోనస్ నేటికీ రైతుల ఖాతాలలో జమ చేయలేదని,నెల రోజుల నుంచి వరి,మొక్కజొన్న కోతలు జరిపి ధాన్యం కల్లాల్లో ఆరబెట్టుకొని ఉన్నా కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో అన్ని గ్రామాలలో ఏర్పాటు చేయలేదని బీజేపీ కిసాన్ మోర్చా వనపర్తి జిల్లా అధ్యక్షులు రాకాసి అరవింద్ రెడ్డి ఆరోపించారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా గత సీజన్ లో అమ్మిన వరి ధాన్యానికి నేటికీ రూ.500 బోనస్ రైతుల ఖాతాల్లో జమకాలేదన్నారు. ధాన్యం కలాల్లో వున్నప్పటి కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో అన్ని గ్రామాలలో ఏర్పాటు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫసల్ బీమా యోజన పథకాన్ని ప్రవేశపెడితే రాష్ట్ర ప్రభుత్వం ఆ యొక్క ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయడం లేదని అన్నారు.అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరానికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం,కిసాన్ మోర్చా నాయకులు వెంకట్రామా రెడ్డి, జ్ఞానేశ్వర్, కార్యవర్గ సభ్యులు మాధవ రెడ్డి,గోపాల్పేట్ మండల అధ్యక్షులు తిరుపతి రెడ్డి,సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఏఎంసీ చైర్మెన్

ప్రతిపక్షం, సోన్ నవంబర్ 10: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మెన్ సోమ భీమ్ రెడ్డి అన్నారు. సోన్ మండల కేంద్రంలో సోమవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట క్వింటా కు 2,385 మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. దాంతో పాటుగా ప్రత్యేకంగా క్వింటా కు 500 ల బోనస్ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మెన్ కృష్ణ ప్రసాద్ రెడ్డి, మాజీ సర్పంచ్ వినోద్, మాజీ ఎంపీటీసీ మురళీధర్ రెడ్డి, వీడీసీ సభ్యులు మక్కన్న ,జానీ, ప్రసాద్, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పేదరికాన్ని జయించిన పట్టుదల

- కాల్వపల్లి దళిత బాలిక శ్రీజా విజయగాథ



ప్రతిపక్షం ప్రతినిధి, ములుగు, నవంబర్ 10: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని చిన్న గ్రామం కాల్వపల్లి ఇక్కడ పుట్టి పెరిగిన ఓ దళిత బిడ్డ పేదరికం బంధాలను చెరిపేసి తన కసితో జీవితంలో కొత్త చరిత్ర సృష్టించింది. పురుషోత్తం శ్రీజ... ఆర్థిక కష్టాలు, సామాజిక ఇబ్బందులు, పరిస్థితుల అడ్డంకులు ఇవన్నీ ఉన్నా ఆమె విద్యాపై చూపిన పట్టుదల ముందు ఇవన్నీ తలవంచాయి. "డాక్టర్ కావాలి" అనే తల్లిదండ్రుల ఆశయాన్ని గుండెల్లో నింపుకుని, అహర్నిశలు కష్టపడి, మొదటి ప్రయత్నంలోనే ఎంబిబిఎస్ సీటు సాధించడం ద్వారా తన కుటుంబానికే కాదు, మొత్తం గ్రామానికీ గర్వకారణమైంది శ్రీజ.

సంక్షోభాల మధ్య విజయం

పేదరికం ఆమె జీవితంలో చీకటిని నింపినా, చదువు పట్ల ఆమె చూపిన దీక్ష ఆ చీకటిని వెలుగుగా మార్చింది. తండ్రి ధర్మయ్య, తల్లి పద్మ కూలి పనులతో కుటుంబాన్ని నడిపిస్తూ పిల్లల భవిష్యత్తు కోసం ఎన్ని కష్టాలైనా భరించారు. ఆ కష్టాల పైనే నిలబడి, తన కృషి, కసితో శ్రీజా విద్యలో ప్రతిభ చాటింది. ఇటీవల నిర్వహించిన NEET (నీట్) పరీక్షలో ప్రతిభ కనబరచి, మొదటి రౌండ్‌లోనే సంగారెడ్డి నుండి వరంగల్ "ప్రతిమ మెడికల్ కాలేజీ"లో ఎంబీబీఎస్ సీటు సంపాదించడం విశేషం.

గ్రామస్థుల సత్కారం – ఆర్థిక సాయం

శ్రీజా సాధించిన ఈ అద్భుత విజయానికి గుర్తుగా కాల్వపల్లి గ్రామ ప్రజలు ప్రత్యేకంగా సన్మానం చేశారు. విద్యార్థిని కుటుంబానికి గ్రామ పెద్దలు కలిసి ₹8,500 ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేన ములుగు జిల్లా కన్వీనర్ ఆలం శ్రీను, తుడుందెబ్బ డివిజన్ ప్రధాన కార్యదర్శి కొప్పుల జగన్, మాజీ సర్పంచ్‌లు సిద్ధబోయిన శ్రీనివాస్, యలం శంకరయ్య, పెద్దలు గోపనబోయిన కొమరయ్య, సిద్ధబోయిన నర్సింహరావు, పీరీల నరేష్, యాషాడపు మల్లయ్య, కొప్పుల కిష్టయ్య, దుభాసి సుధాకర్, తిప్పనపల్లి ఎల్లస్వామి, పురుషోత్తం నారాయణ, నర్సయ్య స్వామి, శ్రీను, రమేష్, నారాయణ బాబు, నర్సింహులు, సాయికిరణ్, నరేష్, తిప్పనపల్లి సారయ్య, పురి స్వరూప, భూషబోయిన మొగిలి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

"డాక్టర్ అవ్వడం నా తల్లిదండ్రుల కల..."

శ్రీజా మాట్లాడుతూ "మా ఇంట్లో ఆర్థిక పరిస్థితులు చాలా కష్టంగా ఉన్నా, అమ్మానాన్న ఎప్పుడూ నన్ను వెనక్కి తగ్గనీయలేదు. వారి కలనే నా లక్ష్యంగా మార్చుకున్నా. ఈ సీటు సాధించడం వాళ్ల ఆశయానికి న్యాయం చేసినట్టుగా అనిపిస్తోంది. భవిష్యత్తులో పేదలకు, గ్రామ ప్రజలకు సేవ చేయాలనుకుంటున్నా" అని భావోద్వేగంగా చెప్పింది. కాల్వపల్లి గ్రామంలో ప్రతిఒక్కరూ శ్రీజా విజయాన్ని తమ విజయంగా భావిస్తున్నారు. "పేదరికం అడ్డంకి కాదు, పట్టుదల ఉంటే దారి తప్పదు" అనే సత్యాన్ని నిరూపించింది శ్రీజ. తెల్లకోట ధరించి గ్రామానికీ, ములుగు జిల్లాకీ, దళిత సమాజానికీ గర్వకారణం అవబోతున్న ఈ యువతి భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

మైనారిటీ గురుకుల విద్యార్థి మృతి

- ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యులు ధర్నా
- విద్యార్థి సంఘాల సంఘీభావం
- ప్రిన్సిపాల్ సస్పెండ్,ముగ్గురు సిబ్బంది తొలగింపు

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 10 : మైనారిటీ గురుకుల విద్యార్థి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.మహబూబ్ నాగర్ జిల్లా,పాత పాలమూరు ప్రాంతానికి చెందిన సామాజిక కార్యకర్త ఆది విష్ణువర్ధన్ కుమారుడు నవీన్ కుమార్(16) ఏనుగుంట రిజర్వాయర్ కాలువ నీటిలో పడి మృతిచెందాడు.ఆది నవీన్ కుమార్ వనపర్తి జిల్లా కొత్తకోట మైనారిటీ జూనియర్ గురుకులకళాశాల(దేవరకద్ర 1)లో ఇంటర్మీడియట్ (సి.ఈ.సి) మొదటి సంవత్సరం చదువుతున్నాడు.ఈ క్రమంలో ఆదివారం రాత్రి సుమారు ఏడు గంటల సమయంలో కాలేజీలో నవీన్ కనబడటంలేదని సిబ్బంది తల్లిదండ్రులకు ఫోన్ చేశారని,అందుకు తండ్రి ఆదివిష్ణువర్ధన్ ఇంటికి రాలేదని సమాధానంఇచ్చాడు.తల్లిదండ్రులు సోమవారం ఉదయం కళాశాలకు చేరుకోగా,కళాశాల సిబ్బంది, పోలీసులు ఏనుగుంట రిజర్వాయర్ కాలువ నీటిలో తమ కుమారుడి మృతదేహంను గురించేందుకు తీసుకెళ్లారని తండ్రి విష్ణు చెప్పారు.తమ కుమారుడు మృత దేహాన్ని గుర్తుపట్టిన తల్లిదండ్రులు బాధతో తల్లడిల్లారు.పోలీసులు మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం వనపర్తి జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు.

ఆసుపత్రి ఎదుట ధర్నా...

కుమారుడు కోల్పోయినా తమకు న్యాయం చేయాలనీ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యులు,బంధువులు, మిత్రులు ధర్నా చేపట్టి ఆందోళనకు దిగారు.మృతికి బాధ్యులైన వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఏ.బి.వి.పి, టీఆర్ఎస్వి,విద్యార్థి,ప్రజా సంఘాలు సంగీభావం తెలిపారు.గురుకుల విద్యా సంస్థలలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పాటిష్ట చర్యలు తీసుకువాలని డిమాండ్ చేశారు.

రూ.లక్షా,ఒకరికి ఉద్యోగం :ఆర్డీవో సుబ్రహ్మణ్యం

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి చేరుకున్న ఆర్డీవో సుబ్రహ్మణ్యం..కుటుంబసభ్యులు,ఆందోళన కారులతో సంప్రదింపులు జరిపి..కలెక్టర్ ఆదేశాలమేరకు ప్రభుత్వం తరుపున బాధిత కుటుంబానికి రూ.లక్ష,ఒక ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఒక ఉద్యోగం ఇస్తామని హామీ ఇవ్వడంలో ఆందోళనను విరమించారు.

ప్రిన్సిపాల్ సస్పెన్షన్...

ముగ్గురు సిబ్బంది తొలగింపు

భాద్దీన్, అర్ఎల్సి,ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా

మైనారిటీ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి షఫీఉల్లా బాలుడు మృతి పరోక్షంగా కారకులైన కళాశాల ప్రిన్సిపల్, ఒక స్టాఫ్ నర్స్, సెక్యూరిటీ గార్డులను తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసారని ఉమ్మడి మహబూబ్ నాగర్ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ బావుద్దీన్ తెలిపారు. విద్యార్థి కుటుంబానికి ఒక లక్షరూపాయలు, కుటుంబసభ్యులలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని సెక్రటరీ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి పుట్టా ఆంజనేయులు,కార్యవర్గసభ్యులు ఎం.డి.జబ్బార్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, ఏబీవిపి జిల్లా కన్వీనర్ అర్జున్ సాతర్ల,ఏబీవిపి విభాగ్ కన్వీనర్ అభిలాష్ మహబూబ్ నాగర్ సీపీఎం,కే.వి.పి.ఎస్ నాయకులు,ప్రజా,విద్యార్థి సంఘాల నాయకులు,పోలీస్ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు, అర్జీలు వేగంగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 10: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 50 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన, పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం వారంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల నిధులను సద్వినియోగ పరుచుకోవాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్: నవంబర్ 10: గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్, మున్సిపల్ శాఖలకు వివిధ నిధులు, పన్నులు, తదితర రూపేనా సమకూరే నిధులు, ఆదాయాన్ని పకడ్బందీగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ, మున్సిపల్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖలకు వివిధ రూపాల్లో ప్రభుత్వాలు అందించే నిధులు, స్థానికంగా.. అద్దెలు, వివిధ పన్నులు, నిర్మాణ అనుమతుల ఫీజులు, లైసెన్సు ఫీజులు, నిర్మాణ అనుమతుల ఫీజులు, సంతలు, లే అవుట్లు, రిజిస్ట్రేషన్ లు, తదితర రూపాల్లో సమకూరిన నిధులు, వాటిలోంచి వినియోగించిన నిధుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన ప్రతి ఒక్క రూపాయిని, సమగ్రంగా ప్రజల సౌకర్యార్థం వినియోగించాలని అన్నారు. వివిధ రూపాల్లో శాఖలకు వచ్చే ఆదాయం పెంపుపై దృష్ట సారించాలని పేర్కొన్నారు. ప్రజలంతా నూతన నిర్మాణాలకు సంబంధించి అనుమతులు తప్పనిసరిగా పొందాలని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో గోవింద్, డిపిఓ శ్రీనివాస్, నిర్మల్, ఖానాపూర్ ల మున్సిపల్ కమిషనర్ లు జగదీశ్వర్ గౌడ్, సుందర్ సింగ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యా వైజ్ఞానిక రంగాల అభివృద్ధిలో

మౌలానా అబుల్ కలాం ఆజాద్ పాత్ర కీలకం

- జిల్లా విద్యాధికారి దర్శనం భోజన్న



ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 10 : దేశంలో విద్యా వైజ్ఞానిక రంగాల అభివృద్ధిలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ రూపొందించిన ప్రణాళికలు మహోన్నతమైనవని ఆయన పాత్ర కీలకమైనదని జిల్లా విద్య అధికారి దర్శనం భోజన్న పేర్కొన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని బ్లూ స్టార్ హై స్కూల్ లో కలాం గుణం ఎడ్యుకేషనల్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ విద్యా సదస్సులో అయిన పాల్గొని ప్రసంగించారు. స్వతంత్ర పోరాటంలో ఓవైపు తనదైన రీతిలో పోరాటం చేస్తూనే మరోవైపు దేశంలో ఉన్న స్థితిగతులపై మౌలానా అబుల్ కలాం ఆజాద్ దృష్టి పెట్టె వారని చెప్పారు. రాజ్యాంగ నిర్మాణ కమిటీలో కూడా మౌలానా అబుల్ కలాం ఆజాద్ గౌరవ సభ్యులుగా ఉండి కీలక బాధ్యతలను పోషించారని చెప్పారు. సచార్ కమిటీ నివేదిక ఆధారంగా దేశంలో ముస్లింల స్థితిగతులు అత్యంత దారుణంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను పొందుతూనే విద్యా వైజ్ఞానిక రంగాలలో రాణించేందుకు కష్టపడాలని సూచించారు. సొసైటీ జిల్లా వ్యవస్థాపకులు అధ్యక్షులు మొహమ్మద్ ఉస్మాన్ మాట్లాడుతూ 23 సంవత్సరాలుగా నిర్మల్ జిల్లా కేంద్రంలో కలాం గుణం ఎడ్యుకేషన్ అనే యూత్ వెల్ఫేర్ సొసైటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఇతరత్రా కార్యక్రమాలను వివరించారు. నిర్మల్ లో అర్థాంతరంగా ఆగిన స్మారక మౌలానా అబుల్ కలాం ఆజాద్ క్లాక్ టవర్ నిర్మాణ పనులను పూర్తిచేసేలా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కలాంగుణం సొసైటీ పదాధికారులు సభ్యులకు బ్లూ స్టార్ పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఇందులో స్థానిక తాజా మాజీ కౌన్సిలర్ ఇమ్రాన్ ఉల్లా, పాఠశాల ప్రిన్సిపాల్ సయ్యద్ ముజీబ్ ఖాద్రీ, మొహమ్మద్ ఇంతియాజ్, సయ్యద్ చాంద్ పాషా, మహమ్మద్ అబ్దుల్ ఖదీర్, షేక్ షాదుల్లా హుస్సేన్, సయ్యద్ కరీం మహమ్మద్ జుబేర్ ఖాన్, షేక్ షకీల్, అబ్దుల్ ఇస్మాయిల్ ఉన్నారు.



జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఏం జరిగినా సీఎం రాజీనామా చేయాలన్న పవన్ ఇప్పుడు నోరు మెదపట్లేదు. మీ ప్రభుత్వంలో ఎన్నో హత్యలు, నకిలీ మద్యంతో ప్రాణాలు పోతున్నా అది ప్రభుత్వ వైఫల్యం కాదు. తిరుపతి, సింహాచలం, కాశీబుగ్గ తొక్కిసలాటల్లో భక్తులు మరణిస్తే కిక్కురు మనకూడదు. విశాఖలో 2లక్షల కేజీల గో మాంసం దొరికినా నోరు మూసుకొని ఉండాలి. దీనిపై పవన్‌గారి స్పందన ఏంటో మరి.

- వైసీపీ నేత శ్యామల

ముగింపు దిశగా అమెరికా షట్‌డౌన్



- కీలక బిల్లుకు అమెరికా సెనేట్ ఆమోదముద్ర

న్యూయార్క్ (అమెరికా), నవంబర్ 10 : అమెరికా చరిత్రలోనే అత్యంత సుదీర్ఘంగా 40 రోజులుగా కొనసాగుతున్న ప్రభుత్వ షట్‌డౌన్‌కు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యకలాపాలను పునరుద్ధరించేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు అమెరికా సెనేట్ ఆమోదముద్ర వేసింది. ఇరుపక్షాల మధ్య కుదిరిన ఈ ఒప్పందాన్ని ఇప్పుడు తుది ఆమోదం కోసం హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌కు పంపనున్నారు. డెమొక్రాటిక్ సెనేటర్లు జీన్ షాహీన్, మ్యాగీ హసన్ రిపబ్లికన్ లీడర్ జాన్ థూన్, వైట్‌హౌస్ ప్రతినిధులతో కలిసి వారాంతంలో జరిపిన చర్చలు ఫలించాయి. ఈ బిల్లు ప్రకారం చాలా ఫెడరల్ ఏజెన్సీలకు జనవరి వరకు నిధులు అందుతాయి. షట్ డౌన్ కారణంగా ప్రభావితమైన ఫెడరల్ ఉద్యోగులందరికీ బకాయిపడ్డ జీతాలను చెల్లించేందుకు హామీ ఇచ్చారు.ఆసక్తికరంగా సెనేట్‌లోని డెమొక్రాటిక్ పార్టీ నేత చక్ షుమర్ ఈ బిల్లును వ్యతిరేకించారు. ఆరోగ్య సంరక్షణ చట్టం కింద సబ్సిడీ వంటి సమస్యలను పరిష్కరించలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఎనిమిది మంది డెమొక్రాటిక్ సెనేటర్లు పార్టీ వైఖరిని పక్కనపెట్టి బిల్లుకు మద్దతు పలకడంతో 60 ఓట్ల మెజారిటీతో ఇది ఆమోదం పొందింది. ఈ చట్టం ద్వారా షట్ డౌన్ సమయంలో అధ్యక్షుడు ట్రంప్ తొలగించిన ఉద్యోగులను తిరిగి విధులలోకి తీసుకుంటారు. 2026 ఆర్థిక సంవత్సరం వరకు ఫుడ్ స్టాంప్ కార్యక్రమానికి నిధుల కొరత లేకుండా చూస్తారు.

విశ్వ వీక్షణం



నవంబర్ చివరి నాటికి కర్ణాటక సీఎం మార్పు

- 15న న్యూఢిల్లీకి వెళ్లనున్న సిద్ధరామయ్య

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, బెంగళూరు, నవంబర్ 10 : కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశంపై ఊహాగానాలు కొనసాగుతూనే ఉన్నాయి. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేండ్లు పూర్తికావొస్తున్న నేపథ్యంలో నవంబర్ చివరి నాటికి సీఎం మార్పు ఉంటుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ క్రమంలో వేళ సీఎం సిద్ధరామయ్య కు కాంగ్రెస్ అధిష్ఠానం షాక్ ఇచ్చింది. త్వరలో ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న సిద్ధరామయ్య అక్కడ పార్టీ సీనియర్ నేతలతో భేటీ అయ్యేందుకు సమయం కోరగా అందుకు అధిష్ఠానం నిరాకరించినట్లు తెలిసింది. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధరామయ్య ఈ నెల 15న ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులను కలిసేందుకు సమయం కోరగా, కేంద్ర నాయకత్వం సమయం ఇవ్వడానికి నిరాకరించిందని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. భేటీ అవసరం లేదంటూ సిద్ధరామయ్యకు అధిష్ఠానం స్పష్టం చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, సిద్ధరామయ్య వర్గంలోని ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాల్, ఎమ్మెల్యేలు, మంత్రులకు ఢిల్లీలో విందు ఏర్పాటు చేశారు. తన సోదరుడు, కొప్పల్ ఎంపీ రాజశేఖర్ హిట్నాల్ నివాసంలో జరిగిన ఈ సమావేశం బలప్రదర్శన కోసం ఏర్పాటు చేసిందిగా ప్రచారం జరుగుతోంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రస్తుతం రాజధాని ఢిల్లీలో పర్యటిస్తున్నారు. వారం వ్యవధిలో డీకే ఢిల్లీకి వెళ్లడం ఇది రెండోసారి. 'ఓట్ చోరీ' అంశం విషయంలో ఆయన రాజధానిలో పర్యటిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రతిపక్షం
Prathipaksham.in



బరువు తగ్గాలా..?

సింపుల్ వ్యాయామం సరిపోతుందా!!

క్రమం తప్పకుండా వ్యాయామం, సమతుల్య ఆహారంతో బరువు తగ్గవచ్చని నిపుణులు అంటున్నారు. బరువు తగ్గడంలో వ్యాయామం కీలక పాత్ర పోషిస్తుంది. ఏదో చేశామంటే సరిపోతుందా..? రోజుకి వ్యాయామం ఎంత సేపు చేస్తే బరువు తగ్గుతారో తెలుసా?


మారుతున్న జీవనశైలి, బిజీ షెడ్యూల్ కారణంగా ఈ రోజుల్లో చాలా మంది అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. రోజంతా ఆఫీస్‌లో ల్యాప్‌టాప్ లేదా కంప్యూటర్ స్క్రీన్ ముందు కూర్చోవడం వల్ల ఊబకాయం బారిన పడుతున్నారు. చిన్న వయసులోనే బెల్లీ ఫ్యాట్ సమస్య ఎదుర్కొంటున్నారు. ఊబకాయం అనేక తీవ్రమైన వ్యాధులకు కారణమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటం కోసం బరువును అదుపులో ఉంచుకోవడం చాలా ముఖ్యం. తినే ఆహారంతో పాటు శారీరక శ్రమపై కూడా శ్రద్ధ చూపాలి. అయితే, ఒకరు రోజూ ఎంతసేపు వ్యాయామం చేయాలి. ఏ వ్యాయామాలు చేస్తే బరువు తగ్గుతారో చాలా మందికి తెలియదు. ఆ విషయాలు ఇక్కడ తెలుసుకుందాం.

రోజుకు ఎంతసేపు వ్యాయామం చేయాలి?

బరువు తగ్గడానికి వ్యాయామం యొక్క వ్యవధి వ్యక్తి వయస్సు, ఆరోగ్య పరిస్థితి, ఫిట్‌నెస్ స్థాయిపై ఆధారపడి ఉంటుంది. అయితే, ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ప్రకారం, ఒక వ్యక్తి ప్రతి వారం కనీసం 150 నిమిషాలు సాధారణమైన వ్యాయామాలైనా చేయాలి. లేదంటే 75 నిమిషాల అధికతీవ్రతతో కూడిన వ్యాయామాలు చేయాలి. వ్యాయామం చేయడం మొదటి సారి అయితే రోజు 20 30 నిమిషాలు ఎక్సర్‌సైజులు చేస్తే సరిపోతుంది. ఆ తర్వాత క్రమక్రమంగా సమయం పెంచుకుంటే సరిపోతుంది. ఆ తర్వాత క్రమంగా సమయాన్ని 4560 నిమిషాలకు పెంచండి.

బరువు తగ్గాలనుకుంటే

బరువు తగ్గాలనుకునేవారు మాత్రం రోజూ 60 నుంచి 90 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. ఇందులో



ఏరోబిక్, వాకింగ్ వంటి వ్యాయామాలు ఉండేలా చూసుకోవాలి. వ్యాయామంతో పాటు సమతుల్య ఆహారం, తగినంత నిద్ర కూడా అవసరం. అధిక వ్యాయామం చేయాలనకునేవారు ట్రైనర్ లేదా వైద్యుడిని సంప్రదించి సలహాలు తీసుకోవాలి.

బరువు తగ్గడానికి బెస్ట్ వ్యాయామాలు

వాకింగ్

బరువు తగ్గడానికి వాకింగ్ బెస్ట్ ఆప్షన్. కేలరీలను బర్న్ చేయడానికి ఇది ఒక గొప్ప మార్గం. 30 నిమిషాలు వాకింగ్ చేయడం వల్ల దాదాపు 100 నుంచి 200 కేలరీలు బర్న్ అవుతాయి. రోజుకు కనీసం గంట సేపు అయినా వాకింగ్ చేయాలంటున్నారు నిపుణులు. బరువు తగ్గడంలో నడక వేగం కూడా కంపల్సరీ. మీరు మొదట వాకింగ్ చేసేటప్పుడు నిదానంగా నడిచినా.. రోజు రోజుకి నడక వేగం పెంచండి.

సైక్లింగ్

సైక్లింగ్ సరదా మాత్రమే కాదు. గుండె ఆరోగ్యానికి సైక్లింగ్ బెస్ట్ వ్యాయామం. ఇది మన శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా చాలా యంగ్‌గా ఉంచుతుంది. ఇది మన చేతులు, కాళ్ళు రెండూ ఒకే సమయంలో పనిచేసేలా చేస్తాయి. ఇది గుండె, కండరాలు, కీళ్ల మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఒత్తిడి సమస్యల్ని తగ్గించి.. మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని నిపుణులు చెబుతున్నారు. రోజూ కనీసం 20 నుంచి 30 నిమిషాల పాటు సైకిల్ తొక్కితే బరువు తగ్గుతారు. 30 నిమిషాలు సైక్లింగ్ చేయడం వల్ల 200300 కేలరీలు బర్న్ అవుతాయి.

స్విమ్మింగ్

ఈత కొట్టడం అనేది బరువు తగ్గడానికి, కండరాలను బలోపేతం చేయడానికి సహాయపడే వ్యాయామం. 30 నిమిషాలు ఈత కొట్టడం వల్ల 250400 కేలరీలు బర్న్ అవుతాయి. ఇది ఒత్తిడిని తగ్గించడంలో చాలా బాగా ఉపయోగపడుతుంది. రోజూ స్విమ్మింగ్ చేయడం ద్వారా మరింత చురుకుగా మారవచ్చు. ఈ స్విమ్మింగ్ వ్యాయామం పరధ్యానాన్ని నివారించడానికి సహాయపడుతుంది. రోజూ స్విమ్మింగ్ చేయడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.


జంపింగ్ జాక్స్

జంపింగ్ జాక్స్ అనేవి మొత్తం శరీరాన్ని ఉత్తేజపరిచే సరళమైన కార్డియో వ్యాయామం. ఇది హృదయ స్పందన రేటును పెంచుతుంది. కేలరీలను బర్న్ చేయడానికి సహాయపడుతుంది. 1015 నిమిషాలు జంపింగ్ జాక్స్ చేయడం వల్ల 100150 కేలరీలు బర్న్ అవుతాయి.

పుష్-అప్స్, స్క్వాట్స్

పుష్‌అప్‌లు, స్క్వాట్‌లు బరువు తగ్గడానికి బెస్ట్ వ్యాయామాలు. ఇవి కండరాలను బలోపేతం చేస్తాయి. జీవక్రియను పెంచుతాయి. బలమైన కండరాలు ఎక్కువ కేలరీలను బర్న్ చేస్తాయి. బరువు తగ్గడంలో ఈ వ్యాయామాలు సాయపడతాయి. ఇంట్లోనే సులభంగా ఈ వ్యాయామాలు చేసుకోవచ్చు.





ఇక డిజైనర్ బేబీల సృష్టి

- అమెరికా స్టార్టప్ కంపెనీ ప్రయోగాలు

లాస్ ఏంజిల్స్ (అమెరికా), నవంబర్ 10: అమెరికా స్టార్టప్ కంపెనీ జీన్ ఎడిటింగ్ టెక్నాలజీకి పెద్దపీట వేసింది. డిజైనర్ బేబీలను సృష్టించేందుకు ఆ కంపెనీ ప్రయోగాలు చేపడుతున్నది. సిలికాన్ వ్యాలీకి చెందిన బిలియనీర్లు ఆ ప్రాజెక్టు కోసం నిధులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. గర్భస్థ పిండాన్ని ఎడిట్ చేసి జీన్ ఇంజనీరింగ్ బేబీని సృష్టించేందుకు కసరత్తు చేస్తున్నారు. వంశపారంపర్య రుగ్మతలు లేకుండా, హైయ్యర్ ఇంటెలిజెన్స్ ఉండే రీతిలో బేబీలను సృష్టించనున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఇప్పటికే జీన్ ఎడిటింగ్ టెక్నాలజీ అందుబాటులో ఉన్నది. కానీ, ప్రసవం అనంతరం చేపట్టే చికిత్స కోసం జీన్ ఎడిటింగ్ టెక్నాలజీని వాడుతున్నారు. శాన్ ఫ్రాన్సిస్‌కోకు చెందిన ప్రివెంటిన్ అనే స్టార్టప్ కంపెనీ జీన్ ఎడిటింగ్‌పై పని చేస్తున్నది. జీన్ ఎడిటింగ్ సైంటిస్టు లూకాస్ హారింగ్టన్ కంపెనీ స్థాపించారు. ఓపెన్‌ఏఐ సీఈ సామ్ ఆల్ట్‌మాన్, కాయిన్‌బేస్ కోఫౌండర్ బ్రియాన్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఈ ప్రాజెక్టుకు బ్యాకప్ ఇస్తున్నారు. పుట్టుకకు ముందే గర్భస్థ పిండానికి జన్యుపర ఎడిటింగ్ చేసి వారసత్వ వ్యాధులు రాకుండా చేయాలన్న ఉద్దేశంతో ఉన్నట్లు ప్రివెంటివ్ అనే సంస్థ పేర్కొన్నది. డిజైనర్ బీబీల కోసం ప్రయోగాలు జరుగుతున్నట్లు విషయం తెలియగానే ఆన్‌లైన్‌లో చర్చ మొదలైంది. ఎంబ్రియో ఎడిటింగ్‌కు అనుకూల ప్రాంతం కోసం కంపెనీ అన్వేషిస్తున్నట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ తెలిపింది. ఎంబ్రియో ఎడిటింగ్ కోసం మూడు లక్షల డాలర్లు ఖర్చుచేయనున్నారు.



ఒకే కుటుంబానికి ఐదుగురు దుర్మరణం

- బిహార్ మనాస్ లో ఇంటి పైకప్పు కూలి దుర్ఘటన

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 10 : ఇంటి పైకప్పు కూలి ఒకే కుటుంబానికి ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. బిహార్ రాష్ట్రంలోని పాట్నా రెవెన్యూ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. అఖిల్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మనాస్ గ్రామంలో ఆదివారం రాత్రి 9.45 గంటల సమయంలో ఓ ఇంటి పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. వారిలో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. అందరూ నిద్రలో ఉండగా ఇంటి పైకప్పు కూలడంతో పడుకున్నవాళ్లు పడుకున్నట్లే ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన ప్రాంతానికి చేరుకున్నారు. శిథిలాల నుంచి మృతదేహాలను తొలగించి పోస్టుమార్టానికి పంపించారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు. పైకప్పు కూలిన ఇళ్లు 30 ఏళ్ల క్రితం నాటిదని, శిథిలావస్థకు చేరుకుని ఉండటంతో అకస్మాత్తుగా కూలిపోయిందని తెలిపారు.

సైనిక విన్యాసాలతో వ్యూహాత్మక చర్యలు


- స్వదేశీ ఆయుధాల తయారీకి ప్రాధాన్యం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 10 : భారతదేశం సొంత భద్రత, శత్రువులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకుంటోంది. దేశంలోకి చొరబాట్లను అడ్డుకునేందుకు కూడా వ్యూహాత్మకంగా చర్యలు చేపడుతోంది. స్వదేశీ ఆయుధాల తయారీకి ప్రాధాన్యం ఇస్తోంది. దేశం తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిశలలో సైనిక విన్యాసాలు చేపడుతోంది. గగనతల సురక్షణ కోసం ప్రభుత్వమే ముందస్తు హెచ్చరికలతో నోటామ్ జారీ చేసింది. సరిహద్దులో పెరుగుతున్న భద్రతా సవాళ్లను ఎదుర్కోవడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్లు నిర్వహిస్తోంది. అరేబియా సముద్రతీరంలోని సర్‌క్రీక్ (బాణగంగ) ప్రాంతంలో ఆపరేషన్ త్రిశూల్ విజయవంతంగా కొనసాగుతోంది. పాకిస్తాన్ సరిహద్దుకు సమీపంగా ఉన్న ఈ ప్రాంతం వ్యూహాత్మకంగా అత్యంత ప్రాధాన్యత



కలిగినది. సముద్ర మార్గ రక్షణకు నేవీ కీలక పాత్ర పోషిస్తూనే, రాడార్ నిఘా వ్యవస్థలు, అధునాతన మిసైల్ యూనిట్లను మోహరిస్తోంది. చైనా, బంగ్లాదేశ్, నేపాల్ సరిహద్దులకు సమీపంలోని సిరివిడి కారిడార్ ప్రాంతంలో పూర్వి ప్రచండ ప్రహార్ పేరుతో యుద్ధాభ్యాసం కొనసాగుతోంది. 15 నుంచి 22 కిలోమీటర్ల పొడవున ఈ వ్యూహాత్మక మార్గం ద్వారా శత్రు చొరబాట్లను నిరోధించడమే కాక, త్రిశక్తి బలగాల సమన్వయం కూడా బలోపేతమవుతోంది. అసోంలోని నదుల విస్తీర్ణం కారణంగా నేవీకి కీలక బాధ్యత వచ్చింది.





ఆర్ఆర్ నుంచి సంజూ నిష్క్రమణ ఖాయమేనా!

- కెప్టెన్సీ రేసులో ధృవ్ జురెల్, యశస్వి జైపాల్

ఐపీఎల్ వచ్చే సీజన్ కు రిటెన్షన్ గడువు సమీపిస్తోంది, ఈ నెల 15వ తేదీ నాటికి రిటెన్షన్ జాబితాను సమర్పించడానికి వివిధ జట్ల యాజమాన్యాలు సమాయత్తమవుతున్నాయి. ఈ పరిస్థితులలో రాజస్థాన్ రాయల్స్ జట్టులో కీలక మార్పులు చోటు చేసుకుంటాయని అంటున్నారు. కోచింగ్ స్టాఫ్‌లో కూడా మార్పులు జరిగాయి. రాహుల్ ద్రావిడ్ తర్వాత శ్రీలంక మాజీ కెప్టెన్ కుమార్ సంగక్కర హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాడు. సంగక్కర 2021 నుండి ఈ జట్టుకు డైరెక్టర్‌గా కూడా ఉన్నాడు. సీఈఓ జేక్ లష్ మెక్‌క్రమ్‌తో కూడా ఆర్ఆర్ తన బంధాన్ని తెంచుకుంది. ఇప్పుడు తాజాగా కెప్టెన్ సంజు శాంసన్ బయటికి వస్తాడని సమాచారం. సంజు చెన్నై జట్టులో చేరే అవకాశాలు ఉన్నాయి. రవీంద్ర జడేజా, సామ్ కర్రాన్ లేదా మతీష పతిరానా బదులుగా శాంసన్‌ను చైన్నై తీసుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఇక ఇప్పుడు రాజస్థాన్ రాయల్స్ కు కెప్టెన్ ఎవరనే ప్రశ్న తలెత్తుతోంది. శాంసన్ దశాబ్దానికి పైగా రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 2013లో రాజస్థాన్ రాయల్స్ జట్టులో చేరాడు. 2018లో అతడిని రిలీజ్ చేసినప్పటికీ, తిరిగి రిటైన్ చేసుకుంది. ఆప్పుడు అతడు బయటకు వెళితే, వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్, లేదా టీమిండియా దాషింగ్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ కు కెప్టెన్సీ అప్పగించే అవకాశం ఉందంటున్నారు. గాయం కారణంగా సంజు కొన్ని మ్యాచ్‌లకు దూరమైనప్పుడు రియాన్ పరాగ్ నాయకత్వం వహించాడు. అయినా, జురెల్, జైస్వాల్ వైపే ఫ్రాంచైజీ ఆసక్తి చూపుతోందని సమాచారం.



సౌతాఫ్రికా 'ఎ' జట్టు ప్రపంచ రికార్డు

- 44 రోజులలో భారత్ ను అధిగమించిన సఫారీలు

సౌతాఫ్రికా 'ఎ' జట్టు ప్రపంచ రికార్డు సృష్టించింది. భారత్ 'ఎ'తో జరిగిన నాలుగు రోజుల అనధికార టెస్టులో 416 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగి ఐదు వికెట్ల తేడాతో గెలుపొందిండి. ఈ క్రమంలోనే భారత్ 44 రోజుల కిందట సృష్టించిన రికార్డును సౌతాఫ్రికా అధిగమించింది. ఈ నెల ఆరున బెంగళూరులో సౌతాఫ్రికా 'ఎ' భారత్ 'ఎ' జట్ల మధ్య రెండో అనధికార టెస్టు జరిగింది. భారత్ రెండు ఇన్నింగ్స్ లలో వరుసగా 225/10, 382/ 7) స్కోర్లు నమోదు చేసింది. సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 221 పరుగులకే ఆలౌటైంది. 416 పరుగుల భారీ లక్ష్య ఛేదించేందుకు సౌతాఫ్రికా బరిలోకి దిగింది. రాణించిన సౌతాఫ్రికా బ్యాటర్లు ఐదుగురు హాఫ్ సెంచరీలు చేశారు. అటు, ఓపెనర్లు జోర్డన్ హెర్మన్ 91, లెసిగొ సెనోక్‌వానే 77, హంజా 77, టెంబ బవూమా 59, కానోర్ 52 పరుగులు చేశారు. దీంతో సౌతాఫ్రికా ఐదు వికెట్లు కోల్పోయి గెలిచింది. ఈ క్రమంలోనే రికార్డు క్రియేట్ చేసింది. 'ఎ' జట్ల టెస్టులలో నాలుగో ఇన్నింగ్స్‌లో ఛేజ్ చేసిన అత్యధిక టార్గెట్ ఇదే కావడం విశేషం. ఇదివరకు ఈ రికార్డు భారత్ 'ఎ' పేరిట ఉండేది. 44 రోజుల కిందటే ఆస్ట్రేలియా 'ఎ' జట్టుపై భారత్ ఈ ఘనతను అందుకుంది. 413 పరుగుల టార్గెట్‌ను విజయవంతంగా ఛేదించింది. అయితే, 44 రోజులలోనే ఈ రికార్డును సౌతాఫ్రికా బ్రేక్ చేసింది. నాలుగో ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు ఛేజ్ చేసిన 'ఎ' జట్లు: సౌతాఫ్రికా 417 పరుగులు - భారత్ (2025), భారత్ 413 పరుగులు - ఆస్ట్రేలియా (2025), ఆస్ట్రేలియా 367 పరుగులు - శ్రీలంక (2022), వెస్టిండీస్ 365 పరుగులు - ఇంగ్లాండ్ (2006), న్యూజీలాండ్ 365 పరుగులు - ఆస్ట్రేలియా (2003).



'సన్ రైజర్స్' నుంచి ఆ ఐదుగురు ఔట్

- జట్టు ప్రక్షాళన దిశగా యాజమాన్యం యోచన

గత సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆట తీరు ఏ మాత్రం బాగా లేదు. భారీ అంచనాలతో బరిలోకి దిగిన జట్టు కనీసం ప్లే ఆఫ్స్ కూడా చేరలేదు. విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈ సీజన్‌ను ప్రారంభించినప్పటికీ, అనూహ్యంగా వరుస పరాజయాలతో ఇంటిదారి పట్టింది. చివరన పుంజుకొని హ్యాట్రిక్ విజయాలు సాధించినా టోర్నీలో ఇక ముందుకు సాగలేకపోయింది. 14 మ్యాచ్‌లలో 6 గెలిచింది. ఓ మ్యాచ్ రద్దు కావడంతో 13 పాయింట్స్ తో ఆరో స్థానంలో నిలిచింది. మహమ్మద్ షమీ, నితీశ్ కుమార్ రెడ్డి, ఇషాన్ కిషన్, ట్రావిస్ హెడ్, ప్యాట్ కమిన్స్, జీషన్ అన్సారీ అంతగా రాణించలేకపోయారు. వీరి వైఫల్యం సన్‌రైజర్స్ విజయవకాశాలను దారుణంగా దెబ్బతీసింది. ఈ క్రమంలో డిసెంబర్ చివరి వారంలో ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించిన మినీ వేలం జరగనుంది. ఈ నెల 15లోపు రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాలను ఫ్రాంచైజీలు ప్రకటించాల్సి ఉంది. జట్టుకు భారంగా మారినవారిని వదులుకునేందుకు పలు యాజమాన్యాలు సిద్ధమయ్యాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా అదే దారిలో ఉంది. స్టార్ పేసర్ షమీతో పాటు అభినవ్ మనోహర్, జీషన్ అన్సారీ, రాహుల్ చాహర్, ఆడమ్ జంపాను వదులుకునే అవకాశాలు ఉన్నాయి. ఆడమ్ జంపా గాయంతో ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. వదిలేసే ఆటగాళ్ల జాబితా: షమీ (రూ.10 కోట్లు), రాహుల్ చాహర్ (రూ.3.20 కోట్లు), ఆడమ్ జంపా (రూ.2.4 కోట్లు), జీషన్ అన్సారీ (రూ.40 లక్షలు), అభినవ్ మనోహర్ (రూ.3.20 కోట్లు).



టీ20 ప్రపంచకప్‌లో ఏపీ, తెలంగాణకు అన్యాయం

- వేదికల కేటాయింపులో బీసీసీఐ పక్షపాతం


పురుషుల టీ20 ప్రపంచకప్ షెడ్యూలును ప్రకటించడానికి ఐసీసీ సమాయత్తమవుతోంది. ఇప్పటికే షెడ్యూల్‌ను పంపించాలని బీసీసీఐని ఆదేశించింది. వచ్చే యేడాది ఫిబ్రవరి 6 నుంచి మార్చి 8 వరకు టీ20 ప్రపంచకప్ జరగనుంది. భారత్-శ్రీలంక ఈ టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్నాయి. ప్రత్యేక పరిస్థితులు ఉన్నందున పాకిస్తాన్ మ్యాచ్‌లన్నీ శ్రీలంకలో జరగనున్నాయి. పాకిస్తాన్ ఫైనల్ చేరినా శ్రీలంకలోనే జరుగుగుంది. ఈ మెగా టోర్నీకి అహ్మదాబాద్, కోల్‌కతా, చెన్నై, ముంబై నగరాలతో బీసీసీఐ జాబితా రూపొందించిందని సమాచారం. ఒక్కో వేదికగా ఆరు మ్యాచ్‌లు జరుగుతాయి. ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్ లో నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. శ్రీలంకలోని కొలంబో, పల్లెకెలె, గాలే వేదికగా టీ20 ప్రపంచకప్ 2026 మ్యాచ్‌లు జరగనున్నాయి. అయితే, టీ20 ప్రపంచకప్ 2026 వేదికల విషయంలో తెలుగు రాష్ట్రాలకు అన్యాయమే జరిగిందని అంటున్నారు. అటు బీసీసీఐ రూపొందించిన జాబితాలో వైజాగ్, హైదరాబాద్ నగరాలు లేకపోవడంపై అభిమానులు మండిపడుతున్నారు. సౌతిండియా నుంచి ఒక్క చెన్నైనే ఎంపిక చేయడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మైదానాల కేటాయింపులో రొటేషన్ పాటిస్తామని చెప్పే బీసీసీఐ అహ్మదాబాద్, చెన్నై, ముంబై నగరాలకు మాత్రం ఈ నిబంధనలను ఎందుకు వర్తింపచేయలేదని ఆగ్రహం చెందుతున్నారు. బీసీసీఐలో గుజరాత్, ముంబైదే పూర్తి పెత్తనంగ నడుస్తోందని ఆరోపిస్తున్నారు. హెచ్ సీఏలో గొడవలు కూడా ఇక్కడ మ్యాచ్‌లు కేటాయించకపోవడానికి కారణంగా మారిందనే అభిప్రయాలూ ఉన్నాయి.



సంచారీ... సమయం ఆసన్నమైంది

మహేశ్, రాజమౌళి మూవీ నుండి 'గ్లోబ్ ట్రాటర్' లిరిక్స్ రిలీజ్

యావత్ టాలీవుడ్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న SSMB29 బిగ్గెస్ట్ ఈవెంట్ నవంబర్ 15న రామోజీ ఫిల్మ్ సిటీలో కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేందుకు చిత్ర యూనిట్ రెడీ అవుతోంది. సూపర్ స్టార్ మహేష్‌బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న SSMB29 నుండి రాబోయే అప్డేట్స్ కోసం అందరూ ఆతృతగా చూస్తున్నారు. ఇక ఈ వేడుకకు ఇంకో ఐదు రోజులే మిగిలి ఉంది. అయితే, అందరినీ అవాక్కయ్యేలా చేస్తూ ఈ సినిమా నుండి తాజాగా 'గ్లోబ్ ట్రాటర్' అనే లిరికల్ సాంగ్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇది మహేష్ ఫ్యాన్స్‌తో పాటు అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. కీరవాణి కంపోజ్ చేసిన ఈ పాటను శ్రుతి హాసన్ పాడటం విశేషం. చైతన్య ప్రసాద్ అందించిన ఈ పాట లిరిక్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. అయితే, ఇందులో 'సంచారి' అంటూ హీరో పాత్రను వివరించారు. దీంతో ఇప్పుడు అభిమానుల్లో ఈ చిత్ర టైటిల్ పై మరో కొత్త చర్చ జరుగుతోంది. ఈ సినిమాకు 'వారణాసి' అనే టైటిల్ పెడతారని ఇప్పటికే బజ్ ఉండగా.. ఇప్పుడు 'సంచారి' అనే టైటిల్ కూడా వినిపిస్తోంది. ఈ విషయంపై క్లారిటీ రావాలంటే నవంబర్ 15 వరకు వెయిట్ చేయాల్సిందే. ఇక ఈ బిగ్గెస్ట్ గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్‌లో శ్రుతి హాసన్ ఈ పాటకు లైవ్ పర్ఫార్మెన్స్ ఇవ్వనుంది.



భర్త మహాశయులకు విజ్ఞప్తి

- టైటిల్ గ్లింప్స్ రిలీజ్

మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్న ఎంటర్‌టైనర్ #RT76తో అలరించబోతున్నారు . SLV సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని హై ప్రొడక్షన్ వాల్యూస్ తో నిర్మిస్తున్నారు. జీ స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఇందులో రవితేజ సరసన ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి కథానాయికలుగా నటిస్తున్నారు. ఈరోజు, మేకర్స్ హ్యూమరస్ గ్లింప్స్ ద్వారా సినిమా టైటిల్‌ను రిలీజ్ చేశారు. దర్శకుడు కిషోర్ తిరుమల వాయిస్ ఓవర్‌లో వివరించిన టెంపుల్ అనౌన్స్మెంట్ తో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. ఈ అనౌన్స్మెంట్ గురించి రవితేజ క్యారెక్టర్ మాట్లాడుతూ.. 'నా జీవితంలోని ఇద్దరు ఆడాళ్లు నన్ను రెండు ప్రశ్నలు అడిగారు. సమాధానం కోసం చాలా ఆలోచించాను. గూగుల్ ఏఐ అన్నిటిని అడిగాను. మేబి వాటికి పెళ్లి కాకపోవడం వల్ల నన్ను ఇంకా కన్ఫ్యూజ్ చేశాయి. అనుభవం ఉన్న మగాళ్ళని ముఖ్యంగా మొగుళ్ళని అడిగాను. ఆశ్చర్య పోయారే తప్పా ఆన్సర్ మాత్రం ఇవ్వలేకపోయారు. అలాంటి ప్రశ్న మిమ్మల్ని ఏ ఆడవాళ్లు అడకూడదని, పెళ్లయిన వాళ్ళకి నాలాంటి పరిస్థితి ఎదురవకూడదని కోరుకుంటూ.. మీ ఈ రామసత్యనారాయణ చెప్పేది ఏమిటంటే.. భర్త మహాశయులకు విజ్ఞప్తి'' అంటూ తనను రామ సత్యనారాయణగా పరిచయం చేసుకోవడం, భర్త మహాశయులకు విజ్ఞప్తి టైటిల్ రివిల్ కావడం అదిరిపోయింది. రవితేజ చాలా రోజుల తర్వాత ఫ్యామిలీ ఫ్రెండ్లీ ఎంటర్టైనర్ చేయడం రిఫ్రెషింగ్‌గా ఉంది. తన అద్భుతమైన కామెడీ టైమింగ్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో తన వెర్సటిలిటీని ప్రజెంట్ చేశారు. దర్శకుడు కిషోర్ తిరుమల టచ్‌తో టైటిల్ ఫ్యామిలీ ఫీలింగ్ కలిగించింది. గ్లింప్స్ చూస్తే సినిమా పక్కా ఎంటర్టైనింగ్‌గా, మనసుని హత్తుకునేలా ఉండబోతోందని అనిపిస్తోంది.

'పాంచ్ మినార్' నవంబర్ 21న రిలీజ్


రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ 'పాంచ్ మినార్'. గోవింద రాజు ప్రజెంట్ చేస్తున్న ఈ చిత్రాన్ని కనెక్ట్ మూవీస్ ఎల్ ఎల్‌పీ బ్యానర్ పై మాధవి, ఎంఎస్ఎం రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన సాంగ్స్, టీజర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. సోమవారం మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. నవంబర్ 21న ఈ చిత్రం విడుదల కానుంది. రాజ్ తరుణ్, అజయ్ ఘోష్, రాశి సింగ్, శ్రీనివాస్ రెడ్డి ఇంటెన్స్ లుక్ లో కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ ఇంట్రస్టింగ్ గా వుంది. ఈ చిత్రంలో రాశి సింగ్ హీరోయిన్ గా నటిస్తున్నారు. అజయ్ ఘోష్, బ్రహ్మాజీ, శ్రీనివాస్ రెడ్డి, నితిన్ ప్రసన్న, రవి వర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు.





'దండోరా' డిసెంబర్ 25న రిలీజ్

నేషనల్ అవార్డ్ గెలుచుకున్న చిత్రం 'కలర్ ఫోటో'..బ్లాక్‌బస్టర్ మూవీ 'బెదురులంక 2012' చిత్రాలను నిర్మించి అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని రూపొందిస్తోన్న తాజా చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ మూవీ చిత్రీకరణ దశలో ఉంది. తాజాగా ఈ సినిమాను క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 25న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన పోస్టర్ రిలీజైంది. పోస్టర్‌ను గమనిస్తే ఇన్నోవేటివ్‌గా ఉంది. ఓ ఖాళీ ప్రాంతంలో తవ్విన గొయ్యి కనిపిస్తోంది. అందులో ఈ ఏడాదికి డ్రామటిక్‌గా ముగింపునిస్తున్నాం అనే క్యాప్షన్‌తో రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఇప్పటికే వెర్సటైల్ ప్రమోషనల్ కంటెంట్‌తో ఎక్స్‌పెక్టేషన్స్ పెంచుకుంటోన్న దండోరా సినిమా సామాజిక స్పృహను కలిగించే అంశంతో తెరకెక్కుతోంది. అగ్ర వర్ణాలకు చెందిన అమ్మాయిల ప్రేమించి పెళ్లి చేసుకున్నా, అగ్ర వర్ణాలకు ఎదురు తిరిగినా ఎలాంటి దౌర్జన్యకాండ జరుగుతున్నాయనే అంశాన్ని ఆధారంగా చేసుకుని దండోరా సినిమాను తెరకెక్కిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో మన పురాతన ఆచారాలు, సాంప్రదాయాలను ఆవిష్కరిస్తూనే వ్యంగ్యం, చక్కటి హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల కలయికగా ఈ సినిమాను ఆవిష్కరిస్తున్నారు. ఈ చిత్రంలో విలక్షణ నటుడు శివాజీతో పాటు నవదీప్, నందు, బిందు మాధవి, రవి కృష్ణ, మణిక, అనూష, రాధ్య తదితరులు..ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.



'సిగ్మా' ఫస్ట్ లుక్ రిలీజ్

సుబాస్కరన్ లైకా ప్రొడక్షన్స్ నిర్మాణంలో జాసన్ సంజయ్ దర్శకత్వంలో యాక్షన్‌అడ్వెంచర్ కామెడీ "సిగ్మా" చిత్రం 65 రోజుల షూటింగ్ పూర్తి చేసుకున్నట్లు అనౌన్స్ చేశారు. నాలుగు నెలల పాటు జరిగిన షూటింగ్ ఇప్పుడు సినిమా షెడ్యూల్‌లో 95% పూర్తయింది. ఈ చిత్రానికి "సిగ్మా" అనే టైటిల్ ఫిక్స్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో హీరో సందీప్ కిషన్ యాక్షన్ అవతార్ కనిపించారు. బంగారం, నోట్ల కట్టల మధ్య కూర్చొని, తన చేతికి బ్యాండేజ్ కడుతున్నట్లుగా కనిపించిన సుందీప్ లుక్ అదిరిపోయింది. ఈ పవర్ ఫుల్ ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా హీరో పాత్రలోని ఇన్‌టెన్స్ యాంగిల్‌తో పాటు సినిమా ట్రెజర్ హంట్ కథాంశాన్ని సూచిస్తోంది. "సిగ్మా" కథ ఒక ధైర్యశాలి, నియమాలకు అతీతమైన వ్యక్తి నేపథ్యంలో వుంటుంది. అతని ప్రయాణం థ్రిల్లింగ్ ట్రెజర్ హంట్, హైస్టేక్స్ క్రిమినల్ హీస్ట్ అంశాలతో కలిపి, యాక్షన్, అడ్వెంచర్ గా వుంటుంది. ఈ చిత్రంలో సుందీప్ కిషన్ పూర్తి స్థాయి యాక్షన్ హీరోగా అలరించనున్నారు. భాషా, ప్రాంతీయ హద్దులను దాటి అతని నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటూ, అతడిని పాన్ఇండియన్ స్టార్‌గా నిలబెడుతుంది ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా, రాజు సుందరం, అన్బు థాసన్, యోగ్ జాపీ, సంపత్ రాజ్, కిరణ్ కొండ, మహాలక్ష్మి, సుదర్శనన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మరికొన్ని ఎక్సయిటింగ్ అతిధి పాత్రలు ఉన్నాయి.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200